www.andhrajyothy.com
పేజీలు : 14 + 28
పేజీల ఆదివారం అనుబంధం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 8.00

ఆదివారం | 14-12-2025

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: దశమి రా. 6:50 తదుపరి ఏకాదశి, నక్షత్రం: హస్త ఉ.8:18 తదుపరి చిత్త, వర్జ్యం: సా.5:15-7:02. దుర్ముహూర్తం: సా.4:11-4:55, అమృతఘడియలు: తె.3:59-5:46, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:40, సూర్యాస్తమయం: 5:38

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 278
గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


టీ-సీఎం రేవంత్‌రెడ్డి

కిక్కు కేక!

మెస్సీ మేనియాతో ఊగిన హైదరాబాద్

లియోనిల్ మెస్సీ, రేవంత్ రెడ్డి ఆట అదుర్స్.. ఉప్పల్ స్టేడియంలో గోట్ కప్ ఫ్రెండ్లీ మ్యాచ్ 10

ఫుట్‌బాల్‌ను కిక్ చేసి.. ప్రేక్షకుల్లోకి పంపించి అభిమానులను ఉర్రూతలూగించిన మెస్సీ, రోడ్రిగో


లియోనిల్ మెస్సీ

మనకు ఆటలంటే.. క్రికెట్.. ఆ తర్వాత టెన్నిస్! కానీ, తెలుగు రాష్ట్రాల్లో ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా ఇప్పుడు ఫుట్‌బాల్‌కు క్రేజ్ విపరీతంగా పెరగనుంది! ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా ఆటగాడు లియోనిల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన ఇందుకు తోడ్పడనుంది! మెస్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య శనివారం హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఫ్రెండ్లీ (గోట్ కప్) మ్యాచ్ ఆద్యంతం సరదాగా.. సంబరంలా సాగింది. స్టేడియంలో ఉన్న ప్రేక్షకుల్లోనే కాదు.. టీవీల ముందు కూర్చున్న వారిలో కూడా ఉత్సాహం ఉరకలెత్తేలా చేసింది. మెస్సీ మేనియాతో సాకర్ అభిమానులు ఊగిపోయారు. మెస్సీ, అర్జెంటీనాకే చెందిన మరో దిగ్గజ ఆటగాడు రోడ్రిగో జేవియర్ డీ పాల్, ఉరుగ్వే ప్లేయర్ సువారెజ్ సాధారణ దుస్తుల్లోనే గ్రౌండ్లోకి అడుగుపెట్టారు! కాసేపు ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు! తర్వాత అంతా కలిసి స్కూలు, కాలేజీ పిల్లలతో సరదాగా ఆటాడుకున్నారు!


అభిమానుల కేరింతలు

2 నుంచి పుస్తక సంబరం

బెజవాడలో 11 రోజులు నిర్వహణ

ఇందిరాగాంధీ స్టేడియం వేదిక 12

21న పల్స్ పోలియో 3

పంచాయతీ ఎన్నికలకు రోడ్ మ్యాప్

మారనున్న గ్రామీణ ముఖచిత్రం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూటమి ప్రభుత్వం గ్రామాలకు అభివృద్ధి 'బాటలు' వేస్తోంది. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు నూతన వైభవం తీసుకొచ్చేలా ముందుకు సాగుతోంది. స్థానిక ఎన్నికలకు ముందస్తు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. ప్రస్తుత పంచాయతీల గడువు వచ్చే ఏడాది ఏప్రిల్ 2తో ముగియనుంది. వెనువెంటనే ఎన్నికల నిర్వహణ చేపట్టనున్నారు. ఎన్నికల కంటే ముందుగా పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై

మిగతా 12వ పేజీలో...

కమలానికి నాథుడేడి?



8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీల స్థాయికి ఎదిగిన బీజేపీ తెలంగాణలో క్రమంగా ఎందుకు చతికిలపడుతోంది? కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని వ్యంగ్యంగా అంటూ ఉంటారు. భారతీయ జనతా పార్టీలో అలా ఉండదని, ఆ పార్టీ క్రమశిక్షణకు మారు పేరని భావిస్తారు. అయితే తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా తయారైంది. కాంగ్రెస్ నాయకుల్లా బహిరంగంగా ఒకరినొకరు విమర్శించుకోకపోయినా అంతర్గతంగా కత్తులు దూసుకోవడం మొదలెట్టారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీజేపీ తన పట్టును ప్రదర్శించలేక పోయింది. తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉంది. నిజానికి తెలంగాణలో బీజేపీ బలపడడానికి ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. ఎందుకంటే బీఆర్ఎస్ ప్రస్తుతం అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతోంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

కమిషన్లు ఖాళీ!

రాజ్యాంగబద్ధ పదవుల భర్తీ ఎప్పుడు?

చైర్మన్లు, కమిషనర్లు లేక సంస్థల వెలవెల 13

రెండేళ్లుగా ఏపీఈఆర్సీ, ఏపీహెచ్ఆర్సీ ఖాళీ

ఆర్టీఐ, ఏపీపీఎస్సీ, లోకాయుక్త, బీసీ కమిషన్ వంటి అనేక సంస్థలు కూడా అదే బాటలో

హైకోర్టు ప్రశ్నించినా పట్టించుకోని ప్రభుత్వం

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచిపోతోంది. కానీ, రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీపై ఇంత వరకూ దృష్టి సారించలేదు. సమాచార, మానవహక్కుల కమిషన్, విద్యుత్ నియంత్రణ మండలి వంటి కీలక సంస్థలు అధిపతులు లేక అచేతనంగా ఉంటున్నాయి. వీటిలో కొన్ని పదవులు కూటమి అధికారంలోకి వచ్చే నాటికే ఖాళీగా ఉండగా మరికొన్ని ఆ తర్వాత ఖాళీ అయ్యాయి. ఎప్పటికప్పుడు వీటిని భర్తీ చేసుకుంటూ వచ్చినా కూటమి అధికారంలో ఉండే ఐదేళ్లలో రెండు విడతలుగా ఈ పదవులను భర్తీ చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ, ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

ఉపాధి వేతనాలు భారీగా పెండింగ్

- దేశ వ్యాప్తంగా రూ. 1,340 కోట్ల బకాయిలు
- నాలుగు రాష్ట్రాల్లోనే అత్యధికం.. పెండింగ్‌లో తొలి స్థానంలో ఏపీ
- తర్వాత స్థానాల్లో కేరళ, తమిళనాడు, ఎంపీ
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డేటా వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 13: జాతీయ స్థాయిలో ఉపాధి హామీ పథకంలో వేతనాలు భారీగా పెండింగ్ ఉన్నాయి. దేశ వ్యాప్తంగా మొత్తం రూ. 1,340 కోట్ల బకాయిలు ఉండగా.. దీనిలో కేవలం నాలుగు రాష్ట్రాల్లోనే సుమారు రూ. 1,095 కోట్లు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ మొత్తంలో దాదాపు 80 శాతం ఈ నాలుగు రాష్ట్రాల్లోనే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డేటా వెల్లడించింది. ఆ డేటా ప్రకారం.. డిసెంబరు 5 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా రూ. 402.93 కోట్లు, కేరళలో 339.87 కోట్లు, తమిళనాడులో రూ. 220.13 కోట్లు, మధ్యప్రదేశ్‌లో రూ. 131 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్ఆర్ఈజీఏ పోర్టల్ డేటా ప్రకారం ఉపాధి హామీ పథకం కింద దేశంలో మొత్తం 27.64 కోట్ల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో 12.16 కోట్ల మంది డిసెంబరు 1 నాటికి క్రియాశీలంగా ఉన్నారు. ఏపీలో మొత్తం 1.1 కోట్ల మంది ఉపాధి కార్మికులు రిజిస్టర్ అయి ఉండగా వారిలో 90.54 శాతం మంది క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఆరో స్థానంలో ఉంది. కానీ, పెండింగ్ వేతనాలు చూస్తే దేశం మొత్తంలో 30 శాతం ఏపీలోనే ఉన్నాయి. ఇక కేరళలో 58.03 మంది ఉపాధి కార్మికులు ఉండగా.. 25 శాతం వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక పెద్ద రాష్ట్రాలు, కార్మికులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో పెండింగ్ శాతం తక్కువగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 2.34 కోట్ల మంది కార్మికులు రిజిస్టర్ అయ్యారు. వారిలో 1.2 కోట్ల మంది క్రియాశీలంగా పనిచేస్తున్నారు. దేశంలో పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో ఆ రాష్ట్ర వాటా 2.5 శాతంగా మాత్రమే ఉంది. రాజస్థాన్‌లో 2.33 కోట్ల మంది కార్మికులు రిజిస్టర్ అయి ఉండగా.. జాతీయ స్థాయి పెండింగ్‌లో ఆ రాష్ట్ర వాటా కేవలం 0.38 శాతంగా ఉండటం విశేషం. ఉపాధి హామీ పథకంలో పని దినాల కల్పన, వేతనాల మంజూరు నిరంతరం జరిగే ప్రక్రియ. డీబీటీ ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వం వేతనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. గ్రామీణాభివృద్ధి శాఖ పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) రాష్ట్రాల నుంచి వచ్చిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆధారంగా ఆ నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. నవంబరు నెలాఖరుకు రూ. 68,393.67 కోట్లను రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం విడుదల చేసింది. కార్మికుల ఖాతాలు, బ్యాంకు ఖాతాల మధ్య ఇబ్బందులు ఉంటే నగదు జమ పెండింగ్‌లో ఉండిపోతుంది.

ఓటు చోరీపై ఢిల్లీలో నేడు కాంగ్రెస్ మహార్యాలీ

న్యూఢిల్లీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీ ఆరోపణలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఢిల్లీలో మహార్యాలీని నిర్వహించనుంది. రామ్‌లీలా మైదానంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ ర్యాలీ ప్రారంభంకానుంది. ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడానికి మోదీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం (ఈసీ) కుమ్మక్కయ్యాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకే కాంగ్రెస్ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ట్రంప్ విధానాలపై తిరుగుబాటు

వర్క్ పర్మిట్‌లో మార్పులను సవాల్ చేసిన 10 మంది అమెరికా సెనేటర్లు



వాషింగ్టన్, డిసెంబరు 13: విదేశీ ఉద్యోగులు, వస్తువులపై ఎడాపెడా ఆంక్షలు, సుంకాలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశంలోని కాంగ్రెస్ సభ్యులు తిరుగుబాటు మొదలుపెట్టారు. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఉన్న ఆటోమెటిక్ వర్క్ పర్మిట్ రెన్యూవల్ అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం గత అక్టోబరు 30న రద్దు చేసింది. శరణార్థుల జీవిత భాగస్వాములతో పాటు కొన్నిరకాల హెచ్1బీ వీసాదారుల విషయంలో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈ నిర్ణయం తీసుకుంది. అంతకుముందు హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు వర్క్ పర్మిట్ రెన్యూవల్ కోసం చట్టబద్ధంగా గడువులోపు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి దర్యాప్తు, పరిశీలనలు లేకుండా రెన్యూవల్ అయ్యేది. ఈ విధానాన్ని ట్రంప్ ప్రభుత్వం రద్దుచేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాలిఫోర్నియా సెనేటర్ అలెక్స్ పదిల్లా, మరో 9మంది కలిసి సెనేట్ (ఎగువసభ)లో కాంగ్రెషనల్ రివ్యూ యాక్ట్ (సీఆర్‌ఏ) తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం అధ్యక్షుడి నిర్ణయాలను సమీక్షించే అధికారం సభకు ఉంటుంది. 'అధ్యక్షుడి నిర్ణయం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారింది. దేశానికి ఎంతో సేవ చేస్తున్న ఉద్యోగులు నాశనమవుతున్నారు' అని అలెక్స్ పదిల్లా పేర్కొన్నారు.

హెచ్1బీ వీసా ఫీజు పెంపుపై న్యాయపోరాటం

విదేశీ వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్1బీ వీసాల ఫీజును గత సెప్టెంబరు 21నుంచి ట్రంప్ ప్రభుత్వం ఏకంగా లక్ష డాలర్ల (దాదాపు రూ.90 లక్షలు)కు పెంచిన విషయం తెలిసిందే. అంతకుముందు అది 2 వేల నుంచి 5వేల డాలర్ల మధ్య ఉండేది. ట్రంప్ నిర్ణయంతో అమెరికాకు అవసరమైన విదేశీ వృత్తి నిపుణులు అక్కడికి వెళ్లలేని పరిస్థితి వచ్చింది. దీంతో ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాలిఫోర్నియా రాష్ట్రం నేతృత్వంలో 20రాష్ట్రాలు కలిసి బోస్టన్ ఫెడరల్ కోర్టులో కేసు వేసి న్యాయపోరాటానికి దిగాయి. 'ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికాకు కీలకమైన టీచర్లు, వైద్యులు, పరిశోధకులు, నర్సులు తదితర విభాగాల్లో నిపుణులైన విదేశీ ఉద్యోగుల కొరత ఏర్పడింది' అని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా ఆరోపించారు.

భారత్‌పై సుంకాలను వ్యతిరేకిస్తూ తీర్మానం

అమెరికాకు ఎగుమతి అయ్యే భారతీయ వస్తువులపై ట్రంప్ 50% ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలే నష్టపోతున్నారని, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్(దిగువ సభ)లో డెమోక్రాటిక్ సభ్యులు రాజా కృష్ణమూర్తి, డెబోరా రాస్, మార్క్ వీసే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సుంకాలు చట్టవ్యతిరేకమని వారు ఆరోపించారు.

కేరళలో కమల వికాసం!

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో తొలిసారి బీజేపీ విజయం

- 101 వార్డుల్లో 50 స్థానాలు కైవసం
- ఇది సరికొత్త చరిత్ర: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 13: కేరళలో కమలం వికసించింది!. దాదాపు 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో తొలిసారి బీజేపీ ఇక్కడ భారీ విజయాన్ని నమోదు చేసింది. తాజాగా జరిగిన తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో 101 వార్డులకుగాను 50 స్థానాలు దక్కించుకుని కార్పొరేషన్‌పై కాషాయ పతాకాన్ని ఎగురవేసింది. వాస్తవానికి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తిరువనంతపురం పార్లమెంటు స్థానంలోనే కార్పొరేషన్ పరిధి ఉంది. అలాంటి చోట బీజేపీ భారీ విజయం నమోదు చేయడం విశేషం. అధికార కూటమి లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్)కు ఈ ఎన్నికల్లో ప్రజలు భారీ ఓటమిని కట్టబెట్టారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ విజయం ఆ పార్టీలో మరింత జోష్ పెంచింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఊహించని విధంగా 50 వార్డుల్లో విజయం దక్కించుకోవడం పట్ల కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఒక సీటును, దాదాపు ఐదేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక స్థానాన్ని మాత్రమే బీజేపీ కైవసం చేసుకుంది. అలాంటి పరిస్థితి నుంచి తిరువనంతపురం కార్పొరేషన్‌లో పాగా వేసే వరకు చేరుకోవడం గమనార్హం. కాగా, తాజా ఎన్నికల్లో.. ఎన్డీయే 50 స్థానాల్లో గెలవగా ఎల్‌డీఎఫ్ 29, యూడీఎఫ్ 19 వార్డులకే పరిమితమయ్యాయి. మరో రెండు చోట్ల స్వతంత్రులు విజయం దక్కించుకున్నారు. మరోవైపు, ఎర్నాకుళం కార్పొరేషన్‌ను కూడా ఎన్డీయే కైవసం చేసుకుంది.

మార్పునకు సంకేతం: శశిథరూర్

కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ.. కేరళ రాజకీయాల్లో ఇది గణనీయమైన మార్పునకు సంకేతమని అభివర్ణించారు. కాంగ్రెస్, యూడీఎఫ్‌ల తరపున విజయం దక్కించుకున్న కార్పొరేటర్లకు శుభాకాంక్షలు చెబుతూనే బీజేపీ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ప్రజల ఆకాంక్షలకు ఈ ఎన్నికలు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. కాగా, వక్ఫ్ భూముల వివాదంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఎర్నాకుళం జిల్లాలోని 'మునంబం' వార్డును కూడా బీజేపీ దక్కించుకుంది. 2019 నుంచి ఈ ప్రాంతం హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడి 404 ఎకరాల భూమిని కేరళ వక్ఫ్‌బోర్డు తమ ఆస్తిగా ప్రకటించుకుంది. దీంతో ఇక్కడ నివసిస్తున్న 500 మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడ్డాయి.



తిరువనంతపురంలో సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ మహిళా నేతలు

స్థానికంలో 'యూడీఎఫ్' స్వీప్

కొచ్చి: కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి మెజారిటీ బ్లాక్ పంచాయతీలను దక్కించుకుంది. అధికార ఎల్‌డీఎఫ్ కూటమి రెండో స్థానంలో నిలవగా ఎన్డీయే కూడా సత్తా చాటుతోంది. శనివారం రాత్రి కడపటి వార్తలు అందేసరికి యూడీఎఫ్ 82, ఎల్‌డీఎఫ్ 65 బ్లాక్ పంచాయతీలను సొంతం చేసుకున్నాయి.

లోకం తీరు



ఇండోర్‌లో 40 రోజుల్లో 150 పెళ్లిళ్లు పెటాకులు!

- 60-70% వివాహాల రద్దుకు సోషల్ మీడియాలో వ్యవహార శైలే కారణం..

ఇండోర్, డిసెంబరు 13: ఒకప్పుడు పెళ్లి అంటే.. అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూడాలనేవారు.. ఇప్పుడా పరిస్థితి లేదు.. ఏదేమైనా వివాహం చేసుకునే అమ్మాయి లేదా అబ్బాయి సోషల్ మీడియా ఖాతాలు వెతికి పరిశీలిస్తే చాలు.. వారు ఎలాంటి వారో పూర్తిగా ఇట్టే తెలిసిపోతుంది. అయితే ఈ కారణంగానే పీటల వరకు వచ్చిన పెళ్లిళ్లు సైతం పెటాకులు అవుతున్నాయి. చివరి నిమిషంలో పెళ్లి రద్దు చేసుకోవడం ఇప్పుడు సర్వసాధారణంగా మారుతోంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 40 రోజుల్లో 150 జంటలు తమ వివాహాలను రద్దు చేసుకున్నాయి. అయితే ఇందులో 60-70% పెళ్లిళ్లు పెటాకులు కావడానికి కారణం సోషల్ మీడియాతోనే ముడిపడి ఉందని ఓ ప్రముఖ హిందీ దినపత్రిక ఇటీవల నిర్వహించిన పరిశోధనలో తేలింది. సోషల్ మీడియాలో వారి సంబంధాల గురించి చేసిన పాత పోస్టులు, వ్యాఖ్యలు, ఎమోజీలు లేదా వారి స్నేహితుల జాబితాలు కూడా కారణంగా ఉన్నాయి. మిగిలిన పెళ్లిళ్ల రద్దు విషయానికొస్తే కుటుంబ సభ్యుల మరణాలు లేదా ప్రమాదాలు, పరస్పర విభేదాలు, ఊహించని పరిస్థితులకు సంబంధించిన కారణాలున్నాయి. ఇక ఇండోర్-గుజరాత్‌కు చెందిన ఓ జంట ప్రీ వెడ్డింగ్ షూట్ సమయంలో వధువు సోషల్ మీడియా ఖాతాలో చేసిన పాత పోస్టులపై గొడవ జరిగి పెళ్లి రద్దయింది.

ధ్వజస్తంభాల కోసం 'దివ్య వృక్షాల పెంపకం' ప్రాజెక్టు

» వంద ఎకరాల్లో శ్రీకారం

తిరుమల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలయాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 'దివ్య వృక్షాల పెంపకం' ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టినట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను పెంచి, పరిరక్షించి వినియోగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. నిటారుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన వృక్ష కాండంతో ధ్వజస్తంభం తయారు చేయాల్సి ఉంటుందన్నారు. సాధారణంగా టేకు, ఏగిస(ఇండియన్ కినో) టెర్మినలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను టీటీడీ నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయలను నిర్మించనున్నారు. ఆ ఆలయాల ధ్వజస్తంభాలకు అవసరమైన వృక్షాలకు దేశంలో కొరత ఉండడంతో టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది.

ఏపీటీడీసీ ఎండీ నేతృత్వంలో టెండర్ మూల్యాంకన కమిటీ

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు పర్యాటక క్లస్టర్లలో ఉన్న 22 ఏపీటీడీసీ ఆస్తులకు సంబంధించి ఆపరేషన్ మెయింటెనెన్స్‌కు ప్రభుత్వం టెండర్ విధానంలోకి వెళ్తోంది. ప్రతి క్లస్టర్‌లో ఒక మంచి బిడ్డర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్ ఎవల్యూషన్ కమిటీ(టెండర్ మూల్యాంకన కమిటీ)ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి ఏపీటీడీసీ ఎండీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కో-ఛైర్మన్‌గా ఏపీ టూరిజం అథారిటీ సీఈవోని నియమించారు. ఇందులో ఆరుగురు సభ్యులతో పాటు ఇద్దరు ఆహ్వానితులను ప్రభుత్వం నియమించింది. వీపీపీ ఎక్స్‌పర్ట్, ఏపీటీడీసీ జనరల్ మేనేజర్, ఐఎన్‌క్యాప్ చీఫ్ జనరల్ మేనేజర్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్, టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధి ఒక్కరిని సభ్యులుగా నియమించారు. దీనిపై ఏపీటీడీసీ ఎండీ తదుపరి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీఆర్ఎస్ఏలో ప్రతిభావంతులకు ప్రోత్సాహం కరవు

» అంతర్జాతీయ స్కేటర్ జెస్సీరాజ్ తల్లిదండ్రుల ఆవేదన

మంగళగిరి సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏపీలో నిర్వహించిన జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2025లో మంగళగిరికి చెందిన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీత, అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటర్ జెస్సీరాజ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని తల్లిదండ్రులు మాత్రపు సురేష్, రాధ ఆవేదన వ్యక్తం చేశారు. జెస్సీరాజ్ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. డెహ్రాడూన్‌లో ఒలింపిక్ చాంపియన్, అంతర్జాతీయ స్థాయి కోచ్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి శిక్షణలో పాల్గొనేందుకు వెళ్లగా, అదే తేదీల్లో ఏపీఆర్ఎస్ఏ విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ శిక్షణ శిబిరానికి హాజరు కాలేకపోయిందని తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జెస్సీరాజ్‌ను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అనుమతి నిరాకరించిందన్నారు. శాప్ యాజమాన్యం, మంత్రుల కార్యాలయం నుంచి అభ్యర్థనలు వచ్చినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ నెల 7న పోటీలు ప్రారంభమైన తర్వాత ఏపీఆర్ఎస్ఏ అనుమతి ఇచ్చినప్పటికీ, జెస్సీరాజ్‌ను ఏపీకి చెందని క్రీడాకారిణిగా ప్రకటించి, కేవలం వైల్డ్ కార్డ్ ఎంట్రీగా మాత్రమే పరిగణిస్తామని చెప్పి అవమానించారని తెలిపారు. ఈ అవమానంతో జెస్సీరాజ్ పోటీలను బహిష్కరించవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఆర్ఎస్‌లో క్రీడా స్ఫూర్తి లేకపోవడం వలన ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం వుండడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం, క్రీడా శాఖా మంత్రి జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరిపించి జెస్సీరాజ్‌కు న్యాయం చేయాలని కోరుతున్నారు.

21న పల్స్ పోలియో

» 54.07 లక్షల మంది పిల్లలకు చుక్కలు

» రాష్ట్రంలో 38,267 బూత్‌లు ఏర్పాటు

» 22, 23 తేదీల్లో ఇంటింటికి మొబైల్ టీమ్స్: మంత్రి సత్య



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లలోపు వయసున్న 54,07,663 మంది పిల్లలకు 38,267 బూత్‌ల్లో పోలియో చుక్కలు వేసేందుకు 61.26 లక్షల డోసులను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌స్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజారు, పర్యాటక ప్రదేశాల్లో 1140 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 21న పోలియో దినం సందర్భంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆ రోజు ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు 22, 23 తేదీల్లో 76,534 బృందాలు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని వివరించారు. 1704 మంది వైద్యాధికారులు, 39,494 మంది ఇతర సిబ్బంది, 4206 మంది పర్యవేక్షకులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సంచార జాతులు, నిర్మాణ స్థలాలు, ఇటుక క్షేత్రాలు, ఇతర వలస ప్రాంతాలు కవర్ చేయడానికి 1854 మొబైల్ బృందాలు పని చేస్తాయన్నారు. ప్రతి మొబైల్ బృందంలో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారన్నారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆస్పత్రులు, మేళాలు, బజార్లలో 21, 22, 23 తేదీల్లో బృందాలు పర్యటిస్తాయన్నారు.

ప్రతి అడుగూ అనుభవ పాఠమే

ప్రశ్నించడం ఆగిపోయిన రోజు వృద్ధులమైనట్టే

» నైతిక విలువలతో జీవిస్తేనే ఆదర్శంగా నిలుస్తాం

» విజయాలను, వైఫల్యాలను ఒకే విధంగా చూడాలి

» డ్యూటీలో ఏఐ సాయం..కానీ అదే డ్యూటీ చేయదు

» ఏయూ పూర్వ విద్యార్థుల భేటీలో సుధామూర్తి వ్యాఖ్యలు



ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సుధామూర్తి. వేదికపై జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీసీ జీపీ రాజశేఖర్, పూర్వ విద్యార్థుల సంఘ ఛైర్మన్ కేవీవీ రావు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో జీవించే వ్యక్తులే ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి అన్నారు. శనివారం సాయంత్రం విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలు కలిగిన వ్యక్తులుగా మారాలని, సమూహంతో కలిసి పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. "డబ్బు అవసరమే. అయితే ఎంత అవసరమన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. అధిక డబ్బు వల్ల కుటుంబాలు నాశనం అవుతాయి. పిల్లలు దురలవాట్లకు దగ్గర అవుతారు." అని వివరించారు. అజ్ఞానాన్ని, అంధకారాన్ని తొలగించేది విద్య మాత్రమేనన్నారు. ప్రతి ఒక్కరూ మాతృ సంస్థను, మాతృ భాషను, మాతృభూమిని గౌరవించడం నేర్చుకోవాలని తెలిపారు. భాష మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, నిత్యం కొత్త విషయాలను నేర్చుకునేందుకు యత్నించాలన్నారు. నేర్చుకోవడం, ప్రశ్నించడం మానేసినప్పుడు మాత్రమే వృద్ధులుగా మారతామని వ్యాఖ్యానించారు. "విజయం, వైఫల్యం అనేవి సర్వసాధారణం. వైఫల్యాల నుంచి పాఠాలను నేర్చుకుని విజయాలకు బాటలు వేసుకోవాలి. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపునకు బాటలు వేసుకున్నవారే ఇప్పుడు వేదికపై కూర్చున్నారు. భవిష్యత్తులో మీరంతా ఈ స్థాయికి చేరుకోవాలి" అంటూ విద్యార్థులకు సుధామూర్తి సూచించారు. వేసే ప్రతి అడుగు ఒక అనుభవ పాఠం కావాలని, నిరంతర విజయాలు అహంకారాన్ని పెంచుతాయన్నారు. జీవితంలో కొంత భాగాన్ని వర్సిటీ నేర్పుతుందని, మిగిలినది మనమే నేర్చుకోవాలని సూచించారు. జీవితం ప్రతిరోజూ పరీక్ష పెడుతుందని, దాన్ని ధైర్యంగా ఎదుర్కొనే తత్వం కలిగి ఉండాలన్నారు. చాట్ జీపీటీ, ఏఐలు ఉద్యోగ జీవితంలో సహాయం చేసేందుకు ఉపయోగపడతాయని, కానీ అవే ఉద్యోగాన్ని నిలబెట్టబోవని సుధామూర్తి వివరించారు.

చంద్రబాబు, లోకేశ్ దూరదృష్టితో విశాఖకు మంచి రోజులు : జీఎంఆర్

ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక ఛైర్మన్, జీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత గ్రంథి మల్లికార్జునరావు మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దూరదృష్టి, గొప్ప కృషితో భారతదేశానికి నెక్స్ట్ టెక్ హబ్‌గా విశాఖ మారబోతోందన్నారు. ఏయూ గ్లోబల్ ఇనిస్టిట్యూట్‌గా వెలుగొందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. భారతదేశ భవిష్యత్తు ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా విశాఖ మార్చబోతోందని తెలిపారు. "మనలోని ప్రతి ఒక్కరూ ఒక్క విద్యార్థికి అయినా మార్గదర్శకత్వం వహించాలి. సమయాన్ని, అనుభవాన్ని, నిజాయితీతో కూడిన మార్గదర్శకత్వాన్ని అందించడం ద్వారా విద్యార్థుల ప్రయాణాన్ని స్పష్టతతో ముందుకు సాగేలా చూడగలం. ఎక్కడికి వెళ్లినా ఏయూ బ్రాండ్‌ను వెంట తీసుకువెళ్లాలి." అని మల్లికార్జునరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, పూర్వ విద్యార్థుల సంఘ ఛైర్మన్ కేవీవీ రావు, ఉపాధ్యక్షుడు కుమార్‌రాజా, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సావనీర్‌ను విడుదల చేశారు. సుధామూర్తిని ఏయూ, పూర్వవిద్యార్థి సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వర్సిటీకి ఆర్థిక సహాయం చేసిన పలువురు పూర్వ విద్యార్థులను సన్మానించారు.

హోదాలు మరిచి.. హాయిగా, హ్యాపీగా..!

» ఏయూలో పూర్వ విద్యార్థుల సందడి

పూర్వ విద్యార్థులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణం సందడిగా మారింది. దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించిన ఎంతోమంది శనివారం పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొనేందుకు నగరానికి చేరుకున్నారు. అందులో కొందరు తాము చదువుకున్న తరగతి గదులను సందర్శించి గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. 1973-76 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌తోపాటు వర్సిటీలో చదువుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, ఇంకా వి.కోటేశ్వరరావు, పేరా ప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎంఆర్ చౌదరి, డాక్టర్ కృష్ణమూర్తి, హరీశ్, సి.రాఘవరావు, ఏవీఎల్ నరసింహరావు, తదితరులు శనివారం ఉదయాన్నే క్యాంపస్‌కు చేరుకున్నారు. తొలుత స్నాతకోత్సవ భవనం చుట్టూ కొద్దిసేపు వాకింగ్ చేశారు. అనంతరం వర్సిటీలో వీఎస్ కృష్ణ లైబ్రరీ పక్కనున్న టీ స్టాల్ వద్దకు చేరుకున్నారు. టీ, కాఫీ తాగుతూ పిచ్చాపాటిగా మాట్లాడుకున్నారు. వర్సిటీలో చదువుకున్నప్పటి విషయాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, చలోక్తులు విసురుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం అక్కడే టిఫిన్ చేశారు. నాటి స్నేహితులను మళ్లీ కలుసుకోవడం పట్ల పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వేగా జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు

» బంగారు ఆభరణాల తరుగుపై 50% తగ్గింపు



విజయవాడ వేగా జ్యూయలర్స్ షోరూంలో రితిక నాయక్

విజయవాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చేరువైన ప్రముఖ బంగారు ఆభరణాల షోరూం వేగా జ్యూయలర్స్ పండుగల ప్రారంభ శుభవేళ అద్భుతమైన పలు ఆఫర్లను శనివారం ప్రకటించింది. ఈ ఆఫర్ల బ్రోచర్‌ను మిరాయ్ సినిమా ఫేమ్ రితిక నాయక్ విజయవాడ షోరూంలో ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక ఆఫర్లు వేగా జ్యూయలర్స్ అన్ని షోరూంలలో ఈ నెల 15వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయి. రానున్న ధనుర్మాసం, క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పర్వదినాలను మరింత వైభవంగా, ఆనందంగా జరుపుకోవడానికి సువర్ణావకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టినట్టు నిర్వాహకులు చెప్పారు. అన్ని రకాల అత్యాధునిక ఫ్యాషన్ ఆభరణాల నుంచి ప్రాచీన సంప్రదాయ ఆభరణాలు వరకు తమ అన్ని షోరూంలలో అందుబాటులో ఉంచినట్టు తెలియచేసారు. ఈ ప్రత్యేక ఆఫర్ల సందర్భంగా బంగారు ఆభరణాల తరుగుపై 50% తగ్గింపు ఇస్తున్నట్టు వెల్లడించారు. అంతేకాక పోల్కి ఆభరణాల పైన తయారీ, తరుగు చార్జీలు ఉండవని తెలిపారు. వజ్రాభరణాల క్యారట్ ధర కేవలం రూ.49,999 మాత్రమే ఉంటుందని, పరిమిత కాలం మాత్రమే ఉండే ఈ అద్భుతమైన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జస్టిస్ సుభేందు సామంతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఈఓ రాధ

అప్పన్న సేవలో జస్టిస్ సుభేందు సామంత

సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభేందు సామంత కుటుంబ సమేతంగా శనివారం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. జడ్జి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభ ఆలింగనం, గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, డిప్యూటీ ఈఓ రాధ, పర్యవేక్షణాధికారి సత్యశ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

స్వామివారి సన్నిధిలో ఎంపీ సుధా నారాయణమూర్తి



రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ ఛైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి శనివారం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం ఈఓ ఎన్.సుజాత, అర్చకులు అధికార లాంచనాలతో స్వాగతం పలికారు. ఆమె గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు స్వామివారికి పూజలు చేశారు. పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

లేపాక్షిని సందర్శించిన జస్టిస్ చంద్ర ధనశేఖర్




జస్టిస్ చంద్ర ధనశేఖర్‌కు నంది చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారులు

లేపాక్షి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళ అద్భుతమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండల కేంద్రంలోని ఆలయాన్ని శనివారం ఆయన దర్శించుకుని, దుర్గావీరభద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన రాతి కళ్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి, సత్కరించారు. తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, దేవదాయశాఖ సిబ్బంది న్యాయమూర్తి వెంట ఉన్నారు.

మన విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

» జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

పెదనందిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన దేశ విద్యావ్యవస్థ మీద కొంత విమర్శ ఉన్నప్పటికీ ప్రపంచం మొత్తం మన గ్రాడ్యుయేట్లను స్వీకరిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025 రాష్ట్రస్థాయి పోటీలను జస్టిస్ గన్నపనేని రామకృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యపైనే ఎక్కువ మంది దృష్టి పెట్టారన్నారు. మన దేశ విద్యావ్యవస్థ పటిష్టంగా లేకపోతే ఇతర దేశాలు మనల్ని ఎందుకు ఆహ్వానిస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, సమస్యలను అధిగమించే శక్తి మనకు ఉందన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు.

జాతీయ నూతన విద్యావిధానం విషతుల్యం

» ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఆదర్శ ఎం.సాజి




మీడియాతో మాట్లాడుతున్న ఆదర్శ ఎం.సాజి, ప్రసన్నకుమార్

తిరుపతి(విద్య), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఆదర్శ ఎం.సాజి స్పష్టం చేశారు. శనివారం తిరుపతిలో ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభల రెండోరోజు ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ఈపీ-2020ని జాతీయ బహిష్కరణ విధానంగా అభివర్ణిస్తూ దీనికి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ఉద్యమాలను కొనసాగిస్తామని ప్రకటించారు. జాతీయ విద్యావిధానం ద్వారా కేంద్రం విద్యా వ్యవస్థను వ్యాపారీకరణ, కేంద్రీకరణ, మతాంతీకరణ చేస్తోందని ఆరోపించారు. విషతుల్యమైన ఈ విద్యావిధానం వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా 89వేల ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయని, నాలుగేళ్లలో 65లక్షల మందికి పైగా విద్యార్థులు చదువులు మానేశారని వివరించారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 12 వేలకుపైగా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను క్రమంగా విచ్ఛిన్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌ల కోతలతో విద్యను సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉండేలా చేస్తున్నారన్నారు. సిలబస్ మార్పు పేరుతో వాస్తవ చరిత్రను వక్రీకరిస్తూ, కల్పిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చొప్పిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు మారాలంటే విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు ఐక్య ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని మహాసభ తీర్మానించిందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధించేలా పోరాటం చేస్తామన్నారు.

బీమా సొమ్ము కోసం మామ హత్య

» అల్లుడు, మనవడు, మరో ఇద్దరి అరెస్టు



కుర్రు నారాయణమూర్తి

కశింకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తన అప్పులు తీర్చుకునేందుకు ఓ పథకం ప్రకారం మామ పేరిట ఏడెనిమిది సంస్థల్లో లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు కట్టించాడు అతడి అల్లుడు. మామను చంపేస్తే బీమా సొమ్ము వస్తుందని అతడిని అంతమొందించాడు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడితోపాటు నలుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు శనివారం విలేకరులకు ఈ కేసు వివరాలు వెల్లడించారు. వారి కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లికి చెందిన కుర్రు నారాయణమూర్తి (54) సాగర్ సిమెంట్ కంపెనీలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య సూర్యలక్ష్మి ఉన్నారు. రోజూ మాదిరిగానే నారాయణమూర్తి ఈ నెల 8న మధ్యాహ్నం విధులకు హాజరై రాత్రి 10గంటల సమయంలో మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా అతడి అల్లుడు సుంకరి అన్నవరం, మనుమడు జ్యోతిప్రసాద్, పేరంటాలపాలేనికి చెందిన అగ్రహారపు తాతాజీ.. కొత్తపల్లి గ్రామశివారున అడ్డుకుని దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణమూర్తి 9న మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే చనిపోయినట్లు నారాయణమూర్తి భార్యతో ఫిర్యాదు చేయించారు. బీమా సొమ్ము కోసమే అల్లుడు, మనుమడు, తాతాజీ కలిసి హతమార్చినట్లు దర్యాప్తులో తేలింది. పథకం ప్రకారం నారాయణమూర్తి పేరున ఎల్ఐసీలో రూ.5 లక్షలు, పోస్టాఫీస్‌లో రూ.8 లక్షలు, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ (ఆక్సిడెంట్ పాలసీ)లో రూ.40 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ రూ.20 లక్షలు, శ్రీరామ్ లైఫ్ అండ్ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీ రూ.10 లక్షలు, బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ రూ.5 లక్షలు అల్లుడు కట్టించాడు. సాగర్ సిమెంటు కంపెనీ ద్వారా జీపీఏ పాలసీ రూ.20 లక్షలు.. వెరసి రూ.1.8 కోట్లు చేజిక్కించుకోవచ్చునని, అందుకు నారాయణమూర్తి ప్రమాదంలో చనిపోయినట్టు ఆధారాలు చూపగలగాలని ఎల్ఐసీ ఏజెంట్ భీముని నానాజీ సలహా ఇచ్చాడు. దీంతో నలుగురూ కలిసి అతడిని హతమార్చి ప్రమాదంగా చిత్రీకరించారు. అల్లుడితో పాటు మిగిలిన ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలిని చంపి.. బంగారంతో పరార్

భోగాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస ఆర్ అండ్ఆర్ కాలనీలో ముడసర్ల అప్పయ్యమ్మ(70) హత్యకు గురైంది. దుండగులు ఆమెను చంపి, ఒంటిపై ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. అప్పయ్యమ్మ భర్త గతంలోనే మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. పెద్దకుమారుడు అమలాపురంలో కొబ్బరికాయలు తీసేపనికి వెళ్లగా, ఇంటి వద్ద కోడలు, మనువడు గౌరి ఉంటున్నారు. చిన్నకుమారుడు సూరప్పన్న.. భవానీ దీక్ష విరమణకు భార్య, కుమారుడితో కలిసి రెండ్రోజుల క్రితం విజయవాడ వెళ్లాడు. చిన్నకుమారుడి ఇంట్లో పెంపుడు కోళ్లకు కాపలాగా అప్పయ్యమ్మ 3రోజులుగా అక్కడ ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుండగులు ఆమెను చంపేశారు. ఇంటి సమీపంలోని ఓ ప్రహరీ వద్ద అప్పయ్యమ్మ సెల్‌ఫోన్, డబ్బులు భద్రపరచుకొనే గుడ్డ సంచి కనిపించింది. ఆమె ముక్కు, చెవికి కింద, పైన ఉండే సుమారు 5తులాల బంగారు నగలు లేకపోవడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.దుర్గా ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి

16న 'కానిస్టేబుల్' నియామక పత్రాలు

» హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

» ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

మంగళగిరి సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించేందుకు ముహూర్తం ఖరారైంది. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో జరిగే కార్యక్రమంలో ఈ నెల 16న నియామక పత్రాలు అందించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా శనివారం అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారులతో కలిసి సభా వేదిక నిర్మాణాన్ని, వేదిక వద్దకు చేరుకునే మార్గాలు, మార్కింగ్ ప్రదేశాలు, వీవీఐపీ, వీఐపీల కోసం చేస్తున్న ఏర్పాట్లు, ఇతర జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థులకు, వారి బంధువులకు, బందోబస్తుకు వచ్చే పోలీసు అధికారులు, సిబ్బందికి కల్పించవలసిన వసతులు తదితర అంశాలను సమీక్షించారు. అలాగే, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్ ఏపీఎస్పీలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య వందేభారత్

» 15న ప్రారంభించనున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు కేంద్ర పారిశ్రామిక ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించనున్నారు. కోనసీమ ప్రాంతం అభివృద్ధి చెందటంలో చాలా ముందుందని రైలు ప్రయాణ ప్రామాణికాలు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతానికి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ స్టేషన్ నుంచి సుమారు 655 కిలోమీటర్ల దూరాన ఉన్న నరసాపూర్ చేరేందుకు 9 గంటల సమయం పడుతుందని, ఈ ప్రాంత ప్రయాణికులకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సౌలభ్యాన్ని మొట్టమొదటిసారిగా కల్పిస్తున్నట్టు పేర్కొంది. ఈ రైలులో 7 ఏసీ ఛైర్ కార్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ ఉంటాయని, 530 మంది ప్రయాణించటానికి వీలుందని వెల్లడించింది.

కాకినాడ టౌన్ నుంచి 41 ప్రత్యేక సర్వీసులు

సంక్రాంతి రద్దీ దృష్ట్యా జనవరి 8 నుంచి 20వ తేదీ వరకు కాకినాడ టౌన్ నుంచి వికారాబాద్‌కు, వికారాబాద్-నరసాపూర్, సికింద్రాబాద్-నరసాపూర్, సికింద్రాబాద్-కాకినాడ టౌన్ మధ్య 41 ప్రత్యేక సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఈ రైళ్లకు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం ఉందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దెబ్బతింటుందని చాలా మంది భావించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుగన్నారు. తీరా చూస్తే మొదటి దశ ఎన్నికల్లో గతంలో అధికారంలో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితి సాధించినన్ని స్థానాలను కాంగ్రెస్ దాదాపుగా గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడాన్ని విస్మరించకూడదు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పనితీరు మరీ పేలవంగా ఉంది. పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రానప్పటికీ తమదే పైచేయి అని చెప్పుకొంటూ భారత రాష్ట్ర సమితి ఆత్మవంచన చేసుకుంటోంది. పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ దుమ్ము రేపింది అని సొంత మీడియాలో ప్రచారం చేసుకుని ఆత్మసంతృప్తి చెందుతోంది. భారతీయ జనతా పార్టీలో పైకి కనిపించని కుమ్ములాటలు చోటుచేసుకుంటుండగా, భారత రాష్ట్ర సమితిలో ఇంటిపోరు మిన్నంటుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాప కింద నీరులా బలం పెంచుకుంటూ పోతున్నారు.

కమలానికి నాథుడేడి?



తెలంగాణకు చెందిన పార్టీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంత గుస్సా ఎందుకయ్యారు? ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీల స్థాయికి ఎదిగిన భారతీయ జనతా పార్టీ తెలంగాణలో క్రమంగా ఎందుకు చతికిలపడుతోంది? ఇక అధికారంలోకి రావడమే తరువాయి అని తలపోసిన పార్టీ అగ్రనేతలకు తత్వం బోధపడిందా? లోపం పార్టీ రాష్ట్ర నాయకుల్లోనే కాకుండా కేంద్ర నాయకత్వంలో కూడా ఉందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం లభిస్తోంది. తెలంగాణలో కొంత కాలంగా పార్టీ చల్లబడుతూ వస్తోంది. దాదాపు ఐదేళ్ల క్రితం జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠానికి చేరువగా వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని, అప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ అవతరించింది. ఆ తర్వాత బండి సంజయ్ నాయకత్వంలో మరింత దూకుడు ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికలకు ముందు బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చారు. కారణం ఏమైనప్పటికీ అప్పటి నుంచి పార్టీ దూకుడు తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ కరిజ్మా కారణంగా అధికార కాంగ్రెస్‌తో సమానంగా ఎనిమిది సీట్లు గెలుచుకుంది. ఆ తర్వాత నుంచి పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారైంది. ఇందుకు పార్టీ కేంద్ర నాయకత్వ నిర్ణయాలు కొంత కారణం కాగా, పార్టీ రాష్ట్ర నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు మరొక కారణం. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో వివిధ పార్టీలకు చెందిన బలమైన నాయకులను బీజేపీలో చేర్చుకున్నారు. దీంతో భవిష్యత్తుపై పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికలు రావడం, పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తప్పించడం జరిగింది. దీంతో పాల పొంగుపై నీళ్లు చల్లినట్లయింది. సదరు పరిణామం ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఆరు నెలలకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి చెందిన బలమైన నాయకులను బీజేపీ కేంద్ర నాయకత్వం ఎన్నికల బరిలోకి దించింది. దీంతో కాంగ్రెస్‌తో సమానంగా ఎనిమిది స్థానాలను పార్టీ గెలుచుకోగలిగింది. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. నివురుగప్పిన నిప్పులా పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు పార్టీని దెబ్బతీశాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ మొదటి నుంచీ బలంగా ఉండేది. పటిష్ఠమైన కేడర్ ఉండేది. ఏ ఎన్నికలు జరిగినా గట్టి పోటీ ఇచ్చేది. కానీ కొన్ని రోజుల క్రితం జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఏకంగా డిపాజిట్ కోల్పోయారు. దీంతో పార్టీ కేంద్ర నాయకత్వానికి తత్వం బోధపడింది. రెండేళ్ల క్రితం వరకు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితిని వెనక్కు నెట్టి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ అగ్రనేతలు తలపోశారు. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితి నుంచి వచ్చిన పొత్తు ప్రతిపాదనను తిరస్కరించారు. ప్రాంతీయ పార్టీలు బలపడకూడదన్న పార్టీ విధానానికి అనుగుణంగా బీఆర్ఎస్ చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సైతం తిరస్కరించారు. అయితే అంతర్గత కుమ్ములాటలతో పార్టీ బలహీనపడుతున్న విషయాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం గుర్తించలేకపోయింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీతో పొత్తుకు భారత రాష్ట్ర సమితి సిద్ధపడిందని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఎప్పుడైనా కుదరవచ్చు అన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ పరిణామాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాల్సిన తెలంగాణ బీజేపీ నాయకత్వం అక్కడ కూడా విఫలమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున ఈ ప్రచారం వల్ల లబ్ధి పొందాల్సిన పార్టీ ఆ దిశగా కృషి చేయలేదు. మరోవైపు కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని ప్రజలను నమ్మించే దిశగా భారత రాష్ట్ర సమితి వివిధ కార్యక్రమాలు చేపట్టింది. మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి పొత్తులు ఉంటాయా లేదా అన్నది పట్టించుకోకుండా సొంతంగా తన కాళ్ల మీద నిలబడడం కోసం భారత రాష్ట్ర సమితి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పార్టీ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై పలు ఊహాగానాలు ఉన్నప్పటికీ లెక్క చేయకుండా కేటీఆర్, హరీశ్ రావు ద్వయం పార్టీని ముందుకు నడిపించే బాధ్యత చేపట్టారు. కేసీఆర్ ఆరోగ్యం దెబ్బతినడం భారతీయ జనతా పార్టీకి కలసి వచ్చే అంశమే. అయినప్పటికీ ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తమకు అందివచ్చిన అవకాశాన్ని కూడా వదులుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని వ్యంగ్యంగా అంటూ ఉంటారు. భారతీయ జనతా పార్టీలో అలా ఉండదని, ఆ పార్టీ క్రమశిక్షణకు మారు పేరని భావిస్తారు. అయితే తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా తయారైంది. కాంగ్రెస్ నాయకుల వలే బహిరంగంగా ఒకరినొకరు విమర్శించుకోకపోయినా అంతర్గతంగా కత్తులు దూసుకోవడం మొదలెట్టారు. ఆరెస్సెస్ నేపథ్యంతో పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. భారతీయ జనతా పార్టీ సంస్కృతిని అర్థం చేసుకోలేక ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు అయోమయానికి గురవుతున్నారు. క్షేత్ర స్థాయిలో బలం లేకపోయినా ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న వారి మాట పార్టీలో చెల్లుబాటు కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే కేంద్ర నాయకులు కూడా స్థానిక పరిస్థితులను ఆకళింపు చేసుకోవడంలో విఫలమయ్యారు. ఉత్తరాది రాష్ట్రాలలో అమలు చేసిన ఫార్ములానే తెలంగాణలోనూ అమలు చేశారు. దీంతో ప్రజా బలం ఉన్న నాయకులు పార్టీలో చేరినప్పటికీ సైలెంట్‌గా ఉండిపోయారు. ఈ నేపథ్యంలోనే బీసీ నాయకత్వం అంశం కూడా తెరపైకి వచ్చింది. పార్టీకి బీసీలే నాయకత్వం వహించాలన్న డిమాండ్ అంతర్గతంగా బలపడుతూ వచ్చింది. అలా అని బీసీ నాయకుల్లో ఐక్యత ఉందా అంటే అదీ లేదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కూడా బీజేపీ తన పట్టును ప్రదర్శించలేక పోయింది. తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కూడా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పనితీరు పేలవంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీంతో పార్టీ బలపడింది అనేది పాల పొంగు వంటిదే అన్న అభిప్రాయం బలపడింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రయత్నాలు జరిగిన దాఖలాలు లేవు.

చాన్స్ వచ్చినా అందుకోరే..

నిజానికి తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలపడడానికి ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారం చెలాయించిన భారత రాష్ట్ర సమితి ప్రస్తుతం అంతర్గత కుమ్ములాటలతో సతమతం అవుతోంది. ఇంటి గుట్టు లంకకు చేటు అన్నట్టుగా ఆ పార్టీ పరిస్థితి తయారైంది. బీఆర్ఎస్ నుంచి సస్పెండైన కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కవిత ఆ పార్టీకి తలపోటుగా మారారు. అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలను ఆమె ఒక్కొక్కటిగా బయటపెడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమాల చిట్టా విప్పడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సొంత సోదరుడు కేటీఆర్‌ను కూడా మినహాయించి ఇవ్వడం లేదు. తాజాగా మరో అడుగు ముందుకేసి ఉద్యమ సమయంలో పలువురిని బెదిరించి డబ్బులు వసూలు చేశారని కవిత ఆరోపించారు. ఆమె తన ఆరోపణలు, విమర్శలను పార్టీ నాయకులకే పరిమితం చేయకుండా కన్నతండ్రిని కూడా టార్గెట్ చేయడానికి వెనుకాడటం లేదు. శుక్రవారం నాడు ఆమె చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఈ పరిణామాన్ని అందిపుచ్చుకొని ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన భారతీయ జనతా పార్టీ ఎందుకో స్తబ్దుగా ఉండిపోతోంది. ఇది గమనించడం వల్లనే కాబోలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలకు క్లాస్ తీసుకున్నారు. కవిత చేస్తున్న ఆరోపణలు, విమర్శలను ఆసరాగా చేసుకొని భారత రాష్ట్ర సమితిని ఇరుకునపెట్టి ప్రధాన ప్రతిపక్షంగా ఎదగడానికి భారతీయ జనతా పార్టీకి ఇది ఒక మహదావకాశం. అయితే కారణం తెలియదు గానీ, అలా జరగడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉండి కూడా భారత రాష్ట్ర సమితిని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం జరగకపోవడం ఏమిటో కూడా తెలియదు. మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆ పార్టీతో పొత్తు కుదురుతుందన్న అభిప్రాయంతో బీజేపీ రాష్ట్ర నాయకులు సంయమనం పాటిస్తున్నారేమో తెలియదు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ నిలదొక్కుకోవాలంటే కాయకల్ప చికిత్స అవసరం. పార్టీ ఎదుగుదలకు ప్రతిబంధకంగా ఉన్న అంశాలను ముందుగా గుర్తించి విరుగుడు చర్యలు చేపట్టాలి. భవిష్యత్తులో భారత రాష్ట్ర సమితితో పొత్తు ఉంటుందా? ఉండదా? అన్న విషయమై రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలకు పార్టీ కేంద్ర నాయకత్వం స్పష్టత ఇవ్వాలి. భారత రాష్ట్ర సమితి బలంగా ఉన్నంత కాలం తెలంగాణలో బీజేపీ బలపడలేదు. అధికార కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయం అన్న భావన ప్రజల్లో కల్పించకుండా ఏం చేసినా అది ఉపరితల విన్యాసమే అవుతుంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. అంతర్గత కుమ్ములాటలకు మారుపేరైన కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పట్టును పెంచుకుంటుండగా, భారతీయ జనతా పార్టీలో ఆ స్థాయి నాయకుడు కనిపించడం లేదు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరికొకరు ప్రత్యామ్నాయంగా ప్రజల ముందు ఉన్నారు. ఈ ఇద్దరికీ భారతీయ జనతా పార్టీ తరఫున ప్రత్యామ్నాయం ఎవరు? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఉత్తరాది రాజకీయాలకు భిన్నంగా దక్షిణాది రాజకీయాలు ఉంటాయన్న విషయాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా గుర్తించాలి. ఉత్తరాది రాష్ట్రాలలో పార్టీ ప్రభావం అధికంగా ఉంటుంది. స్థానికంగా బలమైన నాయకులు లేకపోయినా ఇబ్బంది ఉండదు. దక్షిణాదిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి! బలమైన నాయకుల చుట్టూ రాజకీయం సాగుతుంటుంది. కర్ణాటకలో యడ్యూరప్ప నాయకత్వంలో బీజేపీ బలంగా ఉండేది. నాయకత్వ స్థానం నుంచి ఆయనను తప్పించగానే అక్కడ పార్టీ బలహీనపడింది. తమిళనాడులో కూడా అన్నామలైను నాయకత్వం నుంచి తప్పించిన తర్వాత ఆ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ దూకుడు తగ్గింది. తెలంగాణలో కూడా బండి సంజయ్‌ను నాయకత్వం నుంచి తప్పించాకే తంటాలు మొదలయ్యాయి. ఉత్తరాదిన పార్టీని ముందుగా విస్తరించి ఆ తర్వాత నాయకులను పెంచడం బీజేపీ విధానంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ విధానం చెల్లుబాటు కాదు. ఇక్కడ ముందుగా నాయకులను పెంచాలి. ఆ తర్వాత పార్టీ దానంతట అదే బలపడుతుంది. కేసీఆర్ కారణంగా భారత రాష్ట్ర సమితి బలంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణంగానే ఇటు కాంగ్రెస్ బలంగా రూపొందింది. ఈ రెండు పార్టీలను ఢీ కొనాలంటే భారతీయ జనతా పార్టీలో కూడా ఆ స్థాయి నాయకుడు ఉండాలి కదా? అలాంటి నాయకుడిని తీర్చిదిద్దుకోవాలి కదా? మా పార్టీ సిద్ధాంతాల పునాదిపై ఆధారపడి మాత్రమే పనిచేస్తుంది అంటే కుదరదు. జాతీయ స్థాయిలో కూడా ప్రధాని మోదీ పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారు కదా? తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఎనిమిది స్థానాలు లభించాయంటే అందుకు మోదీయే కారణం కాదా? రాష్ట్ర స్థాయిలో బలమైన నాయకుడు లేని కారణంగానే ఇతర ఎన్నికల్లో పార్టీ ప్రదర్శన పేలవంగా ఉంటోంది. జూబ్లీహిల్స్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకోగా, భారత రాష్ట్ర సమితి బాధ్యతను కేటీఆర్ తీసుకున్నారు. భారతీయ జనతా పార్టీ తరఫున బాధ్యతను ఎవరు తీసుకున్నారు? అంటే సమాధానం లభించడం లేదు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా కూడా ఇదే పరిస్థితిని చూస్తున్నాం. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే భారత రాష్ట్ర సమితిని ముందుగా దెబ్బతీయాలి. భారతీయ జనతా పార్టీ తరఫు నుంచి ఆ ప్రయత్నమే జరగడం లేదు. కవిత తాజాగా చేసిన ఆరోపణల విషయమే తీసుకుందాం. ఆమె చేసిన ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు స్పందించారు. భారతీయ జనతా పార్టీ తరఫున ఒక్కరు కూడా స్పందించలేదు.

తెలంగాణలో పార్టీని తీర్చిదిద్దడానికి ప్రధాని మోదీ ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు? పార్టీకి పూర్తి స్థాయిలో జవసత్వాలు సమకూర్చడానికి కేంద్ర నాయకత్వం ఏదో ఒకటి చేయకపోతుందా? అని బీజేపీ శ్రేణులు ప్రస్తుతానికి ఆశగా ఎదురుచూస్తున్నాయి. మునుముందు రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఎలా ఉండబోతుందన్నది తెలియాలంటే ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఏం చేయబోతున్నదో తెలియాలి.

ఉత్తరాది రాజకీయాలకు భిన్నంగా దక్షిణాది రాజకీయాలు ఉంటాయన్న విషయాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం గుర్తించాలి. ఉత్తరాది రాష్ట్రాలలో పార్టీ ప్రభావం అధికంగా ఉంటుంది. స్థానికంగా బలమైన నాయకులు లేకపోయినా ఇబ్బంది ఉండదు. దక్షిణాదిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి! బలమైన నాయకుల చుట్టూ రాజకీయం సాగుతుంటుంది. కర్ణాటకలో యడ్యూరప్ప నాయకత్వంలో బీజేపీ బలంగా ఉండేది. నాయకత్వ స్థానం నుంచి ఆయనను తప్పించగానే అక్కడ పార్టీ బలహీనపడింది. తెలంగాణలో బండి సంజయ్‌ను నాయకత్వం నుంచి తప్పించాకే తంటాలు మొదలయ్యాయి. ఉత్తరాదిన పార్టీని ముందుగా విస్తరించి ఆ తర్వాత నాయకులను పెంచడం బీజేపీ విధానంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ విధానం చెల్లుబాటు కాదు. ఇక్కడ ముందుగా నాయకులను పెంచాలి. ఆ తర్వాత పార్టీ దానంతట అదే బలపడుతుంది. కేసీఆర్ కారణంగా భారత రాష్ట్ర సమితి బలంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణంగానే ఇటు కాంగ్రెస్ బలంగా రూపొందింది. ఈ రెండు పార్టీలను ఢీ కొనాలంటే భారతీయ జనతా పార్టీలో కూడా ఆ స్థాయి నాయకుడు ఉండాలి కదా? మా పార్టీ సిద్ధాంతాల పునాదిపై ఆధారపడి మాత్రమే పనిచేస్తుంది అంటే కుదరదు.

రేవంత్ పట్టు!

ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలలో తన పట్టును నానాటికీ పెంచుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనూహ్య విజయం తర్వాత మరింత ఆత్మ విశ్వాసంతో ఆయన అడుగులు వేస్తున్నారు. ప్రజలలో తన ప్రతిష్ఠ పెంచుకోవడానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ ఆయన వదులుకోవడం లేదు. తెలంగాణ రైజింగ్ పేరిట నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు భారీ ప్రయత్నం చేశారు. మరోవైపు పార్టీలో తన పట్టును మరింతగా పెంచుకుంటున్నారు. మరో పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా తానే ఉంటానని ఆయన మొదటిసారిగా ప్రకటించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇలా ప్రకటించుకోవడం సాహసమే అవుతుంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డికి మాత్రమే ఆ స్థాయి దన్ను లభించింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి అలా ప్రకటించుకున్నారు. మంత్రులు కూడా వచ్చే టర్మ్ రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని ప్రకటించడం చూస్తున్నాం. అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఐకాన్ మెస్సీతో తాను సరదాగా ఆడిన మ్యాచ్‌ను వీక్షించడానికి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని ప్రత్యేకంగా పిలుచుకోగలిగారంటేనే పార్టీలో రేవంత్ రెడ్డి పట్టు ఎంతగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో దాదాపు 58 శాతం వరకు సర్పంచ్ పదవులను కైవసం చేసుకోవడం ద్వారా ముఖ్యమంత్రి తన సత్తా చాటుకున్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దెబ్బతింటుందని చాలా మంది భావించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుగన్నారు. తీరా చూస్తే మొదటి దశ ఎన్నికల్లో గతంలో అధికారంలో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితి సాధించినన్ని స్థానాలను కాంగ్రెస్ దాదాపుగా గెలుచుకోగలిగింది. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ఫలితాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఉండటం సహజమే అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడాన్ని విస్మరించకూడదు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పనితీరు మరీ పేలవంగా ఉంది. పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రానప్పటికీ తమదే పైచేయి అని చెప్పుకొంటూ భారత రాష్ట్ర సమితి ఆత్మవంచన చేసుకుంటోంది. పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ దుమ్ము రేపింది అని సొంత మీడియాలో ప్రచారం చేసుకుని ఆత్మసంతృప్తి చెందుతోంది. భారతీయ జనతా పార్టీలో పైకి కనిపించని కుమ్ములాటలు చోటుచేసుకుంటుండగా, భారత రాష్ట్ర సమితిలో ఇంటిపోరు మిన్నంటుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాప కింద నీరులా బలం పెంచుకుంటూ పోతున్నారు. రాజకీయంగా ఆయన ఎత్తుగడలు ఇప్పుడిప్పుడే ఫలితాలను ఇస్తున్నాయి. మిగతా రెండు పార్టీలలో నెలకొన్న పరిస్థితులు కూడా ఆయనకు కలిసివచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రెండు పార్టీలకు జుట్లు ముడి వేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసి నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేకపోతున్నది. ఇది రాజకీయంగా రేవంత్ రెడ్డి సాధించిన విజయం. కొద్ది నెలల క్రితంతో పోల్చితే రేవంత్ రెడ్డి రాజకీయంగా బలపడ్డారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విఫలమయ్యారన్న విమర్శలు ఒక దశలో మిన్నంటాయి. ఇప్పుడు ఆ పరిస్థితులను ఆయన అధిగమించడమే కాకుండా తెలంగాణలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ స్థానం మరింత పటిష్ఠం అయింది.

పోటీ ఎవరు?

రేవంత్ రెడ్డి బలపడిన నేపథ్యంలో భవిష్యత్తులో ఆయనతో భారత రాష్ట్ర సమితి తలపడుతుందా? లేక భారతీయ జనతా పార్టీ ఢీకొంటుందా? అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నం అవుతుంది. కేసీఆర్‌కు సంపూర్ణ ఆరోగ్యం చేకూరితే భారత రాష్ట్ర సమితి పటిష్ఠంగానే ఉంటుంది. వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్యనే ప్రధాన పోటీ ఉండవచ్చు. అలా కాకుండా భారతీయ జనతా పార్టీ కూడా ప్రధానంగా పోటీలో ఉండాలంటే ఆ పార్టీ కేంద్ర నాయకత్వ ధోరణి మారడంతో పాటు రాష్ట్ర స్థాయిలో పార్టీకి అవసరమైన ఆక్సిజన్‌ను అందించాలి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బలపడుతున్న కొద్దీ బీజేపీ–బీఆర్ఎస్ మధ్య స్నేహం చిగురించి పొత్తు పొడిచే అవకాశాలను కొట్టివేయలేం. పార్టీ రాష్ట్ర ఎంపీలు, కేంద్ర మంత్రులపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ పార్టీ ప్రస్తుత దుస్థితికి తాము కూడా పరోక్ష కారణమన్న వాస్తవాన్ని ఆయన గుర్తించాలి. భారత రాష్ట్ర సమితి విషయంలో కేంద్ర పార్టీ వైఖరి స్పష్టం చేయకుండా రాష్ట్ర నాయకులను నిందించి ప్రయోజనం ఉండదు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందా? లేక పొత్తు కుదుర్చుకోబోతున్నదా? అన్నది స్పష్టమైతే గానీ భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతుందన్నది తేలదు. రాజకీయాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. నిన్నటిదాకా బీజేపీతో పొత్తుకు ఆరాటపడిన బీఆర్ఎస్ భవిష్యత్తులో కూడా అదే వైఖరితో ఉంటుందని చెప్పలేం. భారతీయ జనతా పార్టీ మరింత బలపడే విషయం అటుంచి ఉన్న బలాన్ని కూడా కాపాడుకోలేకపోతే ఆ పార్టీతో పొత్తుకు బీఆర్ఎస్ కూడా ముఖం చాటేయొచ్చు. ఏ ప్రయోజనం లేకుండా ఏ పార్టీ అయినా మరో పార్టీతో చేయి కలపదు కదా? ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని తీర్చిదిద్దడానికి ప్రధాని మోదీ ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారు? అన్నదే చర్చనీయాంశంగా ఉంది. తత్వం బోధపడినందున పార్టీకి పూర్తి స్థాయిలో జవసత్వాలు సమకూర్చడానికి కేంద్ర నాయకత్వం ఏదో ఒకటి చేయకపోతుందా? అని బీజేపీ శ్రేణులు ప్రస్తుతానికి ఆశగా ఎదురుచూస్తున్నాయి. మునుముందు రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఎలా ఉండబోతుందన్నది తెలియాలంటే ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఏం చేయబోతున్నదో తెలియాలి. అంతవరకు అంతా సస్పెన్స్‌గానే ఉంటుంది. అధికారాన్ని అందుకోగలిగిన స్థాయికి వచ్చిన పార్టీ బలహీనపడటాన్ని ప్రధాని మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరు. త్వరలోనే విరుగుడు చర్యలు తీసుకుంటారు. అవేమిటో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే!

గవాయ్ వ్యాఖ్యల లోగుట్టు!

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్లలోనూ 'క్రీమీలేయర్' వడబోత ఉండాలని సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ వరుస బెట్టి అదేపనిగా అంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు కొత్తేమీకాదు. కులం కాక, ఆర్థిక ప్రాతిపదికన మాత్రమే రిజర్వేషన్లు ఉండాలనే వాదన అగ్రకులాలు ఎప్పటినుంచో చేస్తున్నాయి. ఇప్పుడు రాజ్యాంగం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని చెప్పుకుంటున్న గవాయ్ నోటివెంట ఈ వ్యాఖ్యలు రావటంతో పైవాదనకు బలం చేకూరుతోంది. కాబట్టి, ఎవరు ఏమి కోరుకుంటున్నారనేది కాక, రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగం ఏం చెబుతుందనేది ముఖ్యం.

రాజ్యాంగం రెండు సమూహాలకు మాత్రమే రిజర్వేషన్ల సౌకర్యాన్ని కల్పించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు. ఈ రెండు సమూహాలకు ఒకే ప్రాతిపదికన రిజర్వేషన్లను ఇవ్వలేదు. తెగలకు వారి ప్రత్యేక జీవన సంస్కృతి ఆధారంగా, కులాలకు 'సాంఘిక వెలి' అనేదాన్ని ప్రామాణికంగా తీసుకొని రిజర్వేషన్లు కల్పించారు. షెడ్యూల్డ్ కులాలు అంటే ఎవరనే విషయంలో ఇతర లక్షణాలను గుర్తించినప్పటికీ, ప్రధానంగా అంటరానితనం ఆధారంగానే రిజర్వేషన్లు ఇచ్చారు. ఆ రకంగానే దేశవ్యాప్తంగా అంటరానితనం ఎదుర్కొంటున్న 1200 కులాలు ఈ లిస్టులోకి చేరాయి. తెలుగురాష్ట్రాలలో బీసీలుగా ఉన్న చాకలి, చేపలు పట్టే బెస్త, ముదిరాజులు ఇతర రాష్ట్రాలలో షెడ్యూల్డ్ కులాల లిస్టులో ఉన్నారు. అంటే కులాల పరంగా వేరుగా ఉన్నప్పటికీ, వారి మధ్య ఆర్థిక తేడాలు ఉన్నప్పటికీ, అంటరానితనం అనే ఒకే ఒక లక్షణం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారు. ఇవి ఏ ఒక్క కులానికో, వ్యక్తికో కాక మొత్తం సమూహానికి ఉద్దేశించినవి. బీసీల విషయానికి వస్తే రాజ్యాంగ అధికరణలు 15(4), 15(5), 16(4), 340 ప్రవచించే సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారు. ఇక, రాజ్యాంగం కేవలం అంటరానితనం దురాచారాన్ని ఎదుర్కొంటున్న సమూహాలను మాత్రమే షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించిందని, గిరిజనులను షెడ్యూల్డ్ తెగలుగాను, బీసీలను వెనుకబడిన తరగతులుగాను, అగ్రకులాలుగా పేర్కొంటున్న వారిని ఇతరులుగానూ రాజ్యాంగం గుర్తించిందని గమనించాలి. అలా, భారతీయ సమాజాన్ని నాలుగు ప్రధాన సమూహాలుగా గుర్తించింది. అలాగే, రిజర్వేషన్లు పొందుతున్న మూడు సమూహాలకు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) ఒకే ప్రాతిపదిక కూడా లేదు. ఈమధ్య కొత్తగా అగ్రకులాలలోని పేదలకు ఈడబ్ల్యుఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. నిజానికి రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన కోసం ఉద్దేశించినవి కావు. ఈ దృష్ట్యా రిజర్వేషన్లలో ఆర్థిక ప్రాతిపదిక గురించి, క్రీమీలేయరు గురించి చర్చిస్తున్నవారు అందరికీ ఒకే ప్రాతిపదిక ఉన్నట్లు కిచిడి సిద్ధాంతాన్ని వండివార్చుతున్నారు. ఆ సిద్ధాంతంలో భాగంగానే గవాయ్ వ్యాఖ్యలు ఉన్నాయి.



'ఇప్పటికే ఉన్నత స్థానాలకు చేరిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలే ఇంకా రిజర్వేషన్ ఫలాలను పొందుతున్నాయి. దీనివల్ల ఆయా వర్గాలలోని నిజమైన పేదలకు అన్యాయం జరుగుతోంది. రిజర్వేషన్ల ఫలాలు అట్టడుగువర్గాలకు చేరాలంటే క్రీమీలేయర్‌ను గుర్తించి వారిని మినహాయించాలి. అప్పుడే నిజమైన సమానత్వం సాధ్యం' అంటున్నారు గవాయ్. ఈ స్టేట్‌మెంట్ చూసినప్పుడు ఆయన గొప్ప సమానత్వవాదిగా కనపడతారు. మరి ఆయన వ్యాఖ్యలలోని సమానత్వం ఎవరిమధ్య? కేవలం షెడ్యూల్డ్ కులాల మధ్యనా, లేక వారికీ ఇతర కులాలకూ మధ్యనా? దేశ ప్రజల మధ్య సమానత్వం రిజర్వేషన్ల ద్వారా మాత్రమే వస్తుందని రాజ్యాంగం కూడా భావించడం లేదు. అలా భావించినట్లయితే ఆదేశిక సూత్రాలను పొందుపరిచేది కాదు. ఈ విషయం గవాయ్‌కి తెలియదా?

భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించి 75 ఏళ్లు అయిన తర్వాత కూడా ఈ దేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్న 30 మందిలో 24 మంది అగ్రకులాల వారే. ఐఏఎస్ అధికారుల్లో 68 శాతం, సెక్రెటరీ, అడిషనల్ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలలో 90 శాతం, సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లలో 90 శాతం అగ్రకులాల వారే. కార్పొరేట్ సీఈవోలలో దలాల్ స్ట్రీట్ స్టడీ (2024) ప్రకారం ఎన్ఎస్ఈ 500 కంపెనీలలో 89 శాతం అగ్రకులాల వారే. ఇలా ప్రతిరంగంలో అసమానతలు కనిపిస్తాయి. మరి, గవాయ్ ఎవరి మధ్య సమానత్వం గురించి మాట్లాడుతున్నారు?

బాబూ జగ్జీవన్‌రామ్ 1978లో దేశ రక్షణమంత్రి హోదాలో బెనారస్‌లో 'సంపూర్ణానంద్' విగ్రహావిష్కరణ చేసి వచ్చిన తర్వాత, ఆ విగ్రహాన్ని బ్రాహ్మణులు గంగాజలంతో శుద్ధి చేశారు. 2018 లో రామనాథ్ కోవింద్ దంపతులు పూరి జగన్నాథ ఆలయానికి వెళితే అక్కడివారు అడ్డుకున్నారు. ఇటీవల సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటననూ చూశాం. అత్యున్నత హోదాలో ఉన్న వారిపైనే ఇలా వెలివేతలు, వివక్షలు కొనసాగుతున్నప్పుడు ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుంది? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవీపీఎస్ వారు దళితులతో దేవాలయ ప్రవేశం చేయిస్తే దేవుడు మైలపడ్డాడని చెప్పి, దేవాలయాన్నీ, దేవుడినీ కూడా వెలివేశారు. ఇదీ మన దేశ ప్రత్యేకత! ఈ ప్రత్యేకత కారణంగానే షెడ్యూల్డ్ కులాలకు రిజర్వేషన్లు ఏర్పడ్డాయి.

క్రీమీలేయర్ గురించి మాట్లాడే అర్హత గవాయ్‌కి ఉందా? తండ్రి పార్లమెంటు సభ్యుడు, గవర్నర్ కాబట్టి ఈయన కూడా క్రీమీలేయరే. ఆ విధానమే కనుక ఉండివుంటే గవాయ్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యేవారా? ఈయన వాదన చూస్తుంటే 'ఏరు దాటినాక తెప్ప తగలెయ్యి' అన్న సామెత గుర్తుకొస్తోంది. అలాగే, ఆయన తన తీర్పులో పేర్కొన్న క్రీమీలేయర్ పద్ధతిలో తెలుగురాష్ట్రాలలో రిజర్వేషన్ల వర్గీకరణ జరగలేదు కూడా. పైగా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఇచ్చామని ఈయన చెబుతున్నారు. అలా ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? రిజర్వేషన్లలో మార్పులు చేయటం కానీ, అందులో క్రీమీలేయర్ పెట్టే అధికారంగాని సుప్రీంకోర్టుకు ఉందా? ఆ పని చేయాల్సింది పార్లమెంటే. పార్లమెంటు లేదా శాసనసభలు చేసే చట్టాలు రాజ్యాంగానికి అనుగుణంగా లేకపోతే వాటిని కొట్టి వేసే అధికారం మాత్రమే సుప్రీంకోర్టుకు ఉంది. పార్లమెంటు చేయాల్సిన పనిని తాను ఎలా చేస్తుంది? ఇది దేనికి సంకేతం? కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. విలువలు లేని రాజకీయాలు, పాలక పార్టీల సపోర్టుతో అస్తిత్వ ఉద్యమాలు, రాజ్యాంగ బద్ధంగా లేని తీర్పులను చూస్తున్నాం. గవాయ్ వ్యాఖ్యలను ఈ కోవలోనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. గవాయ్ నోట 'క్రీమీలేయర్' వడబోత ఉండాలని పలికిస్తున్నదెవరో, తీర్పులను ఇప్పించిందెవరో గ్రహించాల్సి ఉంటుంది.

◆ పట్టా వెంకటేశ్వర్లు

- వినుకొండ శాఖలో అక్రమాల ఉద్యోగికి పెద్దపీట
- గుంటూరులోని కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ కోట్లలో అక్రమాలు
- నల్లపాడులో అక్రమాలపై కేసులు.. మిగిలిన బ్రాంచ్‌లపై చర్యలెప్పుడో?



ఆరోగ్య శరణం.. అయ్యప్పో..!

- శబరిమల పయనానికి సిద్ధమవుతున్న దీక్షధారులు
- ఆరోగ్యం, ప్రయాణ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- స్వాములకు పలు సూచనలు చేస్తున్న అధికారులు, వైద్యులు

ఓం స్వామియే శరణం అయ్యప్ప అనే మంత్రంతో ప్రతి ఒక్కరూ పరవశించి పోతారు. ఈ నామమే భవసాగరాలు దాటించే తారకమంత్రమని దీక్షాధారులు భావిస్తారు. చలిని తట్టుకుంటూ, కఠిన నియమాలను పాటిస్తూ 41 రోజుల పాటు మండల దీక్షలు చేస్తారు. అక్టోబరు నుంచి జనవరి వరకు దీక్షధారులు పడిపూజలు, భజనలు, శరణు ఘోషలతో భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. దీక్షలు ముగియగానే ఇరుముడితో శబరిమలకు పయనమవుతారు. ఈసారి శబరిమలకు భక్తుల తాకిడి పెరగడంతో పాటు.. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం పలు సూచనలు చేస్తోంది. అలాగే రోడ్డు మార్గాన శబరిమలకు వెళ్లే.. స్వాముల కోసం ప్రమాదాల నివారణకు రవాణాశాఖ జాగ్రత్తలు చెబుతోంది.



sunday special

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే అయ్యప్పస్వామి మాలధారుల సంఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లాల నుంచి ఏటా పెరుగుతోంది. ఈసారి దీక్షధారుల సంఖ్య లక్షకు పైగానే ఉంది. తొలి రోజుల్లో రైలు మార్గంలోనే గమ్యస్థానానికి చేరుకున్న భక్తులు.. క్రమంగా తక్కువ వ్యవధి, ప్రయాణ సౌలభ్యం మేరకు ప్రైవేటు బస్సులు, సొంత కార్లలో వెళ్లి మణికంఠను దర్శించుకుని వస్తున్నారు. అక్టోబరు చివరి వారంలో దీక్షలు ప్రారంభించిన అయ్యప్పలు చాలామంది ఈ నెల 14 నుంచి 20వ తేదీ మధ్యలో ఇరుముడి కార్యక్రమాలు పూర్తి చేసుకుని శబరిమలకు పయనమయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రైవేటు వాహనాల్లో శబరిమలకు..

రైలు టికెట్లు దొరక్కపోవడంతో చాలామంది మాలధారులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రైలు టికెట్ సాధారణ తరగతుల్లో రిటర్న్ చార్జితో కలిపి దాదాపు రూ.4 వేలు అవుతుంది. పదిమంది భక్తులు కలిసి ఒక వాహనంతో ఏర్పాటు చేసుకున్నా.. అదే ఖర్చు అవుతున్న నేపథ్యంలో దీంతో చాల మంది ప్రైవేటు వాహనాల వైపే.. మొగ్గు చూపుతున్నారు.



జ్వరం, కీళ్ల నొప్పులు

శబరిమలకు వెళ్లిన దీక్షధారులకు చల్ల నీళ్ల స్నానంతో అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని కేరళ వైద్యులు చెబుతున్నారు. కేరళ నుంచి వచ్చిన భక్తుల్లో జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయని ఇక్కడి వైద్యులు చెబుతున్నారు.

వైద్యుల సూచనలు

కేరళలోని నీలక్కల్, ఎరుమేళి, పంబా నది స్నాన సమయంలో ముక్కు, చెవిలో నీరు చేరకుండా జాగ్రత్త పడాలి. పంబలో ఒకసారి మునిగిన అనంతరం చెంబుతో స్నానం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్లనే వినియోగించి, వ్యర్థాలను చెత్త బుట్టలోనే వేసి.. అక్కడి ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను పాటించాలి. వీలైనంత వరకు పంబా నదిలో కాకుండా (మిగతా 6వ పేజీలో)



వాహనం, డ్రైవర్ కండిషన్‌లో ఉండాలి

ప్రయాణం కలిస్తోందనే కారణంతో చాలామంది డ్రైవర్లు రాత్రిళ్లు వాహనాన్ని నడుపుతుంటారు. వేకువ జామున వాహనాన్ని నిలిపి, విశ్రాంతి తీసుకోవాలి. టోల్ ప్లాజాల వద్ద ఉన్న గదులను వినియోగించుకోవాలి. అధిక వేగం, మద్యం తాగి వాహనాన్ని నడిపితే.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- కె.సీతారామిరెడ్డి, ఉప రవాణా కమిషనర్, గుంటూరు

నేటికీ ఇంటి దొంగలకు.. సహకారం

విచారణ సాగదు.. క్రిమినల్ కేసులు ఉండవు

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు డీసీసీబీ బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు రూ.22 కోట్లు పైనే అక్రమాలు జరిగినట్లు ఇటీవల తేల్చారు. ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్‌తో పాటు మాజీ చైర్మన్ లాల్‌పురం రాము, పాలకవర్గ సభ్యులు మొత్తం 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సహకార శాఖలో కలకలం రేకెత్తిస్తోంది. అయితే నల్లపాడు శాఖలో కుంభకోణం కంటే ముందుగానే వినుకొండ, గురజాల శాఖల్లోనూ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పేరుతో నకిలీ గ్రూపులను సృష్టించి రూ.కోట్లలోనే దోచేసిన వైనంపై నేటికీ ఎటువంటి చర్యల్లేవు. గుంటూరు నగర పరిధిలోని కొరిటపాడు, సిటీ శాఖల్లో నకిలీ గ్రూపులు సృష్టించి రూ.కోట్లలో రుణాలు పొందినట్లు సమాచారం. అక్రమాలపై విచారణల పేరుతో దీర్ఘకాలంగా సాగదీస్తున్నారే తప్ప బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అధికారం అండతో చెలరేగిపోయిన ఇంటి దొంగలపై విచారణల పేరుతో సాగదీశారన్న ఆరోపణలు ఉన్నాయి.

గత వైసీపీ హయాంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పరిస్థితి. డీసీసీబీ శాఖల్లో చోటుచేసుకున్న అక్రమాల్లో ఇంటి దొంగలే కీలకం కాగా వారికి పాలక వర్గంతో పాటు కొందరు అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. ప్లెడ్జి రుణాలు, స్వయం సహాయక సంఘా (ఎస్‌హెచ్‌జీ)ల పేరుతో నకిలీలు సృష్టించి కోట్లు దండుకున్నారని సమాచారం. కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై అడ్డగోలుగా రూ.కోట్లు పోగేసుకోగా నామమాత్రపు చర్యలు కూడా తీసుకోలేదు. అయితే నల్లపాడు శాఖలో అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం అంతకంటే ముందుగానే వినుకొండ, గురజాల శాఖల్లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక వినుకొండలో ఎస్‌హెచ్‌జీల పేరుతో అక్రమాలు రూ.కోట్ల లోనే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగి రూ.కోటి 70 లక్షలు తిరిగి చెల్లించినట్లు తెలిసింది. పైగా అక్రమాలకు పాల్పడిన సదరు ఉద్యోగికి మరింత ప్రాధాన్యం కలిగిన పోస్టింగ్ కల్పించినట్లు ఆరోపణలు (మిగతా 6వ పేజీలో)



దిండిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు

- రూ.85 కోట్లు మంజూరు
- వంద ఎకరాల భూసేకరణ పూర్తి
- భూలెవల్ పనులు ప్రారంభించిన అధికారులు
- నిర్మాణం పూర్తయితే అంతర్జాతీయంగా గుర్తింపు
- సీఎం చేతుల మీదుగా త్వరలో శంకుస్థాపన

8

లోక్ అదాలత్‌లో గుంటూరు రికార్డు

- సివిల్ కేసుల పరిష్కారంలో మూడోసారి ప్రథమ స్థానం
- జిల్లా వ్యాప్తంగా 23,497 కేసుల పరిష్కారం.. రూ.57.68 కోట్ల లబ్ధి

గుంటూరు లీగల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో వరుసగా మూడో సారి గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 23,497 కేసులు పరిష్కారం కాగా, అందులో 1407 సివిల్ కేసులు ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.57,68,57,572 లబ్ధి చేకూరింది. శనివారం జిల్లా కోర్టుతోపాటు, జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లోక్‌అదాలత్ లక్ష్యమన్నారు. మోటారు వెహికల్ కేసుల్లో మృతుల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవం వల్ల బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందుతుందన్నారు. ఓ మోటారు వాహన ప్రమాదంలో మరణించిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి లోక్ అదాలత్‌లో జరిగిన పరిష్కారంలో రూ.1 కోటి పరిహారం దక్కిందన్నారు. విజ్ఞాన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ట్రస్ట్, డాక్టర్ పి.రాజా రామ్మోహన్ మధ్య 2021 నుండి పెండింగ్‌లో ఉన్న ఐదు చెక్ బౌన్స్ కేసులను పరిష్కారంతో రూ.20 కోట్లు రాజీ కుదిర్చినట్లు చెప్పారు. సివిల్ 1,407, క్రిమినల్ 21,415, చెక్ బౌన్స్ 578, ప్రీ లిటిగేషన్ 97 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరి, న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్‌తో పాటు న్యాయాధికారులు వి.ఎ.ఎల్.సత్యవతి, వై.నగరాజ, వెంకట నాగశ్రీనివాసరావు, ఆర్.శరత్‌బాబు, కె.నీలిమ, జి.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి, న్యాయాధికారులు

రెండు వారాల్లో జరీబు సమస్య పరిష్కారం

- మట్టి, నీటిమట్టం పరీక్షల చేసి శాస్త్రీయంగా నిర్ధారణ
- త్రిసభ్య కమిటీ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు,తుళ్లూరు డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జరీబు భూముల నిర్ధారణ సమస్యకు రెండు వారాల్లో పరిష్కారం లభిస్తుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. త్రిసభ్య కమిటీ శనివారం సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతులతో సమావేశమైంది. ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను పెమ్మసాని మీడియాకు వివరించారు. 180 ఎకరాలు జరీబు భూములు ఉండగా వాటిని నిర్ధారించేందుకు మట్టి, నీటి మట్టం శాస్త్రీయ పరీక్ష ఫలితాలు రాగానే వాటి సమస్యకు ముగింపు పలుకుతామన్నారు. మందడంలో రోడ్డు రెండు అలైన్‌మెంట్లలో రైతుల అభిప్రాయాలు, ఎమ్మెల్యే సూచనల మేరకు ఒకదాన్ని ఎంపిక చేశామన్నారు. భూసేకరణకు సంబంధించిన మొత్తం 47 కేసులు పరిశీలనలో ఉండగా వాటిలో దాదాపు అన్ని పరిష్కార దశకు చేరాయి. అమరావతి రాజధాని అవసరాల దృష్ట్యా దశలవారీగా 2500 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌లో 69,421 ప్లాట్లలో 61,793 ప్లాట్లు(89 శాతం) ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. మిగిలిన 7,628 ప్లాట్ల సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. లంక భూములపై గతంలో ఉన్న న్యాయపరమైన సంక్లిష్టతలను అధిగమించి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేశామన్నారు. రోడ్డు పోటు భూములు, టీడీఆర్ బాండ్స్, నష్టపరిహారం అంశాలపై రైతులకు ఇబ్బంది కలగకుండా న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ 26 గ్రామాల అభివృద్ధికి సంబంధించి 12 డీపీఆర్‌లు పూర్తయ్యాయన్నారు. గ్రామాల్లో 18 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.22.6 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా సుమారు 3000 మందికి పెన్షన్ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2000 మందికి కొత్తగా హెల్త్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ, గుంటూరు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



8

నీరుకొండ రిజర్వాయర్ పనులు వేగవంతం

- భారీ యంత్రాలతో కొనసాగుతున్న మట్టి పని
- వచ్చే ఏడాది చివరకు పనులు పూర్తి చేయడమే లక్ష్యం

సీసీఐ జనరల్ మేనేజర్ బదిలీ?

- వివాదాలు, సీఐడీ కేసుపై చర్చ
- ఇంత జరుగుతున్నా రైతులను వదలని బయ్యర్లు
- తేమ పేరుతో క్వింటాల్‌కు 5 కేజీల కోత

మీటింగ్‌లో యూట్యూబ్ చూడొద్దు

- ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకోవాల్సిందే
- లేకుంటే నేనే బయటకు పంపుతా
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సున్నిత మందలింపు

ప్రియురాలి కోసమే భార్య, బిడ్డ హత్య


6

విచారణ.. తూతూమంత్రం

- రికార్డులు పరిశీలించకుండానే నివేదిక
- సాంఘిక సంక్షేమశాఖ అక్రమాలపై విచారణలో అనుమానాలు



గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రికార్డులు పరిశీలించలేదు.. రూ.లక్షల బిల్లులు చెల్లింపులపై ప్రాథమిక విచారణ చేయలేదు.. దర్యాప్తు చేసి రిపోర్టుకు సిఫార్సు చేసిన అధికారులను ప్రశ్నించలేదు.. అయినా సాంఘిక సంక్షేమ శాఖలో జరిగిన అక్రమాలపై దర్యాప్తును అటకెక్కిస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయి. తూతూమంత్రంగా విచారణను ముగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరులోని హయ్యర్ హాల్ ప్రాంగణంలోని రెండు సాంఘిక సంక్షేమ కళాశాల హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయక పోయినా రూ.45 లక్షలకుపైగా బిల్లులు చెల్లించారు. మరో విద్యార్థినుల హాస్టల్‌లో ప్రెగ్నెంట్ కిట్లు బహిర్గతమైన సంఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఇదే హాస్టల్లో ఓ విద్యార్థిని అదృశ్యమై నెలరోజుల తర్వాత తిరిగి వచ్చింది. హయ్యర్ హాల్ ప్రాంగణంలో(రమేష్ హాస్పటల్ పక్కన) ఉన్న హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమై హిజ్రాల పంచన చేరారు. ఇందుకు ప్రతిఫలంగా హిజ్రాలు వసతి గృహంలోని మహిళలకు రూ.60 వేలకు పైగా నగదు ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అంతేకాకుండా సదరు మహిళ బంధువులు కళాశాల హాస్టల్‌లో విద్యార్థులపై దాడులు చేసిన సంఘటనలో ఉన్నాయి. ఆయా ఘటనలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో కమిషనరేట్ ఆదేశాలతో డీడీ స్థాయి అధికారిని విచారణ కోసం నియమించారు. అయితే సదరు అధికారి దర్యాప్తు సక్రమంగా చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజులు క్రితం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయానికి వచ్చి తూతు మంత్రంగా కొన్ని రికార్డులు పరిశీలించి వెళ్లినట్లు సమాచారం. మరోవైపు ఓ వెల్ఫేర్ ఆఫీసర్‌పై విజిలెన్స్ దర్యాప్తు కూడా పెండింగ్ ఉంది.



లేఅవుట్లలో ఖాళీ ప్లాట్లు ఎన్నో తెలియదు

- కలెక్టరేట్ ఆదేశాలపై మూడు శాఖల సమాధానం
- వివరాలు లేవని చేతులెత్తేసిన రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖలు

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కోసం ఎన్ని గ్రామాల్లో లేఅవుట్లు వేశారు.. వాటిలో మొత్తం ప్లాట్ల సంఖ్య ఎంత.. లబ్ధిదారులకు పంపిణీ చేయగా ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయి.. అంటే రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖలు చెప్పలేకపోతున్నాయి. ఈ లేఅవుట్లకు సంబంధించి భూసేకరణను రెవెన్యూ శాఖ చేయగా, లబ్ధిదారుల ఎంపిక, కన్వేయన్స్ డీడ్‌ల రిజిస్ట్రేషన్లను మున్సిపల్/పంచాయతీరాజ్ శాఖలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చూశాయి. లేఅవుట్ల అభివృద్ధి హౌసింగ్ శాఖ పర్యవేక్షించింది. అయితే ఇప్పుడు ఖాళీ ప్లాట్లకు సంబంధించిన తగిన వివరాలను ఎవరూ చెప్పలేకపోతుండటంపై కలెక్టరేట్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మూడు శాఖలతో సమావేశం ఏర్పాటు చేసి ఖాళీ స్థలాల సంఖ్యను నిర్ధారించి జిల్లాలో నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో పేదలందరికి ఇళ్ల స్కీమ్ కింద నివేశన స్థలాల కోసం దరఖాస్తుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. అయితే ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం వద్ద ఎలాంటి ల్యాండ్ బ్యాంకు లేదు.

1158 దరఖాస్తులు రాక..

ఇళ్ల స్థలాల కోసం ఇటీవల జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 1158 దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో గుంటూరు తూర్పులో 106, పశ్చిమలో 398, మంగళగిరిలో 40, పొన్నూరులో 15, తాడేపల్లిలో 23, అత్యధికంగా తెనాలిలో 576 మంది అర్జీలు పెట్టుకున్నారు. వీటిల్లో ఒక్కటి కూడా ఆమోదించలేదు. 517 అర్జీలను తిరస్కరించారు. మిగతావి కూడా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 652 అర్జీలు వచ్చాయి. గుంటూరు పశ్చిమలోని గ్రామాల్లో 81, మేడికొండూరులో 40, పెదకాకానిలో 22, పెదనందిపాడులో 2, ఫిరంగిపురంలో 8, ప్రత్తిపాడులో 6, తాడికొండలో 160, తుళ్లూరులో 52, వట్టిచెరుకూరులో 91, చేబ్రోలులో 24, దుగ్గిరాలలో 16, కాకుమానులో 7, కొల్లిపరలో 11, మంగళగిరిలో 7, పొన్నూరులో 14, తెనాలి రూరల్‌లో 111 అర్జీలు వచ్చాయి. వీటిల్లో 17 ఆమోదించి 378 ఇప్పటివరకు తిరస్కరించారు. మిగతావి కూడా పెండింగ్‌లో పెట్టారు.

301 లేఅవుట్లలో 18628 ఖాళీ స్థలాలు

జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 301 లేఅవుట్లలో ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తుళ్లూరులో అత్యధికంగా 9866, తెనాలిలో 2145 మంగళగిరిలో 1970, గుంటూరు పశ్చిమలో 1644, చేబ్రోలులో 432, దుగ్గిరాలలో 104, కాకుమానులో 127, కొల్లిపరలో 109, మేడికొండూరులో 359, పెదకాకానిలో 39, పెదనందిపాడులో 322, ఫిరంగిపురంలో 52, పొన్నూరులో 506, ప్రత్తిపాడులో 96, తాడేపల్లిలో 7, తాడికొండలో 535, వట్టిచెరుకూరులో 315 కలిపి 18628 ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వీటిని ఎవరూ నిర్ధారించడం లేదు. కాగా తుళ్లూరులో చూపించిన ప్లాట్లు ఆర్5 జోన్‌లోవి కావడంతో వాటిని కొద్ది రోజుల్లోనే ఈ జాబితా నుంచి తొలగించే అవకాశం ఉన్నది. అయినప్పటికి మరో 9 వేల ప్లాట్ల వరకు అందుబాటులో ఉంటాయి.

ఏయూ దూరవిద్య..
పరీక్షల నిర్వహణపై ఆరా

గుంటూరు(విద్య), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూర విద్య పరీక్షలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 12న వార్తావాహిని దూరంగా.. పరీక్షలు శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఏయూ దూరవిద్య అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. కాపీ జరుగుతున్నట్టు అనుమానిస్తున్న పరీక్ష కేంద్రాలకు ఫోన్ చేసి అధికారులు వివరాలు తెలుసుకున్నారు. పరీక్షల్లో అవకతవకలు జరిగితే.. సహించబోమని హెచ్చరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో స్టడీ సెంటర్లు వ్యవహరిస్తే.. భవిష్యత్తులో ప్రభుత్వ కళాశాలల్లోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. దూరవిద్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏయూ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, కొందరు స్టడీ సెంటర్ల నిర్వాహకులు ధన దాహంతో పరీక్షలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రియురాలి కోసమే భార్య, బిడ్డ హత్య

● నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు



మృతి చెందిన త్రివేణి, చిన్నారి(ఫైల్ ఫోటోలు)

నరసరావుపేట రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలి మోజులో కట్టుకున్న భార్యను, కన్న బిడ్డను కడతేర్చాలని పథకం పన్నాడు. భార్య, బిడ్డను కాలువలో బలవంతంగా తోసేసి. ఆత్మహత్యలా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కానీ, పోలీసుల విచారణలో కామంతో కళ్లుమూసుకు పోయిన అతని కర్కశత్వం బయట పడింది. విచారణ వివరాలు ఇలా ఉన్నాయి. భార్య శవం దొరికినా.. ఏడు నెలల పసికందు ఆచూకీ ఇంత వరకు లభించలేదు. నరసరావుపేట మండలం పాలపాడులోని చిలకలూరిపేట మేజరు కాలువలో తల్లీబిడ్డ మృతి కేసును పోలీసులు చేదించారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ వివరాల మేరకు.. రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. నరసరావుపేట పట్టణంలో మరో మహిళతో అతనికి అక్రమ సంబంధం ఏర్పడింది. దీంతో భార్యను, తన ఏడు నెలల చిన్నారిని పథకం ప్రకారం అడ్డు తొలగించుకోవాలని చూశాడు. ఈ నెల 5న రాత్రి 11 గంటల సమయంలో నరసరావుపేట మండలం పాలపాడు వద్ద గల చిలకలూరిపేట మేజరు కాలువలో భార్య త్రివేణి(26), శరత్(7 నెలలు) బలవంతంగా తోసేశాడు. అనంతరం పోలీసులు కాలువలో వెతకగా మూడు కిలోమీటర్ల దూరంలో త్రివేణి మృతదేహం లభ్యం కాగా, నేటికి శరత్ ఆచూకీ దొరకలేదు. మృతురాలి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా శనివారం నిందితుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసులో చాకచక్యంగా నిందితుడిని అరెస్టు చేసిన నరసరావుపేట రూరల్ సీఐ ఎం.సుబ్బారావు, రూరల్ ఎస్ఐలు కిషోర్, ఫాతిమా, కాశింవలీను డీఎస్పీ హనుమంతరావు అభినందించారు.

మీటింగ్‌లో యూట్యూబ్ చూడొద్దు

● ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకోవాల్సిందే
● లేకుంటే నేనే బయటకు పంపుతా
● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సున్నిత మందలింపు



గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాను ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యే వాళ్లు ఎవరైనా సరే యూట్యూబ్ చూడటం, ఫోన్లు మాట్లాడటం చేస్తే వాళ్లని బయటకు పంపించేస్తానని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సున్నితంగా మందలించారు. శనివారం అమరావతి రాజధానిలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతుల సమస్యలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. గత సమావేశంలోనే మంత్రి పెమ్మసాని ఈ విషయంపై నొక్కి చెప్పారు. అయినప్పటికీ కొందరు అదే పనిగా ఫోన్లు మాట్లాడటం, యూట్యూబ్ చూడటం, పెద్దగా రింగుటోన్ పెట్టడం వంటివి చేశారు. దాంతో పెమ్మసాని ఒకింత అసహనానికి గురయ్యారు. అమరావతి రాజధానికి చెందిన వందలాది మంది రైతుల సమస్యలు చర్చించడమంటే ఎంతో సీరియస్ విషయమని, అయినప్పటికీ కొందరు తేలికగా తీసుకుంటున్నారన్నారు. సమావేశానికి 50 మందికి పైగా రైతులు హాజరయ్యారని, వాళ్లంతా మాట్లాడేందుకు అవకాశం కల్పించాలన్నారు. రైతులు చెప్పే సమస్యలను తాము అర్థం చేసుకోవాలంటే ఎలాంటి ఆటంకాలు ఉండకూడదన్నారు. అందుకే తాను కొంచెం కటువుగా వ్యవహరించాల్సి వస్తోన్నదన్నారు. శని, ఆదివారం గుంటూరులోని తన కార్యాలయం లో అందుబాటులో ఉంటానని, అక్కడికి వచ్చి కూడా సమస్యలు చెప్పుకోవచ్చని పెమ్మసాని తెలిపారు.

సీసీఐ జనరల్ మేనేజర్ బదిలీ?

● వివాదాలు, సీఐడీ కేసుపై చర్చ
● ఇంత జరుగుతున్నా రైతులను వదలని బయ్యర్లు
● తేమ పేరుతో క్వింటాల్‌కు 5 కేజీల కోత

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సంచలన నిర్ణయం తీసుకుంది. సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా ను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. సీజన్ మధ్యలో సీసీఐ మేనేజర్‌పై బదిలీ వేటు పడటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రాజేంద్ర షా బదిలీకి పూర్తిగా ఆయన వ్యక్తిగత విషయాలే కారణమని కొందరు చెబుతున్నారు. గతేడాది ఖచ్చితంగా ఇదే సమయంలో గుంటూరులో జనరల్ మేనేజర్‌గా ఉన్న అమర్నాథ్‌రెడ్డిని సీసీఐ యాజమాన్యం బదిలీ చేసింది. పత్తి కొనుగోళ్ల వ్యవహారంలో అప్పటి మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి కొంత నిర్లక్ష్యం ప్రదర్శించి నందు వల్ల ఆయనపై బదిలీ వేటు పడినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆయన స్థానంలోనే సీసీఐ జనరల్ మేనేజర్‌గా రాజేంద్రషా గుంటూరుకు వచ్చారు. ముఖ్యంగా గతేడాది ఆంధ్రప్రదేశ్‌లోని 30 సీసీఐ కేంద్రాల్లో జరిగిన పత్తి కొనుగోళ్ల వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. బయ్యర్లు క్వింటాల్ పత్తిలో 5 నుంచి 10 కేజీల వరకు కోత పెట్టి లబ్ధి పొందారు. ఈ విధంగా కోత పెట్టిన సుమారు 40 వేల బ్లై బేళ్లను అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలొచ్చాయి. ఈ విధంగా రాష్ట్రంలోని సీసీఐ బయ్యర్లు సుమారు రూ.140 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపణలు రావటంతో సీఐడీ విచారణ ఆరంభమైంది. ప్రస్తుతం సీఐడీ విచారణ జరుగుతుండగా రాజేంద్ర షాపై బదిలీ వేటు పడటం అనుమానాలకు తావిస్తోంది. సోమవారం నాటికి ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి క్లారిటీ రావడంతో పాటు, సీసీఐ గుంటూరు కొత్త జనరల్ మేనేజర్‌గా ఎవరు రాబోతున్నారు అన్న విషయం కూడా వెల్లడి కానుంది. ఇంత జరుగుతున్నా.. కొందరు సీసీఐ బయ్యర్లలో మాత్రం మార్పు రావడం లేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తి క్వింటాల్‌కు 10 కేజీలకు తగ్గకుండా కోత పెడుతున్నారు. పల్నాడులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడి కేంద్రాల్లో తేమ శాతం చూసినందుకు కూడా నగదు వసూలు చేస్తున్నారు. ఒక వేళ తేమ ఎక్కువ ఉంటే క్వింటాల్ కు 10 నుంచి 15 కేజీలు కోత పెడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెద్ద అధికారి బంధువు.. గుడ్డి పత్తి మాయ

ఇదిలా ఉంటే ఒక పెద్ద అధికారి బంధువు ఏకంగా పూర్తి గా గుడ్డి పత్తినే కొని సీసీఐ కేంద్రాల్లో చెలామణి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సదరు అధికారి చాలా కీలక స్థానం లో ఉండటంతో బయ్యర్లు ఏమీ చేయలేని పరిస్థితి ఉందని అంటున్నారు.

తక్ పట్టీలో భారీ మోసం

వాస్తవానికి రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చే పత్తి తూకం వే బ్రిడ్జి రసీదు ఆధారంగా నిర్ధారించాలి. తెలంగాణతో పాటు మిగిలిన రాష్ట్రాల్లో అదే పద్దతిలో తక్ పట్టీ (ఎంత పత్తి తీసుకువచ్చారు అని చెప్పే అధికారిక రసీదు) తయారు అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా తక్ పట్టీ తయారు చేస్తున్నారు. వే బ్రిడ్జి రసీదు ఆధారంగా తక్ పట్టీ తయారు చేస్తే రైతులు తెచ్చే పత్తిలో కోత పెట్టడానికి కుదరదు. అలా జరగక పోవడం వల్లే రైతులు తెచ్చే పత్తిలో భారీ కోతలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసినా సిబ్బంది ఏమీ తెలియనట్లు నిద్ర నటిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా.. రైతుల జేబుకు చిల్లు పడే అవకాశం ఉండకపోవచ్చు.

ఆత్మీయంగా..నలభై వసంతాలుగా..

● వ్యవసాయ కళాశాల పూర్వవిద్యార్థుల కలయిక



1985 బ్యాచ్ కళాశాల విద్యార్థులు

బాపట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. 1985వ బ్యాచ్ విద్యార్థులు 40 వసంతాల సమ్మేళనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 2014లో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన కాంతిలాల్ దండే, ప్రస్తుత అస్సాం ప్రభుత్వ ఛీఫ్‌సెక్రటరి మహ్మద్ అరీఫ్ వంటి ఐఏఎస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొని తమ మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఎంహెచ్ గంగాధర్, మహేష్‌బాబు, దేవకుమార్, విజయనిర్మల, డి.సురేంద్ర, ఆర్డీ ప్రసాద్, కేవీ గోపీకృష్ణ, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, సునీత, డాక్టర్ బి.ముకుందరావు, డాక్టర్ జేవీ రమణ, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, బ్యాంక్‌మేనేజర్లు, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు. అమెరికా నుంచి సురేంద్ర, వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా విచ్చేశారు. ప్రస్తుత విద్యార్థినులు మరకత వీణ శాస్త్రీ భరత నాట్యంతో, పావని మౌక్తిక జానపద నాట్యంతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్.శ్రీనివాస్, పూర్ణచంద్రరావు, కాటూరి నాగేశ్వరరావు, ప్రొఫెసర్ డీవీ సాయిరామ్ కుమార్ నిర్వహించారు.

లేబర్ కోర్టు ఏపీపీగా సురేష్ బాబు



సురేష్ బాబు(ఫైల్)

గుంటూరు (లీగల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కార్మిక న్యాయ స్థానం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాది మొఖమాటం సురేష్ బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పరిశ్రమల యాజమాన్యం, కార్మికుల మధ్య ఉత్పన్నమైన వివాదాలను గుంటూరులో ఉన్న ఈ కార్మిక న్యాయస్థానం పరిష్కరిస్తుంది. తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సురేష్ బాబు జేసీ లా కళాశాలలో న్యాయ విద్యను అభ్యసించారు. 2002 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సురేష్ బాబు మూడేళ్లు ఏపీపీగా పని చేయనున్నారు.

ఆరోగ్య శరణం.. అయ్యప్పో..!

(5వ పేజీ తరువాయి)

ఎరుమేళి, నీలక్కల్ ప్రాంతాల్లోనే స్నానాలు పూర్తి చేసుకుని కొండకు పయనమైతే మంచిదని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రయాణంలో జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు, గ్యాస్ట్రిక్, షుగర్, బీపీలతో బాధపడుతున్న వారు విధిగా మందులను తమ వెంట తీసుకువెళ్లాలి. వీటితో పాటు మాస్క్‌లను విధిగా ధరించాలి.

రవాణశాఖ అధికారుల సూచనలు

గుంటూరు నుంచి శబరిమలకు దాదాపు 1,200 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా రవాణశాఖ అధికారులు పలు సూచనలిస్తున్నారు. అద్దెకు తీసుకునే వాహనం కండిషన్, ఫిటెనెస్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలను ముందుగా పరిశీలించాలి. డ్రైవర్ లైసెన్సును తనిఖీ చేసి, అతని అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవాలి. బస్సులోని అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేసుకోవాలి. ప్రత్యామ్నాయ డ్రైవరు ఉన్నాడో లేదో చూసుకోవాలి. ప్రయాణంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే రోడ్డు సేఫ్టీ అధికారులకు లేదా హైవే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సత్రాల్లో వసతి మేలు..

ప్రయాణంలో విజయవాడ, శ్రీశైలం, మహానంది, కాణిపాకం ఇతర పుణ్యక్షేత్రాలను భక్తులు సందర్శిస్తుంటారు. ఈ సమయంలో గైడ్లు ఇతరుల మాటలను నమ్మకుండా దాతలు నిర్మించిన సత్రాల్లో వసతి పొందాలి. అప్పుడే తక్కువ ఖర్చుతో కొండకు చేరుకోవచ్చు. తమిళనాడులోని అరుణాచలం, పళని, కన్యాకుమారి, రామేశ్వరం, మధురై, శ్రీరంగం క్షేత్రాల్లో తెలుగు వారు నిర్మించిన సత్రాలు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెల్యే నరేంద్రకు పలువురి జన్మదిన శుభాకాంక్షలు





కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల, శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం గుంటూరు నగరంలోని పొన్నూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ధూళిపాళ్ళ నరేంద్ర శాసన సభ్యుడిగా ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిక్షణం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశారన్నారు. ఆయన రాజకీయ జీవితం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 6 సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారన్నారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి సంగం డెయిరీని కబ్జా చేయాలనే దురుద్దేశంతో నరేంద్ర కుమార్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేసినా.. ఎప్పుడు వెనకడుగు వేయలేదన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు ఆయన అధిరోహించాలని.. ప్రజాసేవకు మరింత పునరంకితం కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నరేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, నార్నె శ్రీనివాస్, పాములపాటి శివన్నారాయణ, షేక్ మొహిద్దీన్, బత్తుల సురేష్ తదితరులున్నారు.

నేటికీ ఇంటి దొంగలకు.. సహకారం

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. అలానే ప్రత్తిపాడు శాఖలో జరిగిన అక్రమాలపై 59 నోటీసు జారీ చేసి ఓ అధికారిని తప్పించి మిగతా ముగ్గురును సస్పెండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌ల్లో రైతుల సొమ్ము స్వాహాపై కొందరు ఇటీవల ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదుతో మంగళగిరి పీఏసీఎస్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడ పనిచేసే ఉద్యోగులే అక్రమాలలో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. కురగల్లు సొసైటీలో కొందరు ఉద్యోగులే నకిలీ పత్రాలు సృష్టించి సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా కొందరు అధికారులు రైతుల సొమ్ము దోచేసి దర్జాగా తిరుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు డీసీసీబీ శాఖల్లో ప్రక్షాళన చేయాలని రైతులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

జీజీహెచ్‌కు మహర్దశ : ఎమ్మెల్యే నసీర్



వైద్య పరికరాల కోసం వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ (ఫైల్)

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంజీవనిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాసుపత్రికి మహర్దశ తీసుకొచ్చేందుకు తాను చేసిన కృషి ఫలితాన్నిచ్చినందుకు సంతోషంగా ఉందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో వివిధ విభాగాల్లో వైద్య పరికరాల అవసరాన్ని పలు దఫాలుగా రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య శాఖ సెక్రటరీలను కలిసి విన్నవించానన్నారు. రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ఈ క్రమంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి 20 రకాల పరికరాలను ఇతర ఆస్పత్రుల నుంచి తరలించేందుకు అనుమతులు జారీ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. అడిగిన వెంటనే వైద్య పరికరాలను కేటాయించిన సీఎం చంద్రబాబు, వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డును పరిశీలిస్తున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ తదితరులు

రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని బృందావన్‌గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, రోడ్డు వెంట ఆక్రమణలను తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శనివారం మేయర్ బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మెయిన్ రోడ్లలో పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ, బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఆ పనులు కార్యరూపం దాల్చాయని తెలిపారు. ఈ పర్యటనలో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏసీపీ రెహ్మాన్, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

కళ్ళు ఉండి చూడలేని కబోదిలాగా వైసీపీ నేతలు : మేయర్

కళ్లు ఉండి చూడలేని కబోది లాగా వైసీపీ నేతల పని తీరు ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏపీ రాజధాని అమరావతికి ధీటుగా జిల్లా కేంద్రంగా ఉన్న గుంటూరు నగరాన్ని కూడా అభివృద్ధి పరుగు పెట్టిస్తున్నామన్నారు. కొందరు శనివారం శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వం, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై చేసిన అనవసర విమర్శలను ఖండిస్తున్నా మన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పెమ్మసాని చంద్రశేఖర్ శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. గతంలోనే 160 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి వచ్చిందన్నారని, అప్పుడే బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి వస్తే గత ఐదేళ్ల అధికారంలో ఉన్న అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.33 కోట్లు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి పురాతన ఆలయ పునర్నిర్మాణానికి దాతలు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర శనివారం తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం అంచనాలు రూ. 3.60 కోట్లు కాగా, అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.33 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. గుంటూరు కొత్తపేటకు చెందిన అయినవోలు పాపాచార్యులు కుమారుడు నరసింహాచార్యులు రూ. 1,00,116, సంగడిగుంట రెడ్ల బజార్‌కు చెందిన డి.మధు రూ.5,00,001, పాతగుంటూరు వాస్తవ్యుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి రూ.1,01,113, బ్రాడీపేట వాస్తవ్యుడు కాకుమాను నవీన్ కుమార్ రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.8,01,346 విరాళాలు అందజేసినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర తెలిపారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఇంటి స్థలం, అపార్ట్‌మెంట్‌లు, బిల్డింగ్‌లు, సొంత స్థిరాస్థిని ఏర్పాటు చేసుకోవటానికి కుటుంబ సమేతంగా క్రెడాయ్ 8వ ప్రాపర్టీషోకు హాజరై ప్రజలు తిలకిస్తున్నారు. అంతేగాక ప్రతి రోజు బంపర్ డ్రాలు తీసి, డ్రాలో గెలుపొందిన ఆరికి వివిధ రకాల బహుమతులు అందజేస్తున్నట్లు క్రెడాయ్ గుంటూరు అధ్యక్షుడు మామిడి రాము తెలిపారు. డ్రాలో గెలుపొందిన సందర్శకులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. క్రెడాయ్ గుంటూరు సీఆర్ఎస్ యాక్టివిటీలో భాగంగా ప్రాపర్టీ షో సందర్శకులకు ప్రతి రోజు వెయ్యి మొక్కల పంపిణీ జరుగుతుందని, ఆదివారం ప్రాపర్టీ షో ఆఖరి రోజు కావటంతో కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిల్డింగ్ మెటీరియల్స్‌కు సంబంధించిన అన్ని రకాల స్టాల్స్, వివిధ రుణ సదుపాయాలు కల్పించేందుకు బ్యాంకుల స్టాల్స్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.



బహుమతులు అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధ్యక్షుడు రాము తదితరులు

కేఎల్‌పీలో ముగిసిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు

గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలు శనివారం ముగిశాయి. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ వెల్లడించారు. చదువు, ర్యాంకులే లక్ష్యంగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, వారిలో సృజనాత్మక నైపుణ్యాలు, లోకజ్ఞానం పెంపొందించేలా పోటీలు రూపొందించామని తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు విజేతలకు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నడాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

వాలీబాల్ జట్ల విజేత వేజండ్ల

గుంటూరు(క్రీడలు) డిసెంబర్13(ఆంధ్రజ్యోతి) టీజేపీఎస్ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న మెగా స్పోర్ట్స్ మీట్‌లో వేజండ్ల జిల్లా పరిషత్తు పాఠశాల బాల బాలికల జట్లు వాలీబాల్ విజేతగా నిలిచాయి. వేజండ్ల బాలుర జట్టు ఫైనల్‌లో శాలమ్ హైస్కూల్ జట్టుపై గెలుపొందగా, బాలికల విభాగంలో వేజండ్ల జట్టు కేఎల్‌పీ పాఠశాల జట్టుపై విజయం సాధించింది.

స్తంభాలగరువులో డ్రెయినేజీ అధ్వానం

● కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని 36వ డివిజన్ పరిధిలోని స్తంభాలగరువు ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా కోదండ రామాలయం నుంచి నర్సిరెడ్డిపాలెం వరకు కాలువలు తీయడం లేదని, దోమల మందు కొట్టి ఏళ్లయిందని ఆరోపించారు. చెత్త బండి కనీసం నాలుగు రోజులకోసారి కూడా రావడం లేదని, ప్రతి సోమవారం కార్పొరేషన్‌లో జరిగే డయల్ యువర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. జీఎంసీ ఉన్నతాధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు.

స్తంభాలగరువు కాలువలలో ఉన్న వ్యర్థాలు →



నేడు తెనాలిలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



తులసీ యోగీష్‌చంద్ర

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు, కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ (కేఈపీఏ) తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 430 మంది పేద విద్యార్థులకు రూ.14.50 లక్షల ఉపకార వేతనాలు ఆదివారం పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూపు మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ.2.50 లక్షలు తులసీ సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా 65 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. ముఖ్య అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు వితరణ చేయనున్నట్లు ఎండీ తులసీ యోగిష్ చంద్ర పేర్కొన్నారు.

అభ్యుదయ కళాశాలలో స్పోర్ట్స్‌మీట్

గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పోటీల్లో భాగంగా రన్నింగ్, షాట్‌పుట్, బాస్కెట్‌బాల్, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించినట్లు డైరెక్టర్ బీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

విద్యార్థుల్లో సమాజిక స్పృహ పెంపొందించాలి : డీఎస్పీ

గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక స్పృహ పెంపొందించేలా ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు కృషి చేయాలని నగర డీఎస్పీ జి.భానోదయ సూచించారు. గోరంట్లలోని నవీనా పాఠశాలలో శనివారం నిర్వహించిన 46వ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ పవన్, పాఠశాల ఛైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి, కార్యదర్శి వై.చిన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు నవీన్‌రెడ్డి, డైరెక్టర్లు ఆనందరెడ్డి సునీత, మాధవి పాల్గొన్నారు

వైభవంగా ముగిసిన శ్రీరామ కోటి మహోత్సవం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం, శ్రీ శృంగేరి పీఠ పాలిత శ్రీ రామనామ క్షేత్రంలో 99వ శ్రీరామ కోటి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. సాయంత్రం అద్దాల మందిరంలో స్వామి పవళింపు సేవ భక్తి శ్రద్ధలతో జరిగింది. ప్రముఖ గాయని మైలవరపు దివ్యభారతి భక్తి సంగీత లహరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు రాగం వెంకట లీలా సుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు పర్యవేక్షించారు.

అభ్యుదయ సాహిత్యోద్యమంలో చిరంజీవి...తుమ్మల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన రచనల ద్వారా ప్రపంచ పరిణామాలను తెలుగు వారికి అందించిన గొప్ప వ్యక్తి తుమ్మల వెంకటరామయ్య అని అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బీఈడీ కళాశాల అవరణలో శనివారం తుమ్మల వెంకటరామయ్య సాహితీ పురస్కార సభ జరిగింది. సాహితి పురస్కారాన్ని కవి, గేయ రచయిత వైజాగ్‌కు చెందిన ఉప్పల అప్పలరాజులకు అందజేశారు. సభలో అరసం నాయకులు వల్లూరి శివప్రసాదు, అరసం కే.శరత్, రవికుమార్, శ్రీనివాసు పాల్గొన్నారు.

రామకృష్ణయ్య పంతులు మెమోరియల్ అవార్డు ప్రదానం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలో, త్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 142వ జయంతి ఉత్సవాల సభ జరిగింది. కార్యక్రమాన్ని న్యాయవాద దంపతులు దెందుకూరి పద్మజ, నారాయణమూర్తి ప్రారంభించారు. సభకు ముఖ్య అతిథిగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి గౌరవ అధ్యక్షుడు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, ఆత్మీయ అతిథులుగా పారిశ్రామిక వేత్త అన్నాప్రగడ రవి శ్రీనివాస్, డాక్టర్ గజల్ శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రముఖ గాయకులు మోదుమూడి సుధాకర్‌కు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు మెమోరియల్ అవార్డును అందించారు.

మానసిక ఒత్తిడి దూరం చేయడానికే క్రీడలు : డీఈవో

గుంటూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల్లో ఒత్తిడిని తొలగించి వారిలో మానసిక ఉల్లాసం కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎస్‌కే సలీమ్‌బాషా తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను డీఈవో శనివారం పరిశీలించారు. తొలుత ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు ఉపాధ్యాయులతో క్రికెట్ ఆడి ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో గుంటూరు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఖుద్దుస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఏఎస్పీ లక్ష్మీనారాయణరావు కన్నుమూత



లక్ష్మీనారాయణరావు (పాత చిత్రం)

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్రాంత అడిషనల్ ఎస్పీ వెల్లంకి లక్ష్మీనారాయణరావు (98) ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ శని వారం కన్నుమూశారు. సంఘం అధ్యక్షుడు, విశ్రాంత డీజీపీ డాక్టర్ మాల కొండయ్య, సంఘం గౌరవాధ్యక్షుడు సీఆర్ నాయుడు, ఉపాధ్యక్షుడు రవి చంద్ర, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, రంగప్రసాదరావు, ఎం.రవి, ఆర్‌కే రాజు తదితరులు నివాళు లర్పించి సంతాపం తెలిపారు. స్థంభాలగరువులోని మహాప్రస్థానంలో సోమ వారం లక్ష్మీనారాయణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కాళహస్తి సత్యనారాయణ తెలిపారు.

శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులపై వైసీపీ నేతల పరిశీలన

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణ పనులను శనివారం వైసీపీ ముఖ్య నేతలు పరిశీలించారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నేతలు వనమా బాలవజ్రబాబు, గులాం రసూల్ పలువురు నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిపై పరిశీలించారు. అంబటి మాట్లాడుతూ టీడీపీ నేతలు విజన్ లేకుండా ఒంటెత్తు పోకడలతో బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ మోదుగుల మాట్లాడుతూ దుకాణాల యజమానులకు నష్ట పరిహారం బాండ్లు కాకుండా నగదు రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.



జాబ్ మేళాలో యువతికి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేస్తున్న మంత్రి సుభాష్, సతీష్‌శర్మ, రంగరాజు తదితరులు

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి

● మంత్రి వాసంశెట్టి సుభాష్

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ అధ్యక్షతన శనివారం అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 951 మంది నిరుద్యోగ యువతకు మంత్రి చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. మంత్రి వాసంశెట్టి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం పూర్తిగా నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ సామాజిక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ప్రశంసనీయమన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గాలలోను జాబ్ మేళాలను ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఛైర్మన్ జూపూడి రంగరాజు, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహరరావు, కోశాధికారి పులిపాక ప్రసాద్, సత్యవాడ దుర్గాప్రసాద్, మండా రవి, కొప్పర్తి సీతారమేష్, రామచంద్రమూర్తి, డాక్టర్ సిరిపురపు మధుసూదన్‌రావు, ఎంపీపీ కైకలూరు అడవి కృష్ణ, ఏలేశ్వరపు జగన్మోహన్ రాజు,తెలికేపల్లి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఎన్టీఆర్... రాజనీతిజ్ఞుడు

● ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి



ప్రవచనం చేస్తున్న గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దార్మినిక రాజనీతిజ్ఞుడు ఎన్టీఆర్ అని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై గుళ్ళపల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న గరికపాటి ప్రవచ నాలు రెండో రోజున కొనసాగాయి. శనివారం భార తంలో రాజనీతి అంశంపై గరికపాటి ప్రవచిస్తూ పాలనలో యంత్రాంగం, మంత్రాంగంలో చర్చించిన నిర్ణయాలను బహిర్గతం చేసిన మంత్రి వర్గాన్నే రద్దు చేసిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో క్యాబినేట్ ప్రారంభం కాకముందే వాటి అంశాలు టీవీలలో, పేపర్లలలో వస్తున్నాయని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. రాజ్యపాలనలో ఆర్థిక శాఖ అత్యంత కీలకమైనదని విదురనీతి చెబుతుందన్నారు. ఆ శాఖ సమర్థులకే ఇవ్వాలని, ఈ విషయంలో ప్రధాని మోదీ మంచి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రావడం అత్యంత గొప్ప పరిణామన్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని దేవస్థానం మస్తానయ్య ప్రారంబించగా, గుళ్ళపల్లి సుబ్బారావు, గుళ్ళపల్లి రాఘవేంద్రరావు, డాక్టర్ నేహ, పారా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తమ కవిని నేటి తరానికి పరిచయం చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ తెలుగు కవి కాసుల పురుషోత్తమ కవి రచించిన ఆంధ్ర నాయక శతకంపై వివరణాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు కాసుల పురుషోత్తమకవి జాతీయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల కృష్ణంరాజు తెలిపారు. గుంటూరులో సుప్రసిద్ధ ప్రవచన కర్త డాక్టర్ గరికిపాటి నరసిహారావును శని వారం కలిసి ఆయన తమ కార్యక్రమం గురించి వివరించారు. అందుకు గరికపాటి సానుకూలంగా స్పందించినట్టు కృష్ణంరాజు తెలిపారు. తెలుగు భాష మాధుర్యాన్ని నేటి తరానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను తమ ఫౌండేషన్ నిర్వహిస్తున్నట్లు కృష్ణంరాజు పేర్కొన్నారు.పురుషోత్తమ కవి చిత్రపటాన్ని గరికపాటికి అందించి సత్కరించారు.

లంచం తీసుకున్న కేసులో జిల్లా పరిశ్రమల శాఖ ఉద్యోగికి జైలు శిక్ష

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ నగదు విడుదల చేసేందుకు బాధితుడి నుంచి లంచం పుచ్చుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో నిందితుడైన జిల్లా పరిశ్రమల శాఖ జూనియర్ అసిస్టెంట్ రావెల పెద వీరభద్రరావుకు విజయవాడ ఏసీబీ కోర్టు జైలు శిక్ష, జరిమాన విధించింది. నగరంలోని ఏటీ అగ్రహారంనకు చెందిన ఊరుబండి ఆచార్య లెనిన్ తన భార్య పేరు మీద ట్రిపుల్ "ఎల్" ఫ్లై యాష్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసుకునేందుకు పీఎంఈజీపీ పథకం కింద పరిశ్రమల శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోగా రుణాన్ని మంజూరు చేశారు. అయితే ఆ పథకం కింద రూ.3 లక్షల 50 వేలు సబ్సిడీ మంజూరు చేసి విడుదల చేయాల్సి ఉంది. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రావెల పెద వీరభద్రరావు బాధితుడు లెనిన్ వద్ద నుంచి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2011 జూలై 12న వీరభద్రరావు బాధితుడి వద్ద నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వీరభద్రరావును అరెస్టు చేసి విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో అతనిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు నిందితుడైన వీరభద్రరావుకు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

శ్రీనివాసరావుతోటలో రౌడీషీటర్ బెదిరింపులు

నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావుతోటలో రౌడీషీటర్ జక్కా నాగేశ్వరరావు రెచ్చిపోతు న్నాడు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం... కత్తితో వ్యాపారులను బెదిరించడం వంటి దుశ్చర్యలకు దిగుతుండటంతో స్థానికులు భయాం దోళనకు గురవుతున్నారు. దీనిపై శనివారం వ్యాపారులు, స్థానికులు నగరం పాలెం పోలీసులను ఆశ్రయించి రౌడీషీటర్ నాగేశ్వరరావు ఆగడాలపై ఫిర్యా దులు చేశారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు షాక్‌కు గురైన ఆటో డ్రైవర్ బిచ్చాల విజయబాబు (30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్లపాడు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరు పరిధిలోని సుద్దపల్లి డొంకకు చెందిన బిచ్చాల విజయబాబుకు గత నెల 22న తనకు తెలిసిన ఏటుకూరుకు చెందిన నీలకంఠ నాగరాజు ఫోన్ చేసి తన షాపులోని సామాన్లు వేరొక చోటికి తరలించాలని ఆటో బాడుగకు రమ్మని పిలిచాడు. షాపులోని బోర్డును తొలగించేందుకు ప్రయత్నించగా మెయిన్ వైర్‌కు బోర్డు తగలడంతో ఇరువురు షాక్‌కు గురయ్యారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం విజయ బాబు మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● రాష్ట్ర కార్మిక మంత్రికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి వినతి



మంత్రి వాసంశెట్టి శుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని భజరంగ్ జూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. నగరంలో శనివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆహ్వానాన్ని మన్నించి వారి నివాసానికి విచ్చేశారు. భజరంగ్ జ్యూట్ మిల్లు యాజమాన్యం 2015లో లాకౌట్ ప్రకటించిందని తెలిపారు. లాకౌట్ అనంతరం రాజీనామాలిచ్చిన ప్రతి కార్మికుడికి రూ.40 వేలు చెల్లించేందుకు యాజమాన్యంతో ఒప్పందం కుదిరిన ప్పటికీ కేవలం 200 మందికే ఆ మొత్తాన్ని చెల్లించారని, మిగిలిన సుమారు 800 మంది కార్మికులకు ఇప్పటికీ చెల్లించలేదని వివరించారు. కార్మికులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి శుభాష్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

● ఇంటికి పెద్దకొడుకులా ముఖ్యమంత్రి పేదలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. పశ్చిమ కార్యాలయంలో శనివారం ఆమె 20 మంది అనారోగ్య బాధితులకు రూ.31 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4.93 కోట్లు పేదలకు అందించామన్నారు.



10కె వాక్ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ కోయ సుబ్బారావు తదితరులు

జనవరి 25న 10 కే వాక్

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం నడక.. గుంటూరు కోసం నడక పేరుతో జనవరి 25న 10కె వాక్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ అలపాటి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 సంవత్సరాలు పాటు నిర్విరామంగా 10 కే వాక్ నిర్వహించామని, కరోనా నేపథ్యంలో 2020లో నిలిపివేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని తిరిగి నూతన సంవత్సరం 2026 జనవరి 25న పునఃప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. 10కే వాక్ విద్యానగర్ మెయిర్ రోడ్డులోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ నుంచి ప్రారంభమై కొరిటిపాడు, మదర్‌థెరిసా సెంటర్, అమరావతిరోడ్డులోని ఆలా హాస్పిటల్ మీదుగా చిల్లిస్ రెస్టారెంట్ ఆ తరువాత ఇన్నర్ రింగ్ పేజ్ 2 నుంచి ఆర్టీవో కార్యాలయం మీదుగా జేకేసీ కాలేజీ రోడ్డు నుంచి విద్యానగర్ మెయిన్‌రోడ్డులోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల వద్దకు చేరుతుందని తెలిపారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ డాక్టర్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ వాకర్ తో పాటు యువతీ, యువకులు పాఠశాల, కళాశాలల విద్యార్థులు వేలాదిగా పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో దాక్షిణ్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ టీవీ రావు, ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ముప్పా ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10కే వాక్ పోస్టర్స్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు.

క్రీస్తు సూచించిన శాంతిమార్గంతో ఉన్నత జీవనం : దేగల



క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీస్తు సూచించిన శాంతి, కరుణ, ప్రేమ మార్గాలను అనుసరించడం ద్వారా ఉన్నతంగా జీవించగలమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) ఛైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరులోని టీడీపీ నగర కార్యాలయంలో శనివారం ఆయన నేతృత్వంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దేగల ప్రభాకర్ అందరికి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా క్రీస్తు ఇచ్చిన సందేశాన్ని పాస్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ గిద్దోన్, తిమోతి, యర్రగోపు నాగేశ్వరరావు, కారంగి అనిల్, సౌపాటి రత్నం పాల్గొన్నారు.

సంకీర్త సౌరభం.... అన్నమయ్య సహస్ర గళార్చన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, బళ్ళారి రాఘవ ఓపెన్ ఆడిటోరియంలో జై కిసాన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిన్నారులతో నిర్వహించిన అన్నమయ్య గీతాల సామూహిక గళార్చన భక్తులను ఓలాలాడించింది. తొలుత కార్యక్రమాన్ని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి 3న జరిగే ప్రపంచ మూడవ తెలుగు మహాసభలలో తొలిరోజు అన్నమాచార్యుల భక్తీ సంగీత విభావరి నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, జై కిసాన్ సంస్థ సీఈవో బండ్లమూరి స్వామి, డైరెక్టర్ మైనేని రాఘవరావు, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ రామచంద్ర రాజు, టీఎన్‌టీయూసీ నర్రా జోషి, వల్లభనేని సునీల్ చౌదరి, డాక్టర్ కంఠంనేని రాజ్ కుమార్ పాల్గొని చిన్నారులను అభినందించారు.

దిండిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు



భూమిని చదును చేసేందుకు టిప్పర్లద్వారా మట్టి తరలింపు

రేపల్లె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళుతోంది. మత్స్యకారులు, ప్రజలు ఆర్థికంగా బలపడే దిశగా కృషి చేస్తోంది.ఇందుకు బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ పరిశావారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు మంజూరు చేసింది. దీంతో వేలాది మంది మత్స్యకారులకు, ప్రజలకు జీవనోపాధి కల్పించనుంది. మత్స్య సంపద అభివృద్ధి, ఎగుమతులు పెంచే దిశగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇంటిగ్రేట్ ఆక్వా పార్కు నిర్మాణానికి రూ.85 కోట్లు మంజూరు చేయించారు. దిండి పంచాయతీ పరిధిలోని 100 ఎకరాల భూమిని ఆక్వా పార్కుకు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు లావాదేవీలు సిద్ధమయ్యాయి. వారం రోజులుగా భూమిని చదును చేసే పనులను అధికారులు ప్రారంభించారు. పల్లపు ప్రాంతాలను మెరక చేస్తున్నారు.

- రూ.85 కోట్లు మంజూరు
- వంద ఎకరాల భూసేకరణ పూర్తి
- భూమి చదును పనులు ప్రారంభించిన అధికారులు
- నిర్మాణం పూర్తయితే అంతర్జాతీయంగా గుర్తింపు



నిజాంపట్నం హార్బర్‌లో లైట్‌హౌస్

అంతర్జాతీయ గుర్తింపు

ఆక్వా పార్కు నిర్మాణం పూర్తయితే.. ఈ ప్రాంతం అంతర్జాతీయంగా మత్స్య సంపద ఎగుమతులకు మార్కెట్ సౌకర్యం ఏర్పడుతుంది. ఇటీవల కేంద్రం గుంటూరు నుంచి నిజాంపట్నం వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. ఈ రహదారి పూర్తయ్యితే ఆక్వా ఎగుమతులు, దిగుమతులకు ఎంతగానో దోహదపడుతుంది. సమీపంలో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఉండటం.. ఈ ఆక్వాపార్కుకు ఎంతో మేలు జరగనుంది. తీర ప్రాంతాలు లంకేవానిదిబ్బ నుంచి నిజాంపట్నం, బాపట్ల, చీరాల, ఒంగోలు, కృష్ణాజిల్లా నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ ప్రాంతాలకు ఉపయోగపడనుంది. దిండి సముద్రతీర ప్రాంతంలో 2014లో టీడీపీ ప్రభుత్వం హయాంలో రిసార్ట్స్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారు. బీచ్‌లో చిన్నచిన్న కుటీరాలు నిర్మాణాలు చేశారు. 2019 నుంచి 2024వరకు వైసీపీ ప్రభుత్వం తీరంవైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే దిశగా మంత్రి అనగాని కృషిచేస్తున్నారు. రిసార్ట్‌ల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన : మంత్రి అనగాని



తీరప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొంటున్నారు. ఈ పార్కు నిర్మాణంతో తీరప్రాంతంలోని వేలాది మంది ప్రజలకు జీవనోపాధి, అన్ని రకాల మత్స్య సంపద అభివృద్ధి, విదేశీ మార్కెట్ అమ్మకాలతో.. జాతీయస్థాయిలో గుర్తింపు రానుందని ఆ యన తెలిపారు. త్వరలో ఈ-ఆక్వా పార్కు నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదగా శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

● నేటి నుంచి అడ్వాన్స్ రిజర్వేషన్

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి అడ్వాన్స్ రిజ ర్వేషన్ ఆదివారం ఉదయం నుం చి ప్రారంభం కానుందని చెప్పా రు. ఈ రైళ్లను టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్) స్పెషల్స్ కేటగిరి కింద నడుపుతామని, టిక్కెట్ చార్జీలు తత్కాల్‌తో సమానంగా ఉంటాయన్నారు.

- 07263 కాకినాడ టౌన్ - వికారబాద్ స్పెషల్ జనవరి 8వ తేదీన రాత్రి 7 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.10కి గుంటూరు చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 7.15కి చర్లపల్లి, 7.40కి సికింద్రాబాద్, 8.13కి బేగంపేట, 8.29కి హైటెక్ సిటీ, 8.40కి లింగంపల్లి, 11.30కి వికారబాద్ చేరుకొంటుంది. తిరిగి 07264 వికారాబాద్ - కాకినాడ టౌన్ స్పెషల్‌గా జనవరి 9న సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరుతుంది.
- 07279 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ స్పెషల్ జనవరి 10న రాత్రి 7 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.10కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 7.15కి చర్లపల్లి, 9 గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. తిరిగి 07280 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ స్పెషల్‌గా జనవరి 11న సాయంత్రం 4.35 గంటలకి బయలుదేరుతుంది.
- 07265 తిరుపతి - వికారబాద్ స్పెషల్ జనవరి 9న రాత్రి 7.40కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.20కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 7.20కి సికింద్రాబాద్, 8.15కి లింగంపల్లి, 11 గంటలకు వికారబాద్ చేరుతుంది. తిరిగి 07273 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ స్పెషల్‌గా జనవరి 12న రాత్రి 7 గంటలకు బయలుదేరుతుంది.
- 07244 వికారాబాద్ - నరసపూర్ స్పెషల్ జనవరి 9, 11 తేదీల్లో రాత్రి 9.30కి బయలుదేరి 10.10కి లింగంపల్లి, 10.20కి హైటెక్ సిటీ, 10.40కి బేగంపేట, 10.55కి సికింద్రాబాద్, 11.35కి చర్లపల్లి, మరుసటి రోజు వేకువజామున 5.10కి గుంటూరు, 10.30కి నరసపూర్ చేరుతుంది. తిరిగి 07245 నరసపూర్ - వికారబాద్ స్పెషల్‌గా జనవరి 10న రాత్రి 8 గంటలకు బయలుదేరుతుంది.
- 07246 నరసపూర్ - సికింద్రాబాద్ స్పెషల్ జనవరి 12న రాత్రి 8 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.15కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 6.28కి చర్లపల్లి, 8.30కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరిగి.. 07247 సికింద్రాబాద్ - నరసపూర్ స్పెషల్‌గా జనవరి 13న రాత్రి 7.20కి బయలుదేరుతుంది.

ఇదే విధంగా జనవరి 9న 07239 సికింద్రాబాద్ - నరసపూర్, 10, 12 తేదీల్లో 07248 నరసపూర్ - వికారబాద్, జనవరి 11న వికారబాద్ - నరసపూర్ స్పెషల్స్ గుంటూరు మీదగా ప్రయాణిస్తాయి. 07250 నరసపూర్ - వికారబాద్ స్పెషల్ జనవరి 9, 11 తేదీల్లో, 07211 వికారబాద్ - నరసపూర్ స్పెషల్ జనవరి 10, 12 తేదీల్లో గుంటూరు మీదగా ప్రయాణిస్తాయి. 07253 వికారబాద్ - నరసపూర్ జనవరి 12న, 07254 నరసపూర్ - చర్లపల్లి జనవరి 13న, 07257 నరసపూర్ - వికారబాద్ జనవరి 17న, 07258 వికారబాద్ - నరసపూర్ జనవరి 18న, 07259 నరసపూర్ - వికారబాద్ జనవరి 18న, 07260 వికారబాద్ - నరసపూర్ జనవరి 19న, 07265 నరసపూర్ - వికారబాద్ జనవరి 19న, 07266 వికారబాద్ - నరసపూర్ జనవరి 20న గుంటూరు మీదగా ప్రయాణిస్తాయని సీపీఆర్‌వో తెలిపారు.

మౌనం మహిళలకు బలహీనత కాకూడదు

● నైచేతన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని ● మహిళల కోసం వన్‌స్టాప్ కేంద్రాలు ● రాష్ట్ర హోం మంత్రి అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

తుళ్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో మౌనం బలహీనత కాకూడదని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లింగ సమానత్వ జాతీయ ప్రచార కార్యక్రమం నైచేతన 4.0ను మండల కేంద్రం తుళ్లూరులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ, లింగ వివక్ష తగ్గించటం నైచేతన 4.0 ముఖ్య ఉద్దేశమ న్నారు. సమాజంలో బాల్య వివాహాలు, గృహ హింస, లింగ వివక్ష వంటి రుగ్మతలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో 4.50 లక్షల గృహ హింస కేసులు నమోదైనట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయని పేమ్మసాని పేర్కొన్నారు. నిరాశ్రయులైన మహిళలకు సురక్షిత ఆశ్రయం కల్పించేందుకు ఐదు లక్షలతో ఆశ్రయాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆశ్రమ నిర్వహణకు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహ కల్పిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 8 లక్షల స్వయం సహాయక సంఘలుండగా 80 లక్షల మంది సభ్యులున్నారని తెలిపారు. గృహ హింసకు గురైన వారు వెంటనే ఫోటోలతో సహా అందించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, కుటుంబం బాగుండాలంటే మహిళలు అండగా ఉండాలని సూచించారు. కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుందన్నారు. జాతీయ అంతార్జాతీయ క్రీడా పోటీల్లో మహిళలు రాణిస్తున్నారని, అంతరిక్షంలోకి కూడా మహిళలు వెళుతున్నారని అన్నారు. లింగ సమానత్వం వంట గది నుంచి ప్రారంభం కావాలని, మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని ఆకాంక్షించారు. మహిళల భద్రతకు శక్తి యాప్ తీసుకొచ్చామని, వన్ స్టాప్ కేంద్రాలు ఏర్పాటు చేశామని హోంమంత్రి అనిత తెలిపారు. డీఆర్డీఏ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా స్కిల్ హబ్ భవనంలో జెండర్ ఈ సోర్స్ సెంటర్‌ను మంత్రులు ప్రారంభించారు. అనంతరం స్థానిక మేరీమాత పాఠశాలలలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన పలు ఆహార, ఆట వస్తువుల, మిల్లెట్ల ప్రదర్శనశాలలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ఫ్ ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి, జెండర్ చాంపియన్ చలివంద్రి సుగంధి, పేదరక నిర్మూల సంస్థ ముఖ్య కార్యానిర్వాహక అధికారి వాకాటి కరుణ, జాయింటు కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సెర్ప్ సంచాలకులు శివశంకర ప్రసాద్ డీఆర్‌డీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా మఖ్య కార్యనిర్వాహక అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయి కుమార్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పలువురు మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభకు తరలివచ్చిన మహిళామణులు

ఇక వేగంగా సేవలు

- అంగన్వాడీలకు 5జీ ఫోన్ల అందజేత
- పల్నాడు జిల్లాలో 2,111 మందికి పంపిణీ



అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ ఫోన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సేవల్లో వేగం పెంచేందుకు కూటమి ప్రభుత్వం వారికి 5జీ ఫోన్‌లను అందించింది. నిత్యం చిన్నారులు, గర్భిణీల వివరాలను ప్రత్యేక యాప్‌లలో నమోదు చేయడానికి సెల్‌ఫోన్‌లు ఇబ్బందికరంగా ఉన్నాయని, 4జీ సేవల వల్ల సిగ్నల్స్ అందక అవస్థలు పడుతున్నామని పలుమార్లు అంగన్వాడీలు ఫిర్యాదులు చేశారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న కూటమి ప్రభుత్వం 4జీ స్థానంలో 5జీ సేవలను అందించేందుకు ప్రత్యేకంగా వారికి రూ 12,500 విలువైన శ్యామ్‌సంగ్ ఫోన్‌లను పల్నాడు జిల్లావ్యాప్తంగా అందజేసింది. 4జీ సేవల స్థానంలో 5జీ ఫోన్‌లను ఇవ్వటం వల్ల అంగన్వాడీల యాప్‌ల యాతనకు చెక్ పడినట్లయింది. అంగన్వాడీలు ప్రతి రోజు విద్యార్థుల హాజరుతో పాటు అనేక యాప్‌లలో పలు సమాచారాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో గర్భిణీల వివరాలు, చిన్నారుల ఆరోగ్య సమస్యలు, పోషణ్ ట్రాకర్, బాల సంజీవిని తదితర సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంది. సర్వర్‌లు సరిగా పని చేయకపోవడం, నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడం, ఫోన్‌లు హ్యాంగైపోవటం వంటి సమస్యలు వెంటాడాయి. చాలా కాలం పాత ఫోన్‌లతోనే పనిచేశారు. కొత్త ఫోన్‌ల వల్ల సకాలంలో ఆన్‌లైన్‌ల ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని అంగన్వాడీలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలను పట్టించుకొని 5జీ ఫోన్‌లను అందించటం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచంలో భారతీయ గ్రాడ్యుయేట్లకు గుర్తింపు

● హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్



పాఠశాల వ్యవస్థాపకులు ముద్దన చెంచయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, పక్కన లావు రత్తయ్య

పెదనందిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన దేశ విద్యావ్యవస్థ మీద కొంత విమర్శ ఉన్నప్పటికీ.. ప్రపంచం మొత్తం మన గ్రాడ్యుయేట్లను స్వీకరిస్తుందని హైకోర్టు జడ్జి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పాలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025 రాష్ట్ర స్థాయి పోటీలను జడ్జి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడా జెండాతో పాటు జాతీయ జెండాను ఆయన ఎగుర వేశారు. క్రీడా కారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలపర్రు ప్రజలతో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. నాడు నంగినేని చౌదరి బాబు, ముద్దన చెంచయ్య లాంటి లాంటి వారు ఎంతో మంది దాన కర్ణులు పాఠశాలలు నిర్మించ బట్టే నేడు ఎంతో మంది విదేశాలలో స్థిరపడిన వారు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రధాత నంగినేని చౌదరి బాబు విగ్రహాన్ని జడ్జి రామకృష్ణ ప్రసాద్ ఆవిష్కరించారు. అలాగే పాఠశాల వ్యవస్థాపకులు ముద్దన చెంచయ్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు గ్రామానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. తొలుత జడ్జికి పూర్ణకుంభంతో గ్రామస్థులు, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఉత్సాహంగా వెటరన్ అథ్లెటిక్స్..

రెండు రోజుల రాష్ట్రస్థాయి వెటరన్ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలి వచ్చారు. తొలిరోజు లాంగ్ జంప్, షాట్ పుట్, 100, 800 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. షాట్ పుట్ 30 ప్లస్‌లో వి.సుదీప్తి(కృష్ణా), ఎ.సావిత్రి(గుంటూరు), 40 ప్లస్ విభాగంలో డి.స్వర్ణ వాహిణి, ఆర్ నిర్మల(విశాఖపట్నం), 60 ప్లస్ విభాగంలో డాక్టర్ సి.విజయకళ(నెల్లూరు), కె.పద్మావతి, 65 ప్లస్‌లో జె.లక్ష్మీ నరసమ్మ(నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో 60 ప్లస్ విభాగంలో పి.కోటేశ్వరమ్మ(నెల్లూరు), పి.రాజేశ్వరమ్మ, షాట్ పుట్ 70 ప్లస్‌లో బి.వెంకటలక్ష్మి(విశాఖపట్నం), 100 మీటర్ల పరుగు పందెం పురుషులు 70 ప్లస్ విభాగంలో ధనుంజయ(చిత్తూరు), పి.వెంకటప్పయ్య(గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమాల్లో విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, ఏపీఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ మంగా వరప్రసాద్, వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాంబాబు, జాయింట్ సెక్రటరీ చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, నంగినేని శ్రీనివాసరావు, సర్పంచ్ అన్నలదాసు సునీత, బాపట్ల సీఐ రాజుపాలెం రాంబాబు పాల్గొన్నారు.



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, పక్కన లావు రత్తయ్య

నీరుకొండ రిజర్వాయర్ పనులు వేగవంతం

● భారీ యంత్రాలతో కొనసాగుతున్న మట్టి పని ● వచ్చే ఏడాది చివరకు పనులు పూర్తి చేయడమే లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరానికి కొండవీడు, పాలవాగుల ముంపును తప్పించడంతో పాటు స్థానిక నీటి అవసరాలను తీర్చేందుకు మంజూ రు చేసిన నీరుకొండ రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. ఈ ప్రాజెక్టును నిర్మిస్తోన్న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) తొలుత 2026 మార్చి నాటికే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వచ్చే ఏడాది ఆఖరు నాటికి రిజర్వాయర్, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

● రాజధానికి తీరనున్న వరద ముంపు

ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే రాజధా నికి కొండవీడు, పాలవాగుల ముంపు సమస్య పరిష్కారమవుతుంది. ప్రస్తుతం ఎలాంటి వర్షాలు లేకపోవడం, వచ్చే ఏడాది జూన్ వరకు పనులు వేగవంతంగా చేయడానికి భారీ యంత్రాలతో మట్టి పని చేయిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో కొండవీడు, పాలవాగులు రాజధా నిలోని కొన్ని ప్రాంతాలను వరదనీటి ముంపున కు గురిచేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఐదు నుంచి వారం రోజుల పాటు వరదనీరు నిలిచి పోయి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఏడీసీ ఎల్ నీరుకొండలో సువిశాలంగా 621.4 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్ నిర్మాణానికి అన్ని అను మతులు తీసుకొని పనులు ప్రారంభించింది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే 0.4 టీఎంసీల నీటిని ఇందులోకి మళ్లించవచ్చు. పైగా ఇదొక పర్యాటక కేంద్రంగా మారుతుంది. ఇందుకోసం రూ. 470.7 కోట్లను ఏడీసీఎల్ ఖర్చు చేస్తోంది. ఎన్9 రోడ్డు పొడవునా ట్రంక్ ఇన్‌ఫ్రా అభివృద్ధికి మరో రూ. 381.82 కోట్లు ఖర్చు చేస్తున్నారు.



నీరుకొండ రిజర్వాయర్ నమూనా

● చెరువు విస్తీర్ణం 450 ఎకరాలు

నీరుకొండ రిజర్వాయర్ గ్రీన్ బఫర్ జోన్‌లో ప్యాసివ్ రీక్రియేషన్, యాక్టివ్ రీక్రియేషన్ జోన్‌లు కూడా ఉంటాయి. మొత్తం చెరువు విస్తీర్ణం 450 ఎకరాలు, బండ్ రోడ్డు ఏరియా 13.5 ఎకరాలు, పీ1 ఏరియా 72.5, పీ2 ఏరియా 85.4 ఎకరాలు ఉంది. రిజర్వాయర్ గట్టు పొడవు 9132.72 మీటర్లు కాగా బండ్ రోడ్డు వెడల్పు ఆరు మీటర్లు, రోడ్డు ఏరియా 54,796.32 చదరపు మీటర్లుగా ఉంది. ప్యాసివ్ రీక్రియేషన్ జోన్ (పీ1)లో రోడ్డు జంక్షన్లు ఎన్ 12-ఎన్ 11, ఎన్11-ఎన్ 10, ఎన్10-ఈ11, ఈ11-ఈ12, కురగల్లు గ్రామం ఉన్నాయి. యాక్టివ్ రీక్రియేషన్ జోన్ (పీ2)లో ఎన్12-ఎన్-11, ఎన్11-ఎన్10, ఈ10-ఈ11, ఈ12-ఈ12 జంక్షన్లు ఉన్నాయి. పీ1 బఫర్ ఏరియా 2,93,275.88 చదరపు మీటర్లు, పీ2 బఫర్ ఏరియా 6,39,025.13 చదరపు మీటర్లుగా ఉన్నాయి. ఇదంతా కలిపి దాదాపుగా 158 ఎకరాలు అవు తుంది. వీటన్నింటిని పచ్చదనం సోయగాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు.

కూచిపూడి నృత్య ప్రపంచంలో యామినీ రెడ్డికి ఒక ప్రత్యేక స్థానముంది. సుప్రసిద్ధ నృత్య కళాకారులు రాజారెడ్డి- రాధారెడ్డిల పుత్రికగా మాత్రమే కాకుండా.. కూచిపూడి నృత్యంలో కొత్త రీతులను తీసుకురావటానికి ఆమె చేస్తున్న ప్రయత్నాలకు ఆదరణ కూడా లభిస్తోంది. తాజాగా ఆమె రూపొందించిన 'సూర్య' అనే నృత్యరూపకాన్ని వచ్చే వారం హైదరాబాద్‌లో ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

ఆ ఆనందం నిరంతరం



"సాధారణంగా కూచిపూడి నృత్య రూపకాలు పురాణగాథలపైనే ఆధారపడి ఉంటాయి. ఇతివృత్తాలు వాటికి సంబంధించినవే అయి ఉంటాయి. 'సూర్య' కూడా అలాంటిదే! అయితే మిగిలిన వాటికన్నా భిన్నమైనది. మన చుట్టూ ఉన్న ప్రకృతి, ఈ భూమండలం, ఇతర గ్రహాలు వీటన్నింటికీ సంబంధించిన నృత్య రూపకమిది. 'ఈ సృష్టి ఎక్కడ నుంచి ఉద్భవించింది?' అనే ఆలోచన నుంచి పుట్టినదే ఈ రూపకం. నా ఉద్దేశంలో సృష్టి ముందు కూడా కాంతి ఉంది. అంటే సూర్యుడు ఉన్నాడు. ఇక సృష్టి విషయానికి వద్దాం. 'ఈ సృష్టి తానంతట తానే ఉద్భవించిందా? ఎవరైనా కారణమయ్యారా?' అనేది ఒక ప్రధానమైన ప్రశ్న. ఒక పెద్ద విస్ఫోటనం నుంచి రకరకాల గ్రహాలు ఏర్పడ్డాయనేది ఒక సిద్ధాంతం. దీనినే 'బిగ్ బ్యాంగ్' సిద్ధాంతమంటారు. ఇక మన పూర్వ గ్రంథాల్లో కూడా ఈ విస్ఫోటనానికి సంబంధించిన ప్రస్తావనలు ఉన్నాయి. ఇదంతా నృత్యరూపంలో చూపించాలనుకున్నా. ఈ ఆలోచన నుంచి పుట్టిందే 'సూర్య'. మన సంస్కృతిలో సూర్యుడికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఖగోళ శాస్త్ర ప్రకారం కూడా సూర్యుడి చుట్టూ అన్ని గ్రహాలు తిరుగుతూ ఉంటాయి. 'సూర్య' నృత్య రూపకంలో వీటన్నిటి ప్రస్తావన ఉంటుంది. ఇక ఈ సూర్యుడు ఎలా పుట్టాడనేది ఒక ప్రశ్న. సూర్యుణ్ణి బ్రహ్మ పుట్టించాడని మన పురాణాలు చెబుతాయి. సూర్యుడి నుంచి ఈ సకల బ్రహ్మాండాలలో ఉన్న జీవులు పుట్టాయని కూడా చెబుతారు. అందుకే అన్ని జీవులలో ఆత్మ ఒకటేనని అంటారు. ఆత్మ- పరమాత్మ ఒకటేనని, వేర్వేరు కాదనే సిద్ధాంతం ఇక్కడి నుంచి వచ్చినదే!

ఓరిమితో...

చాలా మంది భరతనాట్యాన్ని తమ పిల్లలకు నేర్పుదామనుకుంటారు. కొద్ది కాలం నేర్పుతారు. ఆ తర్వాత మానేస్తారు. ఇక్కడ మనం ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఏ కళనైనా అభ్యసించాలంటే ముందు ఓరిమి కావాలి. ఆ కళారీతిలో ఉన్న సారాన్ని అర్థం చేసుకోవాలి. మన దేశంలో అనేక నృత్యరీతులు ఉన్నాయి. కొన్ని వేల ఏళ్ల నుంచి ఇవి మనకు వారసత్వంగా వస్తున్నాయి. ఈ నృత్యరీతుల్లో ఏదో శక్తి లేకపోతే ఇంత కాలం ఎలా మనుగడ సాగించగలుగుతాయి? కాబట్టి నృత్యం నేర్చుకొనేవారికి ఓరిమి చాలా అవసరం. వారు ఒక నృత్యరీతిని పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే ఇతర నృత్యరీతులను నేర్చుకోవటానికి ప్రయత్నించాలి. అయితే ఇక్కడ మరో విషయం గురించి కూడా చెప్పాలి. కాలంతో పాటుగా మన అభిరుచులు మారతాయి. వాటికి తగ్గట్టుగా ఈ నృత్యరీతులు కూడా మారుతూ ఉంటాయి. అలా మారని నృత్యరీతులు కాలంలో కలిసిపోతాయి. అయితే 'నృత్యరీతులకు ఉన్న ఆత్మను మార్చేయాలా?' అని కొందరు అడుగుతూ ఉంటారు. ఆత్మను ముట్టుకోకుండానే ఆధునిక సాంకేతికతను జోడించవచ్చు. వర్తమానానికి అవసరమైన కొత్త ఆలోచనలను వాటిలో చొప్పించవచ్చు. అప్పుడే కొత్త తరాన్ని ఆకర్షించగలుగుతాం. 'సూర్య' కూడా అలాంటిదే! దీన్ని ఢిల్లీలో ప్రదర్శించినప్పుడు చాలా గొప్ప ప్రశంసలు లభించాయి.

కూచిపూడి ప్రత్యేకతలివే...

చాలామంది నన్ను భరతనాట్యానికి, కూచిపూడికి మధ్య ఉన్న తేడాలేమిటని అడుగుతూ ఉంటారు. కూచిపూడిలో కొన్ని ప్రత్యేక అభినయాలు సమ్మిళతమై ఉంటాయి. భాగవతుల సంస్కృతి ప్రభావం కూడా ఉంటుంది. కాబట్టి ఇతర నృత్య రీతులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. వెంటనే ఆకర్షిస్తుంది.



ఒక్కో వయస్సులో ఒక్కో విధంగా..

నా ఉద్దేశంలో నృత్యం వల్ల ఒక్కో వయస్సులో ఒకో విధమైన లాభం కలుగుతుంది. నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు శరీరం దృఢంగా ఉండటానికి ఉపకరించేది. ఆ తర్వాత నా ఆత్మాన్వేషణకు ఒక మార్గమయింది. ఈ ప్రపంచంతో మనకు ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకొనేందుకు ఒక సాధనమయింది.

వినోదానికి మాత్రమే కాదు...

మన భారతీయ సంస్కృతిలో భాగమైన నృత్యరీతులు కేవలం వినోదానికి మాత్రమే కాదు. వాటి ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలు ఒక తరం నుంచి మరొక తరానికి అందుతాయి. ఈ ఆధునిక యుగంలో ప్రజలు పరుగుకు అలవాటు పడిపోయారు. అన్నీ తమకు త్వరగా కావాలనుకుంటున్నారు. దీని వల్ల విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. మళ్లీ ఈ ఒత్తిడిని తగ్గించుకోవటానికి - తమ పరుగును ఆపాలనుకుంటున్నారు. అలాంటి వారికి ఈ నృత్యరీతులు ఎంతో పనికొస్తాయి. ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. యోగా వల్ల మన జీవితంలో మార్పు రావాలనుకుంటే- ముందు నేర్చుకోవాలి. దాన్ని క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. అలా చేస్తుంటే మనకు దాని ఫలాలు అందుతాయి. నృత్యరీతులు కూడా అంతే! వాటిని క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తూ ఉంటే ఫలితాలు లభిస్తాయి. ఈ ఫలితం జీవితాంతం ఉంటుంది. ఒక డిస్కోకో, నైట్ క్లబ్‌కో వెళ్తే- ఆ ఆనందం కొద్దిసేపు మాత్రమే ఉంటుంది. మర్నాడు ఆ ఆనందపు ఛాయలు కూడా ఉండవు. కానీ నృత్యరీతులు నేర్చుకున్నవారికి ఆ ఆనందం నిరంతరం ఉంటుంది."

● సీవీఎల్ఎన్ ప్రసాద్

భర్త వల్లే పునర్జన్మ




ప్రాణాంతక వ్యాధి కబళించబోతున్నప్పుడు, జీవితం చేజారిపోతుందన్న భయం మనసును తొలిచేస్తున్నప్పుడు ప్రియమైన వారి అండ మనకు కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. సరైన సమయంలో వారు తీసుకునే నిర్ణయం మనకు పునర్జన్మ ప్రసాదిస్తుంది. బాలీవుడ్ ప్రముఖ నటి సోనాలి బెంద్రే విషయంలోనూ ఇదే జరిగింది. 2018లో స్టేజ్ 4 మెటాస్టాటిక్ క్యాన్సర్‌తో పోరాడి గెలిచిన సోనాలి.. తన విజయం వెనుక ఉన్న అసలు శక్తి తన భర్త గోల్డీబెల్ అని చెప్పుకొచ్చారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె పంచుకున్న అనుభవాలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి.

పిచ్చెక్కించిన ఆలోచనలు

"నాకు అండగా నిలిచేందుకు చాలామంది ఉన్నారు. కానీ నేనే అక్కడి నుంచి పారిపోవాలని చూశాను. ఏదైతే అది అయింది.. ఇక్కడే చికిత్స తీసుకుందాం, బాబు ఇంకా చిన్నవాడు.. ఇలాంటి ఆలోచనలతో సమయం గడిపాను. కానీ నా భర్త గోల్డీ మాత్రం 'మనం వెంటనే బయలుదేరుతున్నాం' అని కరాఖండిగా చెప్పేశారు" అని సోనాలి గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో గోల్డీ 'నీ ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు' అని చెప్పిన మాటలు తనను ఆలోచింపజేశాయంటారు సోనాలి.

ప్రతి రోజు ఓ గండమే

న్యూయార్క్ వెళ్లాకగానీ తన పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం కాలేదంటారు సోనాలి. "అక్కడికి వెళ్లాక, నా పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలిశాక, ఒకటిరెండు వారాలకే నేను నా భర్తవైపు తిరిగి సరైన సమయంలో నన్ను ఇక్కడకు తీసుకొచ్చినందుకు థ్యాంక్స్ చెప్పాను. నాది చాలా తీవ్రమైన, వేగంగా విస్తరించే క్యాన్సర్. ప్రతిరోజు చాలా కీలకం. మనం ఏమాత్రం వేచి చూడలేం అని డాక్టర్లు చెప్పారు" అని గుర్తుచేసుకున్నారు. తాము ఉండటానికి ఒక అపార్ట్‌మెంట్ చూసుకునే లోపే డాక్టర్లు అత్యవసరంగా చికిత్స ప్రారంభించారని ఆ నాటి తీవ్రతను పంచుకున్నారు. "నిర్ణయం నా చేతుల్లో వదిలేసి ఉంటే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉందని తెలియక కచ్చితంగా ఆలస్యం చేసేదాన్ని. ఆ రోజు నా భర్త బలవంతంగా నన్ను తీసుకెళ్లడం నా మంచికే జరిగింది" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. 2021లో క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న సోనాలి అప్పటి నుంచి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ధైర్యంతో ఏదైనా సాధించవచ్చని తన జీవితం ద్వారా నిరూపిస్తున్నారు సోనాలి బెంద్రే.



ముత్యాల ముగ్గు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...

నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33

ఈ-మెయిల్

features@andhrajyothy.com



ఈ ఏడాది వీరిదే



తెలుగు సినిమాకు 2025 ఒక ప్రత్యేకమైన సంవత్సరం. కథ, కథనాలతోపాటు కథానాయికల అభినయానికి అద్దంపట్టిన ఏడాది ఇది. అగ్రతారలు తమ స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి పాత్రకు ప్రాధాన్యం ఇస్తే, కొత్త తారలు తొలి అడుగులతోనే తమ ప్రతిభతో ఆకాశమే హద్దు అని నిరూపించారు. ఈ ఏడాది ఉత్తమ నటన కనబరిచిన నటీమణుల జాబితా... వారి ప్రదర్శన వెనకున్న అంకితభావాన్ని మన ముందు ఉంచుతోంది.

అగ్రపీఠం వారిదే

ఈ జాబితాలో నేషనల్ క్రష్ రష్మిక మందాన అగ్రస్థానంలో నిలిచారు. 'యానిమల్' చిత్రానికి అవార్డు రాకపోయినా, ఆ లోటును ఈ ఏడాది నటనతో భర్తీ చేశారు. 'ద గర్ల్‌ఫ్రెండ్' క్లైమాక్స్‌లో ఆమె ప్రదర్శన, 'కుబేర' కోసం డంప్‌యార్డ్‌లో చెత్తలో నిలబడి నటించడం ఆమె కష్టానికి, పాత్రల పట్ల అంకితభావానికి నిదర్శనం. మరోవైపు 'తండేల్' సినిమాలో సాయిపల్లవి తన సహజ నటనతో మరోసారి మాయచేశారు. ప్రేమించిన వాడి కోసం ఎదురుచూసే ప్రియురాలిగా సంతోషం, బాధ, భయం వంటి అన్ని భావోద్వేగాలను పలికించిన తీరు అద్భుతం.

మూస ధోరణులకు చెక్

కొందరు నాయికలు ఈ ఏడాది సాహసోపేతమైన పాత్రలతో మూస ధోరణులను బద్దలుగొట్టారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నలుగురు పిల్లల తల్లి భాగ్యం పాత్రలో ఐశ్వర్య రాజేశ్ ఒదిగిపోయారు. పల్లెటూరి గృహిణిగా వెంకటేశ్ సరసన 'సారీ బా', 'లవ్ యూ బా' వంటి సంభాషణలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇక, టిల్లు స్క్వేర్‌లోని బోల్డ్ పాత్ర నుంచి పూర్తి భిన్నంగా 'పరదా'లో అమాయకమైన 'సుబ్బు' పాత్రలో అనుపమ పరమేశ్వరన్ చూపిన వైవిధ్యం ప్రశంసలు అందుకుంది.





కొత్త తారల వెలుగులు

ఈ ఏడాది తెలుగు తెరకు ఎందరో కొత్త తారలు పరిచయమై తొలి సినిమాతోనే బలమైన ముద్రవేశారు. కేవలం 17 ఏళ్ల వయసులోనే '8 వసంతాలు' సినిమాలో 'శుద్ధి అయోధ్య' లాంటి క్లిష్టమైన పాత్రను అనంతిక సనీల్‌కుమార్ పోషించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. పాత్ర కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుని ఎంతో హుందాతనంతో ఆమె నటించారు. 'కన్యాకుమారి'లో గీత్‌సైని శ్రీకాకుళం యాసలో మాట్లాడుతూ మిగతా పాత్రలను డామినేట్ చేశారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో ఉన్నా 'లిటిల్ హార్ట్స్' మూవీలో 'కాత్యాయిని' పాత్రను వదులుకోని శివాని నాగారం, తొలి చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాలో రాంబాయి వంటి హార్డ్ హిట్టింగ్ పాత్ర చేసిన తేజస్వీరావ్ వంటి వారు భవిష్యత్ తారలుగా నిలిచారు. వీరితోపాటు 'కోర్ట్' మూవీలో జాబిలిగా నటించిన శ్రీదేవి, 'అనగనగా'లో కాజల్ చౌదరి తమ పాత్రలతో ఆకట్టుకున్నారు. అలాగే, 'ఆంధ్రాకింగ్ తాలుకా' లో భాగ్యశ్రీ బోర్సే, 'ద ప్రి వెడ్డింగ్ షో'లో టీనా శ్రావ్య, 'బ్యూటీ'లో నీలఖి వంటివారు తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. మొత్తంమీద 2025 తెలుగు సినిమాకు నాయికా ప్రాధాన్యతను, వారి అభినయ పటిమను ఘనంగా చాటిచెప్పిన సంవత్సరంగా నిలిచిపోతుంది.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు


ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఎమిలీ ఇన్ ప్యారీస్ 5	వెబ్‌సిరీస్	డిసెంబర్ 18
రాత్ అఖేలీ హై	హిందీ చిత్రం	డిసెంబర్ 19
అమెజాన్ ప్రైమ్		
థామా	హిందీ చిత్రం	డిసెంబర్ 16
ఏక్ దివానే కీ దివానీయత్	హిందీ చిత్రం	డిసెంబర్ 16
ఫాలౌట్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 17
ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 19
జియో హాట్‌స్టార్		
మిసెస్ దేశ్‌పాండే	హిందీ సిరీస్	డిసెంబర్ 19
జీ 5		
నయనం	తెలుగు సిరీస్	డిసెంబర్ 19
డొమినిక్	మలయాళ చిత్రం	డిసెంబర్ 19
సన్ నెక్ట్స్		
దివ్య దృష్టి	తెలుగు చిత్రం	డిసెంబర్ 19

ప్రస్తుతం చంకీ ఆభరణాల హవా కొనసాగుతోంది. మోడరన్ దుస్తుల మీద నప్పేలా ఒకింత పాశ్చాత్య ధోరణిని రంగరించి సరికొత్త చంకీ డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు జ్యువెలరీ డిజైనర్లు. యువతులు, మహిళలు రోజువారీ ధరించే జుంకాలు, గొలుసులు, గాజులు, బ్రేస్‌లెట్లు, ఉంగరాలు... తదితరాలన్నీ చంకీ ఛాయలతో మెరిసిపోతున్నాయి. మహిళలే కాదు పురుషులు కూడా చంకీ స్టైయిల్స్‌ను అనుసరించడం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. సెలబ్రిటీల నుంచి మధ్యతరగతి వర్గం దాకా అందరినీ ఆకర్షిస్తున్న చంకీ ఆభరణాల సమాచారం మీకోసం...

చంకీ చమక్కులు..!



ఫ్యాషన్ ప్రపంచంలో.. దుస్తులతోపాటు ఆభరణాల్లో కూడా రోజుకో ట్రెండ్ పుట్టుకొస్తోంది. ఒకవైపు కంటికి సరిగా కనిపించనంత సన్నని మినిమలిస్ట్ ఆభరణాలను ఇష్టపడుతూనే మరోవైపు భారీ రింగులు, జ్యామితీ ఆకృతులు, హూప్స్‌తో కూడిన చంకీ డిజైన్లను ఆదరిస్తున్నారు యువత. ఇవి బంగారం, ప్లాటినం, వెండితో మాత్రమే కాదు వన్ గ్రామ్ గోల్డ్, గాజు, లక్క, మట్టి, ప్లాస్టిక్, మెటాలిక్, లోహపు తీగలు, ఆక్సిడైజ్డ్ ఆభరణాలుగా కూడా లభ్యమవుతున్నాయి. 80ల నాటి రెట్రో ఫ్యాషన్‌ను తలపించే మందపాటి చైన్ నెక్లెస్‌లు, లావాటి పొడవైన గొలుసులు, పెద్ద హూప్ ఇయర్ రింగ్స్, లింక్‌లతో కూడిన బ్రేస్‌లెట్లు-ఉంగరాలు, కడియాల్లాంటి గాజులు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న బంగారం ధరను దృష్టిలో ఉంచుకుని డిజైనర్లు.. 18 కె, 14 కె, 9కె బంగారంతో లోపల గుల్లగా ఉంటూ పైకి భారీగా కనిపించే డిజైన్లను రూపొందిస్తున్నారు. ట్రెండీ లుక్‌ను అమితంగా ఇష్టపడే నేటి తరం అమ్మాయిలు ఈ స్టేట్‌మెంట్ జ్యువెలరీని ఫాలో అవుతూ తమ వ్యక్తిత్వాన్ని చాటుకుంటున్నారు. అప్పుడప్పుడు ఈ చంకీ ఆభరణాలను సంప్రదాయ దుస్తులమీద కూడా ధరిస్తూ సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నారు.









డెనిమ్ జాకెట్లు, లెదర్ బాటమ్స్, తెల్లటి షర్టులు, స్లీవ్‌లెస్ దుస్తుల మీద చంకీ ఆభరణాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆమధ్య ఓ ఈవెంట్లో భూమి పెడ్నేకర్.. సన్నని లింక్ చెయిన్, మెటల్ బ్రేస్‌లెట్, చెక్క బ్యాంగిల్స్, ఉంగరంతో ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన మెట్‌గాలా వేడుకల్లో బాలీవుడ్ నటి కాజోల్.. భారీ వెండి కడియాలు, ఉంగరాలు, ముక్కుపుడక, హూప్ ఇయర్ రింగ్స్‌తో కనిపించారు. ఈ ఈవెంట్లో షారూఖ్ ఖాన్ కూడా టూర్‌మలైన్, నీలమణి, వజ్రాలు పొదిగిన 18 కె బంగారు చంకీ గొలుసులు, ఉంగరాలు, పెండెంట్లు ధరించి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. మాధురీ దీక్షిత్.. బంగారం, వెండిలతో రూపొందించిన చిక్ కాంబినేషన్ బ్రేస్‌లెట్, బంగారు క్లౌడ్ చెయిన్‌తో అందంగా ఫొటోలకు ఫోజులిచ్చారు. శ్రద్ధా కపూర్, కృతి కర్బందా తరచూ చంకీ బ్రేస్‌లెట్స్, బ్యాంగిల్స్‌తో కనిపిస్తూ ఉంటారు.

మధ్య వేలికి లేదా చూపుడు వేలికి పెద్ద ఉంగరాన్ని పెట్టుకోవడం నేటి ట్రెండ్. లావుగా వెడల్పుగా ఉండే చంకీ డాజ్లర్ అదనపు అందాన్నిస్తుంది. పదిమందిలో ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది. పూలు, లతలు, రేఖాగణిత ఆకృతులు, జ్యామితి వలయాలు, పక్షులు, జంతువుల ఆకారాలను లింక్‌లు, హూప్స్‌తో జోడించి విభిన్నమైన డిజైన్లను రూపొందిస్తున్నారు. వీటి మధ్యలో వజ్రాలు, కెంపులు, పచ్చలు, పగడాలు, నీలాలు కూర్చి గ్రాండ్‌గా తయారుచేసిన చంకీ ఉంగరాలకు అధికంగా డిమాండ్ ఉంటోంది.

సూట్స్, క్యాజువల్స్, ఫార్మల్స్ మీద చంకీ చెయిన్స్ చక్కని యాక్సెసరీస్‌గా నప్పుతాయి. మల్టీ లేయర్ చెయిన్, కేబుల్ చెయిన్, క్యూబన్ చెయిన్, కర్బ్ చెయిన్, పేపర్ క్లిప్ చెయిన్, హెరింగ్ బోన్ చెయిన్‌లను నేటి యువత ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. వీటికి తమాషా పెండెంట్లను జోడించి మరింత ఆకర్షణీయంగా సందడి చేస్తున్నారు. ఈ చంకీ చెయిన్స్ వారి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ ఆధునికతకు, లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్‌కు ప్రతీకగా నిలుస్తున్నాయి.

మెస్సీ.. మాస్ జాతర

- సాకర్ దిగ్గజం నామస్మరణతో మార్మోగిన ఉప్పల్ స్టేడియం
- స్టేడియంలో లియోనెల్, రేవంత్ పరేడ్
- 53 నిమిషాలు స్టేడియంలో ఉన్న అర్జెంటీనా స్టార్







కలలో కూడా సాధ్యం కాదేమో అనుకున్నది సుసాధ్యమైతే..! జీవిత కాలంలో చూడగలుగుతామా? అనుకున్న వ్యక్తి కళ్ల ముందే సాక్షాత్కరిస్తే..! ఉప్పల్ స్టేడియంలో శనివారం రాత్రి వేలాదిమంది అభిమానులకు ఇలాంటి అనుభవమే స్వానుభవంలోకి వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాలర్, అర్జెంటీనా సూపర్‌స్టార్ లియోనెల్ మెస్సీ హైదరాబాద్‌లో అడుగుపెట్టి అభిమానులను మురిపించాడు. తమ ఆరాధ్య ఆటగాడిని తనివి తీరా చూసుకోవడమే కాకుండా.. అతడి ఫుట్‌బాల్ విన్యాసాలను కూడా కాసేపు కనులారా వీక్షించగలిగారు. మైదానమంతా కలియదిరగడంతో పాటు, స్టాండ్స్‌లోకి బంతిని కిక్ చేసి మరింత జోష్ నింపాడు. మొత్తంగా గ్రౌండంతా మెస్సీ నామస్మరణతో ఊగిపోయింది. లేజర్ షో ధగధగలు.. బాణసంచా వెలుగు జిలుగులు.. అచ్చ తెలుగు పాటలు స్టేడియంలోని అభిమానులను ఉర్రూతలూగించాయి. అయితే కోల్‌కతా రచ్చతో ఇక్కడి ఈవెంట్ సందేహంలో పడినా.. నిర్వహణలో తీసుకున్న పకడ్బందీ చర్యలతో మెస్సీ ఈవెంట్ సూపర్ సక్సెస్ అయ్యిందనుకోవచ్చు.

ఆర్‌ఆర్9 టీమ్‌కు గోట్ కప్

ఫ్రెండ్లీ మ్యాచ్ ముగిశాక మెస్సీ బృందం, రేవంత్ కలిసి ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ స్టేడియం చుట్టూ కలియదిరిగారు. అలాగే నాలుగు చోట్ల ఆగి పిల్లలతో కలిసి వీరంతా కాసేపు డ్రిల్స్ చేసి వారిని ఆనందంలో ముంచారు. ఆ తర్వాత స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద విజేత సింగరేణి ఆర్‌ఆర్9కు మెస్సీ గోట్ కప్‌ను అందించాడు. అలాగే రన్నరప్ అపర్ణ మెస్సీ జట్టుకు రేవంత్ ట్రోఫీని అందించారు.

ఒకే ఫ్రేమ్‌లో మెస్సీ, రాహుల్, రేవంత్

మెస్సీ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ స్టేడియం లోపల ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ బ్యానర్ అభిమానులను విపరీతంగా ఆకర్షించింది. ఆ ఫొటోలో సాకర్ స్టార్ మెస్సీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కపక్కనే ఉన్నారు. 'ఒకే ఫ్రేమ్‌లో మెస్సీ, రాహుల్, రేవంత్' అంటూ ఆ ఫొటోను నెటిజన్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేస్తున్నారు.

నేడు ముంబైలో మెస్సీ షెడ్యూల్

మధ్యాహ్నం: 3.30కు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో క్రికెట్ స్టార్లతో గోట్ కప్ మ్యాచ్.
సాయంత్రం: 4.00కు సెలెబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొంటాడు.
సాయంత్రం: 5.00కు వాంఖడే స్టేడియంలో చారిటీ ఫ్యాషన్ షోకు హాజరు.

మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా వరల్డ్ చాంపియన్, అర్జెంటీనా సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. 'గోట్ ఇండియా టూర్‌'లో భాగంగా మెస్సీతో పాటు అతడి ఇంటర్ మయామీ క్లబ్ సహచరులు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డిపాల్ కూడా ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. ఉదయం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన రసాభాస కారణంగా ఉప్పల్ మైదానంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టూర్‌లో భాగంగా సింగరేణి రేవంత్ రెడ్డి 9-అపర్ణ మెస్సీ టీమ్ మధ్య జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తెలంగాణ సీఎం రేవంత్ పాలు పంచుకోగా.. చివర్లో మెస్సీ ఎంట్రీ ఇవ్వడం అభిమానులను ఉర్రూతలూగించింది. అంతకంటే ముందు మెస్సీ హైదరాబాద్ టూర్‌ను అద్భుత ప్రణాళికతో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతం చేయగలిగింది.

నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు..

కోల్‌కతా నుంచి సాయంత్రం 5.40 గంటలకు మెస్సీ తన బృందంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాడు. ఆ వెంటనే స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన గ్రీన్ చానెల్ ద్వారా, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్ హోటల్‌కు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటలకు అక్కడికి చేరిన మెస్సీకి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు.

గోల్ చేసిన రేవంత్: మెస్సీ స్టేడియంలో అడుగుపెట్టక ముందే రాత్రి 7.47 గంటలకు సింగరేణి రేవంత్ రెడ్డి9-అపర్ణ మెస్సీ టీమ్‌ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ ఆరంభమైంది. సౌత్ స్టాండ్‌కు దగ్గరలో ఈ మ్యాచ్ కోసం గోల్ పోస్టులను ఏర్పాటు చేశారు. కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్, ఎంపీ రాహుల్ గాంధీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టారు. ఎరుపు టీషర్ట్, తెలుపు నిక్కర్‌తో పూర్తిస్థాయి ఫుట్‌బాల్ జెర్సీ ధరించిన సీఎం రేవంత్ తన జట్టుతో పాటు చేరారు. అప్పటికే ఆర్‌ఆర్ టీమ్ మూడు గోల్స్ చేయగా.. బరిలోకి దిగిన కొద్దిసేపటికే కీపర్‌ను ఏమార్చుతూ గోల్ పోస్టు సమీపంలో తనకు లభించిన పాస్‌ను సీఎం గోల్‌గా మలిచారు.

మెస్సీ..మెస్సీ: ఫ్రెండ్లీ మ్యాచ్ జరుగుతుండగా రాత్రి 7.56 గంటలకు మెస్సీ ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నాడు. నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లి మ్యాచ్‌ను గమనించాడు. తనను బిగ్ స్క్రీన్‌లో చూసిన ప్రేక్షకులు మెస్సీ.. మెస్సీ అంటూ గట్టిగా అరుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. పావుగంటయ్యాక తను గ్రౌండ్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో స్టేడియం హోరెత్తిపోయింది. అక్కడే వరుసగా నిల్చొని ఇరుజట్ల ఆటగాళ్లకు కరచాలనం ఇచ్చాడు. అదే వరుసలో సీఎం రేవంత్ కూడా నిల్చొని మెస్సీకి షేక్‌హ్యాండ్ ఇవ్వడం విశేషం.

సీఎం, మెస్సీ బంతాట: ప్రేక్షకులకు అభివాదం చేస్తూ మెస్సీ, రేవంత్ బంతితో డ్రిల్స్ చేయడం ఫ్యాన్స్‌లో మరింత జోష్‌ను నింపింది. వీరికి సువారెజ్, డిపాల్ కూడా కలవడంతో నలుగురి మధ్య డ్రిల్స్ అదుర్స్ అనిపించింది. అంతేకాకుండా మెస్సీ తన ఎదురుగా ఉన్న గోల్‌పోస్టులోకి బంతిని పంపి మరింత ఆనందాన్ని నింపాడు. దీంతో కాసేపు రేవంత్ గోల్ కీపర్‌గా మారి అక్కడి నుంచి బంతిని మెస్సీ వైపు పాస్ చేశాడు. ఈ సమయంలో మెస్సీ మరోసారి గోల్ చేశాడు. ఆ తర్వాత రెండు జట్లు కలిసి మెస్సీతో ఫొటో దిగాయి. అలాగే మెస్సీ అతడి సహచరులు ఫుట్‌బాల్స్‌ను కిక్స్ ద్వారా స్టాండ్స్‌లోకి పంపడంతో వాటిని అందుకునేందుకు ఫ్యాన్స్ పోటీపడ్డారు.

ఫుట్‌బాల్ క్లినిక్: అనంతరం స్టేడియంలోని మూడు చోట్ల (సౌత్ వెస్ట్ స్టాండ్, నార్త్ స్టాండ్, ఈస్ట్ స్టాండ్) ఫుట్‌బాల్ క్లినిక్‌లు నిర్వహించారు. రేవంత్ రెడ్డి మనమడితో సహా మొత్తం 18 మంది పిల్లలు ఈ సాకర్ క్లినిక్‌లో పాల్గొన్నారు. ఇందులో పాస్‌లు చేయడం, బంతిని నియంత్రించడంపై మెస్సీ, రోడ్రిగో, సువారెజ్ పిల్లలకు చేసి చూపించారు. ఈ క్లినిక్‌లో రేవంత్ రెండుసార్లు హెడర్‌తో బంతిని కొట్టారు.

నేలపై లేజర్ షో: మైదానంలో మెస్సీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫుట్‌బాల్ గ్రౌండ్ నేలపై జెర్సీ నెంబర్ 10, మెస్సీ ఫొటోతో మొదలైన లేజర్ షో, ఆతర్వాత రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఫొటోలతో చేసిన ప్రదర్శన అభిమానులను మంత్రముగ్ధులను చేసింది.

బాణసంచా వెలుగులు: బాణసంచా వెలుగుల్లో ఉప్పల్ స్టేడియం మెరిసిపోయింది. సాయంత్రం ఆరు గంటల నుంచి కార్యక్రమం ముగిసేవరకు బాణాసంచా కాంతులతో స్టేడియం మిరుగొట్లు గొల్పింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలో విద్యుత్ దీపాలను మొత్తం ఆర్పేసి, గ్యాలరీలోని ఫ్యాన్స్‌తో సెల్‌ఫోన్ టార్చ్‌లు వేయించి చేసిన అభివాదం అందరిలోనూ ఉత్సాహం నింపింది.

(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

స్పెషల్ ఆటోగ్రాఫ్..

ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడిన జట్లకు మెస్సీ ట్రోఫీలను ప్రదానం చేశాడు. ఆ తర్వాత మెస్సీకి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రత్యేక జ్ఞాపికలను అందించారు. అనంతరం మెస్సీ ఒక జెర్సీ, సాకర్ బంతిపై రేవంత్‌కు ప్రత్యేకంగా సంతకం చేసి ఇచ్చారు.



సాల్ట్‌లేక్‌లో రసాభాస

మెస్సీ కాసేపే కనిపించడంతో అభిమానుల గుస్సా

- మైదానంలోకి వాటర్ బాటిళ్లు విసిరి ఆగ్రహం
- స్టేడియంలో విధ్వంసం, లాఠీచార్జ్
- ఘటనపై సీఎం మమత విస్మయం
- ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం

అర్జెంటీనా దిగ్గజం కోల్‌కతాలో అడుగిడినప్పటి నుంచి ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోయారు. అభిమాన ఆటగాడిని జీవితంలో ఒక్కసారైనా చూడాలనుకొని.. భారీగా స్టేడియానికి చేరుకొన్న వారికి నిరాశే ఎదురైంది. తన 70 అడుగుల విగ్రహాన్ని లియోనెల్ మెస్సీ వర్చువల్‌గా ఆవిష్కరించగా.. షారుక్ కూడా అక్కడే కలిశాడు. కానీ, సాల్ట్‌లేక్ స్టేడియంలో 10 నిమిషాలు మాత్రమే ఉండడం వివాదాస్పదమైంది. ఎన్నో ఆశలతో వచ్చిన తమకు లియోనెల్ కనపడకపోవడంతో.. ఫ్యాన్స్‌లో ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకొంది.. రచ్చకు కారణమైంది.

కోల్‌కతా: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ కోల్‌కతా పర్యటన రసాభాసగా ముగిసింది. తమ అభిమాన ఆటగాడు మెస్సీ కనిపించకపోవడంతో సాల్ట్ లేక్ స్టేడియానికి తరలివచ్చిన అభిమానుల ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. దీంతో సాల్ట్‌లేక్ స్టేడియంలో బీభత్సం సృష్టించిన మెస్సీ అభిమానులు ఈవెంట్ నిర్వాహకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా శనివారం తెల్లవారుజామున కోల్‌కతా చేరుకున్న మెస్సీ.. మధ్యాహ్నం 12 నుంచి 12:30 మధ్య ఓ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ ఈవెంట్‌కు రూ.4500 నుంచి రూ.10,000ల లోపు ధరలతో సాధారణ అభిమానులకు టిక్కెట్లు విక్రయించారు. ధర అధికమే అయినా మెస్సీ ఆటను కళ్లారా చూసేందుకు టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులు సాల్ట్‌లేక్ స్టేడియానికి పోటెత్తారు. దాదాపు 50వేల మంది అభిమానులు స్టేడియానికి వచ్చారని అంచనా. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మెస్సీ శనివారం ఉదయం 11:30 గంటల కల్లా సాల్ట్ లేక్ స్టేడియానికి చేరుకున్నాడు.

మెస్సీ..మెస్సీ నినాదాలతో ఓ పక్క స్టేడియం హోరెత్తిపోతుండగా.. మెస్సీ వాహనం మైదానంలోని టచ్ లైన్‌కు చేరుకుంది. అయితే, మెస్సీ వాహనంలో నుంచి బయటకు దిగిన వెంటనే భద్రతా సిబ్బంది, రాజకీయ నాయకులు, వీఐపీలు ఇతర వ్యక్తులు ఆయన్ను చుట్టుముట్టేశారు. తోటి ఆటగాళ్లు సువారెజ్, రోడ్రిగోతో కలిసి గ్యాలరీల్లోని అభిమానులకు అభివాదం చేస్తూ మెస్సీ ముందుకు కదిలారు. కానీ, చుట్టూ చేరిన జనం వల్ల అభిమానులకు మెస్సీ ఏ మాత్రం కనిపించలేదు. స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లు కూడా సరిగా పని చేయలేదు. ఆగ్రహించిన అభిమానులు నిర్వాహకుల తీరును నిరసిస్తూ మైదానంలోకి మంచినీళ్ల సీసాలు విసిరారు. దీంతో స్టేడియంలో నడుస్తున్న మెస్సీ వెంటనే అక్కడి నుంచి వెనుదిరిగారు. ఇదంతా 10 నిమిషాల్లోనే జరిగిపోయింది. దీంతో షెడ్యూల్ ప్రకారం సాల్ట్‌లేక్ స్టేడియంలో జరగాల్సిన కార్యక్రమాలు హఠాత్తుగా ఆగిపోయాయి. ఆపై, మెస్సీ వెళ్లిపోయారనే విషయం తెలుసుకున్న అభిమానులు మరింత రెచ్చిపోయారు. గ్యాలరీల్లోని కుర్చీలు విరగొట్టారు. ప్రకటన బోర్డులను, ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్‌లను ధ్వంసం చేశారు. అంతటితో శాంతించని వందలాది అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లి మరింత హంగామా సృష్టించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసులు, అదనపు బలగాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ క్రమంలో పలువురిపై లాఠీచార్జీ కూడా చేశారు. కాగా, సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ విస్మయం వ్యక్తం చేశారు. మెస్సీకి, క్రీడాభిమానులకు క్షమాపణలు చెప్పారు. ఈవెంట్ నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మమత.. జరిగిన ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మరోపక్క, మెస్సీ ఈవెంట్ ప్రధాన నిర్వాహకుడు శతద్రు దత్తాను పోలీసులు ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. అభిమానులకు టికెట్ డబ్బును వెనక్కి ఇస్తామని దత్తా లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని పశ్చిమ బెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్ విలేకరులతో అన్నారు.

ఈవెంట్ నిర్వాహకుడి అరెస్టు!



మెస్సీని ప్రత్యక్షంగా చూడాలన్న కోట్లాది మంది భారత ఫుట్‌బాల్ అభిమానుల కలను సాకారం చేశాడు ఈవెంట్ ప్రమోటర్ శతద్రు దత్తా. కానీ కట్టుదిట్టమైన ప్రణాళిక లేకపోవడంతో సాల్ట్‌లేక్ స్టేడియంలో లియోనెల్ కార్యక్రమం రసాభాసా అయ్యింది. ఫలితం..మూడు రోజులు మెస్సీ వెంట ఉండాల్సిన దత్తా అరెస్టయ్యాడు. శతద్రుపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు అదనపు డైరెక్టర్ జనరల్ (లా అండ్ ఆర్డర్) జావెద్ షమీమ్ వెల్లడించారు.

లియోనెల్ పరేషాన్



మెస్సీ 2011లో కోల్‌కతా పర్యటన ఎంత అద్భుతంగా సాగిందో..ఈసారి టూర్ అందుకు పూర్తి విరుద్ధంగా ముగియడం గమనార్హం. ఫుట్‌బాల్‌ను ఎంతో అభిమానించే బెంగాలీలు మెస్సీని ప్రత్యక్షంగా తిలకించేందుకు సాల్ట్‌లేక్ స్టేడియానికి పోటెత్తారు. ఎంతో ఉత్సాహంగా తరలివచ్చిన అభిమానులకు అక్కడ పరిస్థితి చూశాక ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. రాజకీయ నాయకులు, వీఐపీలు, ఆటగాళ్లు, మాజీ ప్లేయర్లు మెస్సీని చుట్టుముట్టారు. ఆటోగ్రాఫ్‌లకు, సెల్ఫీలకు పోటీపడడంతో స్టాండ్స్‌లోని ఫ్యాన్స్‌కు సాకర్ స్టార్ ఏమాత్రం కనిపించలేదు. మరోవైపు అందరికీ ఆటోగ్రాఫ్ లిస్తూ, సెల్ఫీలకు సహకరిస్తూనే మెస్సీ మైదానంలో నెమ్మదిగా తిరిగాడు. కానీ నేతలు, వీఐపీల తాకిడి తగ్గకపోవడం మెస్సీ సైతం గందరగోళానికి లోనయ్యాడు. దాంతో మెస్సీ చుట్టూ ఉన్నవారు పక్కకు వచ్చి, గ్రౌండ్‌ను ఖాళీ చేయాలని ప్రమోటర్ శతద్రు దత్తా పదే పదే మైక్‌లో విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. దాంతో అభిమానులకు కోపం నషాళానికి అంటింది.

చలిని సైతం లెక్కచేయక..

సమయం తెల్లవారుజామున 2.26 గంటలు..వణికిస్తున్న చలి..రగ్గు కప్పుకొని ఇంట్లో వెచ్చగా నిద్రించాల్సిన సమయం..కానీ కోల్‌కతా సాకర్ ఫ్యాన్స్ చలిని లెక్క చేయలేదు. తమ ఆరాధ్య ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీని క్షణమైనా సరే ప్రత్యక్షంగా చూడాలన్న లక్ష్యంతో విమానాశ్రయానికి భారీగా తరలొచ్చారు. అర్జెంటీనా రంగులు కలిగిన జెండాలతో, మెస్సీ..మెస్సీ..అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎయిర్‌పోర్టు బయటకు వచ్చిన అర్జెంటీనా స్టార్ నవ్వుతూ చేయి ఊపడంతో వారంతా సంతోషంతో కేరింతలు కొట్టారు. దిగ్గజ సాకర్ ఆటగాడిని చూశామనే సంతృప్తితో వెనుదిరిగారు.

70 అడుగుల విగ్రహం





మెస్సీ.. మెస్సీ.. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే నామస్మరణ. ది గోట్ టూర్‌లో భాగంగా భారత్‌లో అడుగుపెట్టిన అర్జెంటీనా సూపర్ స్టార్‌కు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మెస్సీతో పాటు అతని ఇంటర్ మియామీ జట్టు సభ్యులైన లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ కూడా విచ్చేశారు. అతని రాకతో కోల్‌కతా నగరం సాకర్ సిటీని తలపించింది. ఎక్కడ చూసినా మెస్సీ కటౌట్‌లే దర్శనమిచ్చాయి. ఈ పర్యటనలో భాగంగా మెస్సీ.. కోల్‌కతా లేక్‌టౌన్‌లోని శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 70 అడుగుల తన విగ్రహాన్ని వర్చువల్‌గా ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో మెస్సీతో పాటు బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ పాల్గొన్నాడు. ఇంత భారీస్థాయిలో మెస్సీ విగ్రహం ప్రపంచంలోనే మరెక్కడా లేకపోవడం విశేషం.

ఈ ఫ్లైట్ యమ కాస్ట్లీ..!



మెస్సీలాంటి దిగ్గజ ఆటగాడు వ్యక్తిగత పర్యటనల్లో సాధారణ విమానాల్లో ప్రయాణించడు. భద్రతా కారణాల రీత్యా ప్రత్యేక విమానాల్లోనే అతడి పర్యటనలుంటాయి. అదే క్రమంలో భారత్ టూర్‌కు కూడా మెస్సీ ప్రత్యేక విమానంలో విచ్చేశాడు. అత్యంత అధునాతన సదుపాయాలున్న ఆ ఫ్లైట్ వివరాలు ఎంతో ఆసక్తికరం. 'గల్ఫ్‌స్ట్రీమ్ వి' (జీవీ) అనే బిజినెస్ జెట్‌లో లియోనెల్ పర్యటన సాగుతోంది. అమెరికాకు చెందిన గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ ఈ బిజినెస్ జెట్‌ల తయారీలో ప్రసిద్ధి చెందింది. 96.42 అడుగుల పొడవు, 25.83 అడుగుల ఎత్తు ఉండే ఈ జెట్ గంటకు 940 కి.మీ. వేగంతో దూసుకుపోతూ ఏకధాటిగా 12 వేల కి.మీ. ప్రయాణించగలదు. అంటే..న్యూయార్క్ నుంచి టోక్యో, లండన్ నుంచి సింగపూర్‌కు అలవోకగా చేరుకోవచ్చు. 51 వేల అడుగుల ఎత్తులో ఇది ప్రయాణిస్తుంది. సాధారణ విమానాలు 31 వేల అడుగుల ఎత్తులోనే వెళతాయి. అందువల్ల జీవీ జెట్‌లకు సాధారణ ఎయిర్ ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు. 14 నుంచి 16 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ విమానం ఖరీదు రూ. 362 కోట్ల పైమాటే. ఏడాది నిర్వహణ ఖర్చు రూ. 36 కోట్లు అవుతుందట. ఇక..ఈ విమానం గంట అద్దె దాదాపు రూ.10 లక్షలు ఉంటుంది.

మాకేమీ సంబంధంలేదు: ఏఐఎఫ్‌ఎఫ్

సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన సంఘటనపై అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ఆందోళన వ్యక్తం జేసింది. అయితే ఆ ఉదంతంతో సమాఖ్యకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపింది. 'ఓ పౌర సంబంధాల సంస్థ ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఈవెంట్ అది. ఆ కార్యక్రమంలో సమాఖ్యకు ఎలాంటి పాత్ర లేదు. అసలు మెస్సీ పర్యటనకు సంబంధించి మాకు సమాచారమే ఇవ్వలేదు. మా అనుమతి కూడా అడగలేదు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న అందరు వ్యక్తుల భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వాలి' అని ఏఐఎఫ్‌ఎఫ్ ఓ ప్రకటనలో పేర్కొంది.

బిజినెస్ ప్లస్

గుంటూరు ● ఆదివారం 14 డిసెంబరు 2025

మంచి క్రెడిట్ స్కోర్ ఉన్నా గృహ రుణం రావటం లేదా?



ప్రస్తుతమున్న పరిస్థితుల్లో సొంత డబ్బులతో సొంతిల్లు సమకూర్చుకోవడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. బంధుమిత్రుల నుంచో, బ్యాంకుల నుంచో ఎంతో కొంత అప్పు చేయక తప్పదు. అలా చేయాలంటే మంచి క్రెడిట్ స్కోర్ ఉండాలి. స్కోర్ మంచిగా ఉన్నా ఒక్కోసారి బ్యాంకులు సారీ చెబుతుంటాయి. ఇందుకు కారణాలు ఏమిటి? ఈ సమస్యను అధిగమించడం ఎలా? అయితే ఈ స్టోరీ చదవండి.

ఇల్లు కట్టి చూడు. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. ప్రతి వ్యక్తి జీవితంలో ఈ రెండూ అత్యంత ముఖ్యమైన విషయాలు. ఉద్యోగం, ఆస్తులు, కుటుంబ నేపథ్యాలు చూసి మరీ మనం జీవిత భాగస్వామిని ఎంచుకుంటారు. అలాగే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మంజూరు చేసేటప్పుడు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ), గృహ ఫైనాన్స్ సంస్థలు (హెచ్‌ఎఫ్‌సీ) కూడా ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోర్ చూస్తాయి. ఈ స్కోర్ 700 పాయింట్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే తక్కువ వడ్డీకే గృహ రుణాలు ఇస్తాయి. అలా అని 700 పాయింట్లు లేదా అంతకంటే ఎక్కువ పరపతి స్కోర్ ఉన్న అందరికీ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీలు కచ్చితంగా గృహ రుణాలు ఇస్తాయని చెప్పలేం. కొన్ని కారణాలతో రుణ దరఖాస్తును తిరస్కరించవచ్చు. గృహ రుణాలు ఇచ్చేటప్పుడు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కీలకమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. అవేమిటంటే..

700+ క్రెడిట్ స్కోర్

సిబిల్ నివేదిక ప్రకారం మన దేశంలో క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తున్న వారి సగటు పరపతి స్కోర్ 715 నుంచి 730 పాయింట్ల మధ్య ఉంది. ఈ నివేదిక ప్రకారమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాల మంజూరుకు 700 పాయింట్ల క్రెడిట్ స్కోర్‌ను కనీస ప్రామాణిక స్కోర్‌గా తీసుకుంటున్నాయి.

ఆదాయ స్థిరత్వం

గృహ రుణాలు ఇచ్చేటప్పుడు బ్యాంకులు ఆయా వ్యక్తుల ఆదాయ స్థిరత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాయి. గత ఏడాది వారి కనీసం ఆదాయం ఎంత? అది కూడా మధ్య మధ్యలో బ్రేక్ లేకుండా నెలనెలా స్థిరంగా వచ్చిందా? ఈ ఆదాయం భవిష్యత్‌లో ఎంత మేరకు పెరిగే అవకాశం ఉంది? ఈ ఆదాయంతో గృహ రుణం కింద తీసుకున్న రుణాన్ని దీర్ఘకాలంలో క్రమం తప్పకుండా సక్రమంగా చెల్లించగలరా? లేదా? అని చూస్తాయి. ఈ విషయాల్లో ఏ మాత్రం అనుమానం వచ్చినా, మంచి క్రెడిట్ స్కోరు ఉన్నా, సారీ బాస్ అని దాటవేస్తాయి.

ప్రస్తుత ఈఎంఐలు

నెలనెలా చేతికి వచ్చే ఆదాయంలో ఇప్పటికే ఉన్న బాకీల కోసం చెల్లించే నెలవారీ వాయిదాల (ఈఎంఐ) మొత్తం 40 నుంచి 50 శాతం మించకూడదు. అంతకు మించి ఉంటే క్రెడిట్ స్కోర్ 700 పాయింట్లకు మించి ఉన్నా గృహ రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరిస్తాయి.

రుణ పరిమితి

గృహ రుణాలు ఇచ్చేటప్పుడు బ్యాంకులు ఆయా వ్యక్తుల పరపతి స్కోర్, ఆదాయ స్థిరత్వం, ప్రస్తుత ఈఎంఐ చెల్లింపుల భారంతో పాటు కొనుగోలు చేసే ఆస్తి విలువను పరిగణనలోకి తీసుకుంటాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు చేసే ఇంటి విలువలో 80 శాతానికి మించకుండా గృహ రుణం ఇస్తాయి. ఇది కూడా ఆయా వ్యక్తుల వయసు, ఆదాయాన్ని బట్టి మారుతుంది.

ఉద్యోగాల మార్పు

తరచూ ఉద్యోగాలు మార్చే వ్యక్తులు, ప్రొబేషన్ మీద ఉన్న వ్యక్తులకు గృహ రుణాలు ఇచ్చేందుకు కూడా బ్యాంకులు పెద్దగా ఇష్టపడవు. అలాగే ఉద్యోగ, ఆదాయ స్థిరత్వం పెద్దగా లేని రంగాలు, కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల విషయంలోనూ ఆచితూచి వ్యవహరిస్తాయి. నిజ జీవితంలో ఎక్కువ ఆదాయం ఉన్నా, ఐటీ రిటర్నుల్లో పన్ను ఎగవేత కోసం తక్కువ ఆదాయం చూపే వారి విషయంలోనూ మంచి క్రెడిట్ స్కోర్ ఉన్నా.. మీకు లోన్ ఇవ్వడం మాకు సాధ్యం కాదని బ్యాంకులు చెప్పేస్తాయి.

ఆస్తి విషయాలు

కొనుగోలు చేసే ఇంటి యాజమాన్యానికి సంబంధించిన డాక్యుమెంట్లు, అనుమతులు పక్కాగా ఉండాలి. వీటికి తోడు కొనే ఇంటి వాల్యుయేషన్ కూడా మార్కెట్ ధరకు అనుగుణంగా ఉండాలి. రుణం ఇచ్చే ముందే బ్యాంకులు ఈ విషయాలు అన్నిటినీ సొంతంగా చెక్ చేసుకుంటాయి. అన్నీ అనుకూలంగా ఉంటేనే గృహ రుణం మంజూరు చేస్తాయి. ఆ విషయాల్లో ఏ మాత్రం తేడా ఉన్నా, మీ అప్లికేషన్‌ను పక్కన పెట్టేస్తాయి. అలాగే బ్యాంకులు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన బిల్డర్ల ఆస్తులకూ గృహ రుణాలు లభించవు.

అధిగమించడం ఎలా?

క్రెడిట్ స్కోర్ 700 నుంచి 750 పాయింట్ల మధ్య ఉన్నా, కొందరి గృహ రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయి. అలాంటప్పుడు ఈ కింది చర్యల ద్వారా ఆయా వ్యక్తులు తమ అర్హత పెంచుకోవచ్చు.

- ఇప్పటికే ఉన్న అన్ని రుణాల ఈఎంఐలను సకాలంలో సక్రమంగా చెల్లించడం ద్వారా
- ఆర్థిక స్థోమతకు మించిన రుణాలు, కార్డు చెల్లింపుల జోలికి పోకపోవడం
- క్రెడిట్ రిపోర్టులను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవడం
- సెక్యూర్డ్-అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య సమతౌల్యం పాటించడం
- క్రమం తప్పని ఆర్థిక క్రమశిక్షణ

సహ దరఖాస్తుదారుని క్రెడిట్ స్కోర్

ఇద్దరు కలిసి గృహ రుణానికి దరఖాస్తు చేస్తుంటే.. ఇద్దరి క్రెడిట్ స్కోర్ బాగుండాలి. ఏ ఒక్కరి క్రెడిట్ స్కోర్ బాగోకపోయినా బ్యాంకులు ఆ రుణ దరఖాస్తును తిరస్కరిస్తాయి. అలాగే దరఖాస్తుదారులందరూ గత రుణాలను సక్రమంగా చెల్లించి ఉండాలి. దీంట్లో ఏమైనా తేడా ఉన్నా బ్యాంకులు ఆ రుణ దరఖాస్తుని తిరస్కరిస్తాయి.

డిజిటల్ వ్యక్తిగత రుణాల్లో ఎన్‌బీఎఫ్‌సీల హవా

వ్యక్తిగత రుణ మార్కెట్లో డిజిటల్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ).. బ్యాంకులకు సవాల్ విసురుతున్నాయి. దరఖాస్తు చేసిన నిమిషాల్లోనే రుణాలు మంజూరు చేస్తూ తడాఖా చూపిస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశంలో డిజిటల్ ఎన్‌బీఎఫ్‌సీలు మంజూరు చేసిన వ్యక్తిగత రుణాలు రూ.1.28 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో రూ.97,381 కోట్ల రుణాలను ఈ సంస్థలు ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్య మంజూరు చేసినట్టు ఫిన్‌టెక్ అసోసియేషన్ ఫర్ కన్స్యూమర్ ఎంపవర్‌మెంట్ (ఫేస్) పేర్కొంది. చిరు వ్యాపారులు, అల్పాదాయ వర్గాలు వ్యక్తిగత రుణాల కోసం ఎక్కువగా డిజిటల్ ఎన్‌బీఎఫ్‌సీలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 6.4 కోట్ల మంది ఈ సంస్థల నుంచి రూ.97,381 కోట్ల వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే డిజిటల్ రుణాలు తీసుకున్న వారి సంఖ్య 50 లక్షలు పెరిగింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,33,910 ▲	1,22,750 ▲	2,10,000 ▼
విజయవాడ	1,35,500 ▲	1,26,500 ▲	1,94,000 ▼
విశాఖపట్నం	1,33,910 ▼	1,22,750 ▲	2,10,000 ▼
రాజమండ్రి	1,33,910 ▼	1,22,750 ▼	1,92,000 ▼
ప్రొద్దుటూరు	1,31,700 ▲	1,21,160 ▲	1,87,000 ▼
ముంబై	1,32,710 ▲	1,21,562 ▲	1,95,180 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ

హైదరాబాద్	661	విజయవాడ	695
వరంగల్	663	గోదావరి	670
చిత్తూరు	683	విశాఖపట్నం	670
		డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	122
కర్నూలు	119	నెల్లూరు	127
విశాఖపట్నం	116	అనంతపురం	127
గోదావరి	120		

హైదరాబాద్‌లో డబ్ల్యూజీఎస్ స్క్వేర్ డీ సెంటర్

అమెరికాకు చెందిన కన్సల్టింగ్ సంస్థ డబ్ల్యూజీఎస్ స్క్వేర్ డీ కన్సల్టింగ్ ఎల్ఎల్‌సీ.. హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించింది. ఆసియాలో సంస్థకిది తొలి సెంటర్. టెక్నాలజీ సహా భిన్న రంగాల్లోని క్లయింట్లకు ఈ సెంటర్.. రిస్క్, కంప్లయెన్స్, సైబర్ సెక్యూరిటీ, కాస్ట్ ఎఫీషియెన్సీ సహా ఆయా సంస్థల వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా సొల్యూషన్లను అభివృద్ధి చేస్తుందని డబ్ల్యూజీఎస్ స్క్వేర్ డీ ఇండియా సీఈఓ నిఖిల్ చౌహాన్ తెలిపారు. కంపెనీ అంతర్జాతీయ వృద్ధి పథంలో ఇండియా సెంటర్ ఒక మైలురాయి అని పేర్కొన్నారు.

కొనుగోలు చేసిన సరుకు వెనక్కు పంపుతుంటే!

ఇదీ GST


రాంబాబు గొండాల

వ్యాపార లావాదేవీల్లో కొనుగోలు చేసిన సరుకును సరఫరాదారునికి వెనక్కు పంపటం అనేది సర్వ సాధారణం. ఇది ఒక వ్యాపారి నుంచి డిస్ట్రిబ్యూటర్‌కు కావచ్చు లేదా ఒక వ్యాపారి లేదా డిస్ట్రిబ్యూటర్ నుంచి ఉత్పత్తిదారులకు కావచ్చు. ఈ విధంగా సరుకు వెనక్కు పంపటానికి వివిధ కారణాలు ఉండవచ్చు. వచ్చిన సరుకులో నాణ్యతాపరమైన లోపాలు ఉండటం ఒక కారణమైతే, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులను ఉత్పత్తి దారులు కొత్త ప్రొడక్ట్ తయారు చేసిన ప్రతిసారి ఆయా ఉత్పత్తులను డిస్ట్రిబ్యూటర్లకు పంపుతుంటారు. ఆయా వస్తువులు అమ్ముడుపోకపోతే తిరిగి వెనక్కు పంపవచ్చనే షరతు మీద. అలాగే అమ్ముడుపోని సరుకును కొంతకాలం తర్వాత వెనక్కు పంపించటం జరుగుతుంది. అదే విధంగా సీజన్ ప్రకారం వ్యాపారం జరిగే ఎరువులు, పురుగు మందుల వ్యాపారంలో కూడా సీజన్ ముగిసే నాటికి మిగిలిన సరుకును వెనక్కు పంపిస్తుంటారు. ఇలా సరుకు వెనక్కు పంపటమనేది ఆయా సరఫరాదారులు, కొనుగోలుదారుల అవగాహన మేరకు జరుగుతుంది. అయితే ఇలా సరుకు వెనక్కు పంపేటప్పుడు జీఎస్‌టీకి సంబంధించి సరఫరాదారులు, కొనుగోలుదారులు పాటించాల్సిన నియమ నిబంధనలు ఉన్నాయి. కొనుగోలు చేసిన సరుకు వెనక్కు పంపటానికి రెండు రకాల పద్ధతులు ఉన్నాయి. అవేమిటంటే..

మొదటిది, సరఫరాదారుడు.. కొనుగోలుదారునికి వెనక్కు పంపే సరుకు విలువ, దానికి సంబంధించిన జీఎస్‌టీతో ఒక క్రెడిట్ నోట్ జారీ చేస్తాడు. ఇప్పుడు కొనుగోలుదారుడు ఆ క్రెడిట్ నోట్ ఆధారంగా డెలివరీ చలాన్ మీద సరుకు వెనక్కు పంపాలి. ఇలా పంపేటప్పుడు ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు. కానీ, వెనక్కు పంపే సరుకుకు సంబంధించి ఇంతకు ముందు తీసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను రివర్స్ చేయాల్సి ఉంటుంది. అలాగే నియమ నిబంధనల మేర పంపే సరుకుకు ఎలక్ట్రానిక్ (ఈ)- వే బిల్ ఉండాలి.

అయితే, సరఫరాదారుడు క్రెడిట్ నోట్‌ను జారీ చేయటానికి ఒక్కొక్కసారి కుదరకపోవచ్చు. ఎందుకంటే క్రెడిట్ నోట్‌లో మొదట సరుకును ఏ ఇన్వాయిస్‌లో పంపారో ఆ ఇన్వాయిస్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అన్ని సందర్భాల్లో ఇలా ఇన్వాయిస్‌తో మ్యాచ్ చేయటం కుదరకపోవచ్చు. అలాగే, సరఫరాదారుడు తాను జారీ చేసిన క్రెడిట్ నోట్ విలువను తగ్గించుకోవటానికి కాలపరిమితి ఉంది. ఆ సమయం దాటితే విలువను తగ్గించుకోవటం కుదరదు. కాబట్టి క్రెడిట్ నోట్‌ను జారీ చేసినా దానికి సంబంధించిన ప్రయోజనం పొందలేడు.

అలాగే కొనుగోలుదారుడికి కూడా ఎంత రివర్స్ చేయాలో ఒక్కొక్కసారి అర్థం కాదు. ఇలాంటప్పుడు రెండో పద్ధతి పాటించవచ్చు. ఇందులో వెనక్కు పంపే సరుకును కొత్త సరఫరా కింద భావించాలి. అంటే వ్యాపారి తాను వెనక్కు పంపే సరుకును అమ్మకం కింద చూపుతూ ఒక ఇన్వాయిస్ జారీ చేయటంతో పాటుగా దానికి సంబంధించిన పన్ను చెల్లించాలి. అంటే ఒక విధంగా చెప్పాలంటే సరుకు అమ్మేటప్పుడు ఎలాంటి నియమ నిబంధనలు ఉంటాయో అన్నీ పాటించాలి. అంటే, క్రెడిట్ రివర్స్ చేసే బదులు కొత్తగా పన్ను కడుతున్నాడన్న మాట. అలాగే సరుకును వెనక్కు పొందిన తర్వాత సదరు డిస్ట్రిబ్యూటర్ లేదా ఉత్పత్తిదారుడు దానిని కొనుగోలుగా భావించి ఆ ఇన్వాయిస్ మీద ఉన్న ట్యాక్స్ మొత్తాన్ని ఇన్‌పుట్ కింద తీసుకోవచ్చు. అంటే ఈ రెండో పద్ధతిలో సరుకు వెనక్కు పంపే వ్యక్తి అమ్మకందారుడుగా, సరుకును వెనక్కు పొందే వ్యక్తి అంటే సరుకు మొదట పంపిన వ్యక్తి కొనుగోలుదారుడిగా వ్యవహరిస్తారు. కానీ, చాలా మంది చేసే పొరపాటు ఏమిటంటే సరఫరాదారుడు క్రెడిట్ నోట్‌ను జారీ చేయటం, అలాగే కొనుగోలుదారుడు ఇన్వాయిస్ ఇవ్వటం రెండు కలిపి చేస్తుంటారు. ఇలా రెండు పద్ధతులు కలపటం వల్ల అనవసర గందరగోళం ఏర్పడుతుంది. కాబట్టి ఈ రెండు పద్ధతుల్లో ఏదో ఒక పద్ధతి పాటిస్తే సరఫరాదారుడికి, కొనుగోలుదారుడికి సులువుగా ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా...



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీమూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలు. ఇటీవలె ఈ చిత్రం నుంచి తొలి పాట 'దేఖ్‌లేంగే సాలా' ప్రోమోను విడుదల చేసిన సంగతి తెలిసిందే. శనివారం ఈ చిత్రం నుంచి పూర్తి లిరికల్ పాటను విడుదల చేశారు మేకర్స్. 'దేఖ్‌లేంగే సాలా.. చూసినాము చాలా' అంటూ సాగిన ఈ పాట అభిమానుల్లో జోష్‌ను నింపింది. ఇందులో పవన్‌కల్యాణ్ వేసిన అదిరిపోయే స్టెప్పులు థియేటర్లో అభిమానుల చేత విజిల్స్ వేయించేలా ఉన్నాయి. అద్భుతమైన విజువల్స్, క్యాచీ లిరిక్స్, ఆకట్టుకునే సంగీతంతో ఉన్న ఈ పాట ఇన్‌స్టాంట్ హిట్‌గా మారింది. భాస్కరభట్ల ఈ పాటకు సాహిత్యం అందించగా, విశాల్ దద్లానీ, హరిప్రియ ఆలపించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో హరీష్ శంకర్ మాట్లాడుతూ 'ఉస్తాద్ భగత్‌సింగ్ చిత్రం పవన్‌కల్యాణ్ వల్లే ఆలస్యం అయ్యిందని అంటున్నారు. అది నిజం కాదు. మొదట ఆయనతో ప్రేమ కథ తీద్దామనుకున్నా. అయితే, అభిమానులు 'గబ్బర్‌సింగ్' లాంటిది కోరుకోవడంతో సందిగ్ధంలో పడిపోయాం. అంతలోనే పాండమిక్ వచ్చింది. రీమేక్ చేయాలనుకుని అది కూడా పక్కన పెట్టాం. ఆలస్యమైనా పర్లేదు, అభిమానులు మళ్లీ మళ్లీ చూడాలనుకునేలా ఉండే సినిమాను తీయాలి అని 'ఉస్తాద్ భగత్‌సింగ్' తీశాం. నిజానికి పవన్‌కల్యాణ్ వల్లే చిత్రీకరణ త్వరగా పూర్తైంది. ఈ చిత్రం కోసం ఆయన ప్రాణం పెట్టి పనిచేశారు' అని అన్నారు. 'పవన్‌కల్యాణ్‌ను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో, అంతకు మించి హరీష్ చూపించనున్నారు. ఈ చిత్రం వారికి విందులా ఉంటుంది' అని దేవిశ్రీప్రసాద్ చెప్పారు. 'ఇది ఆరంభం మాత్రమే.. ఈ సినిమా నుంచి వచ్చే ప్రతీ కంటెంట్ ఇంతే గొప్ప స్థాయిలో ఉంటుంది' అని నవీన్ యర్నేని తెలిపారు.



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అఖండ 2' చిత్రం ఇటీవలె విడుదలైన సంగతి తెలిసిందే. శనివారం ఆర్.ఎస్.ఎస్. ఛీఫ్ మోహన్ భగవత్‌ను కలిశారు బోయపాటి శ్రీను. 'అఖండ 2' చిత్రాన్ని మోహన్ భగవత్ ప్రశంసించారు. సమాజానికి సానుకూల దిశను చూపిస్తూ, విలువలు కలిగిన చిత్రాలు మరిన్ని రావాలని ఆయన ఆకాంక్షించారు. మోహన్ భగవత్ ఆశీర్వాదం తమ బాధ్యతను పెంచిందని బోయపాటి శ్రీను తెలిపారు.

సంక్రాంతికి వస్తున్నారు



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈమేరకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రం విడుదల తేదీని నిర్మాతలు ప్రకటించారు. ప్రస్తుతం సినిమా నిర్మాణాంతర పనులు కొనసాగుతున్నాయి. కాగా, శనివారం వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా సినిమా నుంచి ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. హెలికాప్టర్ దిగి, సెక్యూరిటీ గార్డులను వెంటేసుకుని వస్తున్న ఆయన లుక్ చాలా స్టైలిష్‌గా ఉంది. మెగాస్టార్ కూడా సోషల్ మీడియా వేదికగా వెంకటేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'హ్యాపీ బర్త్‌డే మై డియర్ వెంకటేశ్. నువ్వు ఎక్కడుంటే అక్కడ నవ్వులు వెల్లివిరుస్తాయి. నీతో కలసి 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం షూటింగ్‌లోని ప్రతీ సందర్భాన్ని ఎంతో సరదాగా గడిపాను' అని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

ఇంధన సంరక్షణలో ఏపీ టాప్

- వరుసగా 4వసారి జాతీయ ఇంధన సంరక్షణ పురస్కారం
- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- ఏపీ తరఫున అందుకోనున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎనర్జీ ఎఫిషియన్సీ రంగంలో ఏపీ మరోసారి సత్తా చాటింది. వరుసగా నాలుగో ఏడాది జాతీయ ఇంధన సంరక్షణ అవార్డును సాధించింది. ఈ అవార్డు ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య రంగాల్లో స్థిరంగా ముందుకు సాగుతున్న ఏపీ పురోగతిని ప్రతిబింబిస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. 'అన్ని ప్రధాన రంగాల్లో ఇంధన సామర్థ్య కార్యకలాపాల్లో పురోగతి కనబరిచాం. జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు -2025లో గ్రూప్ -11 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకోగలిగాలిగాం. విద్యుత్తు రంగంలో సాధిస్తున్న పురోగతి, విద్యుత్తు ఆదాలో రాష్ట్రం సాధించిన విజయాల్లో సీఎం చంద్రబాబు దూరదృష్టి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం ఎంతో ముఖ్యమైనవి' అని అన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సీఈవో నాగలక్ష్మి, ఆమె బృందాన్ని విజయానంద్ అభినందించారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు రాష్ట్రం తరఫున ఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్. శివశంకర్ అందుకోనున్నారు.

ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరింత బాధ్యతగా పనిచేస్తాం: నాగలక్ష్మి

జాతీయ అవార్డుపై స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సీఈవో నాగలక్ష్మి స్పందిస్తూ... ఇంధన సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయిలో పెంచేందుకు మరింత బాధ్యతగా పనిచేస్తామన్నారు. ఏపీ 89.25 పాయింట్లతో గ్రూప్-2లో అగ్రస్థానంలో ఉందని, గతేడాది కన్నా 2.3 శాతం ఎక్కువని ఆమె చెప్పారు.

2 నుంచి పుస్తక సంబరం

- బెజవాడలో 11 రోజులు నిర్వహణ.. ఇందిరాగాంధీ స్టేడియం వేదిక

విజయవాడ కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 2 నుంచి విజయవాడలో పుస్తక సంబరాలు ప్రారంభం కానున్నాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా 36వ పుస్తక మహోత్సవాలు 11 రోజుల పాటు జరగనున్నాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి పుస్తక మహోత్సవంగా నామకరణం చేశారు. ప్రధాన వేదికకు డాక్టర్ బీవీ పట్టాభిరామ్, విద్యార్థి ప్రతిభా వేదికకు జయంత్ నార్లేకర్ పేర్లు పెట్టనున్నారు. సందర్శన ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతుంది. కార్యక్రమ ప్రారంభానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను నిర్వాహకులు ఆహ్వానించారు. జనవరి 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కాలేజీ నుంచి ప్రారంభం కానుంది. 11 రోజుల పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, సదస్సులు నిర్వహించనున్నారు.



పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య తదితరులు

రాయలసీమ సాహిత్యం, ఉత్తరాంధ్ర సాహిత్యం, కోస్తాంధ్ర సాహిత్యం, తెలంగాణ సాహిత్యం, అనువాద సాహిత్యం, బాల సాహిత్యం, దృశ్యమాలిక వంటి అంశాలపై సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. పుస్తక మహోత్సవ పోస్టర్‌ను శనివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షుడు టి.మనోమర్‌నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య తదితరులు ఆవిష్కరించారు.



కర్నూలు ధార్మిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఆనం, టీజీ భరత్

ఆధ్యాత్మిక రాష్ట్రమే లక్ష్యం

- 98 శాతం హామీలు నేరవేర్చాం
- 846 కోట్లతో 1,058 ఆలయాల పునర్నిర్మాణం
- ధార్మిక భవన్ సేవలు.. 'కర్నూలు టు కాణిపాకం': మంత్రి ఆనం

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంతో పాటు దేశంలోనే నంబర్ వన్ ఆధ్యాత్మిక రాష్ట్రమే లక్ష్యంగా పని చేస్తామని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగర శివారులో నూతనంగా నిర్మించిన ధార్మిక భవనం... కర్నూలు జోన్ పరిపాలన భవన సముదాయాన్ని మరో మంత్రి టీజీ భరత్‌తో కలసి ఆనం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ హరిజవహర్ లాల్, కమిషనర్ రామచంద్రమోహన్, కలెక్టర్ సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో దేవదాయ శాఖ 98 శాతం హామీలు అమలు చేసింది. విజయవాడలోని గొల్లపూడిలో ఉన్నట్లుగానే, రాయలసీమలోని కర్నూలులో రూ.4.91 కోట్లతో ధార్మిక భవనాన్ని నిర్మించాం. రాయలసీమలోని కర్నూలు టూ కాణిపాకం ఆలయం వరకు పాలనాపరమైన అంశాలకు ఈ కార్యాలయం కీలకంగా పని చేస్తుంది. ఆలయాల్లో ఉత్సవాలు, పూజా కైంకర్యాలు వైదిక నిర్ణయాల ప్రకారం చేస్తున్నామని తెలిపారు. అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలు, వేద విద్య నేర్చుకున్న పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇస్తున్నాం. దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేశాం. 20 వేల ఆయయాల్లో 3,700 గోవులను సంరక్షిస్తున్నాం. దేవదాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చాం. సెలక్షన్ ప్రక్రియ కూడా త్వరలో మొదలు పెడతాం. సీఎం చంద్రబాబు కార్యచరణ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు, ప్రధానీ మోదీ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాల కింద ప్రతి ఆలయానికి ప్రతి నెల రూ.10 వేలు ఇస్తున్నాం. రాష్ట్రంలో 1,058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు కేటాయించాం. 2027 జూన్ 26న గోదావరి పుష్కరాలను 12 రోజుల పాటు నిర్వహించేందుకు ఆగమ పండితుల సూచనల మేరకు నిర్ణయించాం. 2028లో కృష్ణ పుష్కరాలు నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నాయి. గోదావరి పుష్కరాల సందర్భంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 31 పెద్ద ఆలయాల మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాం' అని పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... 'ఎంతో అవగాహన, విషయ పరిజ్ఞానం ఉన్న ఆనం రాంనాయరాణ రెడ్డి లాంటి వ్యక్తి ఉండటం వల్ల దేవదాయశాఖ ఎంతో సమర్థంగా పనిచేస్తోంది. శాసనమండలిలో ప్రత్యర్థి పార్టీ నాయకులు వేసే ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానంతో తిరుగుమాట ఉండదు' అని అన్నారు. సీనియారిటీని పక్కన పెట్టి, ఈఓలను కాదని అడ్డదారిలో సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇచ్చారంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

క్లాస్‌లో టెన్త్ విద్యార్థిని మృతి

- క్లాసు జరుగుతుండగా ఘటన
- కోనసీమ జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విషాదం



రామచంద్రపురం(ద్రాక్షారామ)/రాయవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థిని తరగతి గదిలో మొదటి బెంచ్‌లో కూర్చొని పాఠాలు వింటోంది. ఈ సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలింది. గమనించిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆ విద్యార్థిని మరణించిందని వైద్యులు పేర్కొన్నారు. ఈ విషాద ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి సిరి (15) రామచంద్రపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు హాజరైంది. తరగతి గదిలో క్లాసు జరుగుతుండగా మొదటి బెంచ్‌లో కూర్చున్న సిరి 9.45 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా బెంచి పైనుంచి కింద పడిపోయింది. దీంతో ఉపాధ్యాయుడు, తోటి విద్యార్థులు పైకి లేపగా.. అప్పటికే ఆమెలో చలనం లేదు. దీంతో యాజమాన్యం హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. అక్కడ నుంచి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే సిరి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సిరి మృతిపై తల్లిదండ్రులు సుజాత, వెంకటరెడ్డి ఫిర్యాదుతో రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సిరి మృతికి కారణం ఏంటనేది తెలియరాలేదు. బెంచిపై కూర్చొన్న సిరి.. ఒకసారి దగ్గి మెడ ముందుకు వాల్చడం, తర్వాత ఒక్కసారిగా బెంచిపై నుంచి కిందకి పడిపోవడం సీసీ కెమెరాలో రికార్డయింది. కుమార్తె మృతితో బాధిత తల్లితండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు

- గుంటూరు జీజీహెచ్‌లో 22 మందికి చికిత్స
- ముగ్గురి పరిస్థితి విషమం.. ఐసీయూకి తరలింపు
- జ్వరంతో వచ్చిన వారందరికీ స్క్రబ్ టైఫస్ పరీక్షలు: సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ జ్వర కేసులు పెరుగుతున్నాయి. గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు చెందిన బాధితులు పెద్ద సంఖ్యలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 22 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచారు. ఆసుపత్రి బీ క్లాస్ విభాగంలో 14 పడకలతో స్క్రబ్ టైఫస్ రోగుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వార్డు మొత్తం రోగులతో నిండిపోయింది. ఇంకా మిగిలిన వారిని ఇతర వార్డుల్లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. చికిత్సల కోసం వస్తున్న జ్వర బాధితులందరికీ స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. అదేవిధంగా మలేరియా, డెంగీ పరీక్షలు కూడా చేయిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో పలు చోట్ల పారిశుధ్యం క్షీణించి.. స్క్రబ్ టైఫస్ కారక చిగ్గర్ మైట్స్ (పేడ పురుగులు) సంఖ్య బాగా పెరిగినట్లు వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. పెరిగిన మైట్స్ వల్ల పలువురు ఈ జ్వరాల బారిన పడుతున్నారు.

పంచాయతీ ఎన్నికలకు 'రోడ్'మ్యాప్

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి సారించారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ ఇప్పటికే పూర్తి చేశారు. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కీ) కింద ఇటీవల కేంద్రం రూ.2,120 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి వెచ్చించనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మరో రూ.900 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద మరో రూ.2 వేలకోట్లు వరకు నిధులు కేంద్రం నుంచి రానున్నాయి. ఈ మొత్తం నిధులతో గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నిధుల ద్వారా వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులు రూ.2 వేలకోట్లు వెచ్చించి 4 వేల కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.2 వేలకోట్లతో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పల్లె పండుగ పనులకు సంబంధించిన బకాయిలు విడుదలలో జాప్యం జరిగింది. ఆ పనులు చేపట్టిన వారిలో అసంతృప్తిని చల్లార్చేందుకు ఇప్పటికే చాలా వరకు బకాయిలు విడుదల చేశారు. మరో రూ.200 కోట్ల బకాయిలను త్వరలో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు.



విప్లవాత్మక సంస్కరణలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీల్లో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గతంలో పంచాయతీల్లో అంతా మాన్యువల్ వ్యవస్థ నడిచేది. దీనివల్ల అవినీతికి ఆస్కారం ఏర్పడటంతో పాటు ప్రజలకూ తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇటీవల స్వర్ణ పంచాయతీ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావడంతో వీటికి చెక్ పడనుంది. ఈ పోర్టల్ ద్వారా.. ఇప్పటి వరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకే పరిమితమైన ఆన్‌లైన్ వ్యవస్థను గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లయింది. ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, లేఔట్ డెవలప్‌మెంట్ చార్జీలు వంటి వాటిని ఆన్‌లైన్ ద్వారా చెల్లించే వెసులుబాటు ఈ పోర్టల్ ద్వారా కలుగుతుంది. గతంలో ఒకే కార్యదర్శి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను నిర్వర్తించేవారు. దీంతో పంచాయతీల్లో పాలన గాడి తప్పింది. పంచాయతీల పాలనను మరింత మెరుగుపర్చేందుకు వాటిని రీగ్రూపింగ్ చేయడంపై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టారు. అందులో భాగంగా పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రతి పంచాయతీకి ప్రత్యేక కార్యదర్శి స్థాయి అధికారిని నియమించాలని నిర్ణయించారు. డివిజన్ స్థాయిలోనూ పంచాయతీరాజ్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసులను(డీడీవో) ప్రారంభించారు. ఒకేసారి 10 వేలమంది పంచాయతీరాజ్ సిబ్బందికి పదోన్నతులు కల్పించడం ద్వారా మరింత మెరుగ్గా పనిచేసేలా వారిలో ఉత్సాహం నింపారు. డీడీవోలను మినీ కలెక్టరేట్లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,390 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించడం ద్వారా ప్రపంచ రికార్డును నెలకొల్పారు. మొత్తమ్మీద వైసీపీ హయాంలో గాడి తప్పిన పంచాయతీ పాలనను గాడిన పెట్టి పంచాయతీ ఎన్నికల్లో గెలుపునకు మార్గం సుగమం చేసుకునే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

వైసీపీ హయాంలో పూర్తిగా ధ్వంసమైన గ్రామీణ రహదారులకు మహర్దశ వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పల్లె పండుగ పేరుతో గుంతల రహదారుల మరమ్మతులపై దృష్టి సారించింది. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది.

పంచాయతీల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారు. పంచాయతీల్లో పట్టణ స్థాయి సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇటీవల స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ప్రారంభించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకే పరిమితమైన ఆన్‌లైన్ వ్యవస్థను గ్రామీణ ప్రాంతాలకూ తీసుకొచ్చారు.

ఓర్వకల్లులో ఆర్గానిక్ కెమికల్ ప్లాంట్

- విరూపాక్ష సంస్థకు 100 ఎకరాలు
- రాష్ట్రంలో మరిన్ని కంపెనీలకు భూమి కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడుల ప్రతిపాదనలపై ప్రభుత్వం వేగంగా స్పందిస్తోంది. ఇటీవల క్యాబినెట్, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో ఆమోదం పొందిన కంపెనీలకు భూములు కేటాయించింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఐపి గుట్టపాడు క్లస్టర్‌లో ఫార్మాస్యూటికల్ అండ్ ఆర్గానిక్ కెమికల్స్ ప్లాంట్ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ తయారీ యూనిట్) ఏర్పాటు కోసం విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్ కంపెనీకి ఎకరా రూ. 30 లక్షల చొప్పున మొత్తం 100.23 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. అయితే అక్కడే ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు, ఎనర్జీ స్టోరేజ్ పరికరాల తయారీ యూనిట్ కోసం గతంలో ప్యూర్ ఎనర్జీ లిమిటెడ్‌కు 105.12 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేసి.. ఆ భూములను విరూపాక్ష కంపెనీకి ఇచ్చేందుకు ఏపీఐఐసీ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడు గ్రామంలో రూ. 870 కోట్ల పెట్టుబడితో ప్రైవేట్ లార్జ్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి కోసం ఇఫ్కో కిసాన్ సెజ్ లిమిటెడ్‌కు 2,776.23 ఎకరాల భూములను కేటాయించింది. ఈ పార్కులో 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాముకా, ఎలీప్‌లకు భూములు

ఇక రాముకా గ్లోబల్ ఎకోవర్క్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అభ్యర్థన మేరకు అనకాపల్లి జిల్లా, కోడూరు మొదటి దశ ప్రాజెక్టు కోసం 45 ఎకరాల భూమిని రాయితీ రేటుకు ప్రభుత్వం కేటాయించింది. దాంతో పాటు ఆ భూమి ధర చెల్లింపు కోసం 6 నెలల పాటు గడువు పొడిగింపు (ఈవోటీ)నకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో అచ్యుతాపురంలోని డీ-నోటిఫైడ్ ఏరియాలో ఎకరం రూ. 87.82 లక్షల చొప్పున 45 ఎకరాలు రాముకాకు కేటాయించారు. ఆ భూములు లోతట్టు ప్రాంతంలో ఉండటం, కనెక్టివిటీ లేకపోవడంతో రాముకా సంస్థ సకాలంలో ధర చెల్లించక గడువు ముగిసిపోయింది. ఆ సంస్థ తాజా అభ్యర్థన మేరకు ఆ భూమిని ఎకరా 35 లక్షల చొప్పున కేటాయించింది. భూమిని చదును చేయడం, అదనపు మౌలిక సదుపాయాల ఖర్చులను రాముకా సంస్థ భరించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇక అనకాపల్లి జిల్లాలోని కోడూరులోనే ప్రైవేట్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు కోసం అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఎలీప్) సంస్థకు 31.77 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.



బోర్డుపై ఏసుక్రీస్తు గురించి రాస్తున్న వెంకట మాధురి

తరగతి గదిలో ఏసుక్రీస్తుపై బోధన

- తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘటన
- కాంట్రాక్ట్ మహిళా లెక్చరర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మతప్రచారం చేశారన్న అభియోగంపై ఓ మహిళా కాంట్రాక్టు లెక్చరర్ ను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాలివీ.. కడపకు చెందిన వెంకట మాధురి తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా కాంట్రాక్టు పద్ధతిలో ఐదు నెలలుగా పనిచేస్తున్నారు. గురువారం క్లాస్‌కు వచ్చిన ఆమెబోర్డుపై 'అమ్మ - నాన్న - ఏసుప్రభువు, అక్క - అన్న - ఏసుక్రీస్తు' అని రాశారు. విద్యార్థుల్లో ఒకరు దాన్ని వీడియో తీశారు. ఈ వీడియో శనివారం వెలుగులోకి రావడంతో కళాశాల ప్రిన్సిపాల్ ద్వారకనాథ రెడ్డి రాష్ట్ర టెక్నికల్ బోర్డు అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు కొంతమంది హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్‌తో ఓ కమిటీని వేసి విచారణ చేపట్టారు. అధ్యాపకురాలు వెంకట మాధురితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తానేమీ ఏసుక్రీస్తు గురించి విద్యార్థులకు చెప్పలేదంటూనే.. బోర్డుపై రాసింది మాత్రం తానేనంటూ పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన కళాశాల అధికారులు రిపోర్టును ఉన్నతాధికారులకు పంపించారు. వారి ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ ఆర్డర్‌ను ప్రిన్సిపాల్ ఆమెకు అందజేశారు. క్లాసు రూమ్‌లో మత ప్రచారం చేసిన ఆమెను పూర్తిగా విధుల్లో నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు పెట్టాలని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సనాతన ధర్మ పరిరక్షణ సమితి నాయకులు సాయంత్రం కళాశాల వద్దకు చేరుకుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. అప్పటికే ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెలుసుకుని మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వరాహస్వామి దర్శన సమయం పెంపు

- రాత్రి 10 గంటల వరకూ పొడిగింపు



తిరుమల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వరాహస్వామి ఆలయంలో దర్శన సమయాన్ని శనివారం నుంచి ఒక గంట పెంచారు. క్షేత్ర సంప్రదాయం మేరకు తొలుత వరాహస్వామిని దర్శించుకుని ఆ తర్వాత శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు అధికమయ్యారు. దీంతో ఈ ఆలయం వద్ద నిత్యం క్యూలైన్లు వెలుపలకు వ్యాపిస్తున్నాయి. దీనిపై 'వరాహ స్వామి దర్శనానికీ పెరుగుతున్న రద్దీ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 9న కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు దర్శన సమయాలపై దృష్టి సారించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శన సమయాన్ని పెంచే అంశంపై కసరత్తు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉదయం 4.30 నుంచి ప్రారంభమయ్యే దర్శనాలు రాత్రి 9 గంటల వరకు సాగుతుండగా, శనివారం నుంచి రాత్రి 10 గంటల వరకు పొడిగించారు. 10 గంటలకు లైన్ మూసివేసి క్యూలో ఉన్నవారందరికీ దర్శనం చేయిస్తున్నారు.

స్పోర్ట్స్

పైచేయి ఎవరిదో?

గిల్‌కు కౌంట్‌డౌన్

రాత్రి 7 గం. నుంచి

- సూర్య సత్తాచాటేనా ?
- ఒత్తిడిలో భారత్
- ఆత్మవిశ్వాసంలో దక్షిణాఫ్రికా



ప్రాక్టీస్‌లో సూర్య, అభిషేక్, గిల్

ధర్మశాల: పొట్టి ఫార్మాట్‌లో తనస్థానాన్ని సుస్థిరం చేసుకొన్న సంజూ శాంసన్‌ను పణంగాపెట్టిన భారత్.. శుభ్‌మన్ గిల్‌కు జట్టులో చోటివ్వడం బెడిసికొడుతోంది. దక్షిణాఫ్రికాతో ఆడిన రెండు టీ20ల్లోనూ గిల్ ఘోరంగా విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే మూడో టీ20 గిల్ కెరీర్‌కు విషమ పరీక్షగా భావిస్తున్నారు. ఇదే పేలవ ఫామ్‌ను అతడు కొనసాగిస్తే.. టీ20 వరల్డ్‌కప్ కోసం టీమిండియా మేనేజ్‌మెంట్ ప్రత్యామ్నాయాలు వెదకాల్సి రావచ్చు. ఇక, తనదైన శైలిలో మెరుపులు మెరిపించే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వరుసగా నిరాశపరుస్తుండడం కూడా జట్టుకు భారంగా మారింది. కాగా, తొలి మ్యాచ్‌లో గెలిచి తమకు తిరుగులేదనిపించుకొన్న భారత్.. చండీగఢ్‌లో దారుణంగా చతికిలపడింది. టాస్ గెలిచిన మ్యాచ్‌లో బౌలింగ్, బ్యాటింగ్‌లో విఫలమైన భారత్ చిత్తుగా ఓడడం ఫ్యాన్స్‌కు ఒక్కపట్టాన మింగుడుపడడం లేదు. ఈ క్రమంలో భారత జట్టుపై భారీగా ఒత్తిడి నెలకొంది. దీంతోపాటు సూర్య బ్యాటింగ్ ఆర్డర్‌పై పదేపదే ప్రయోగాలు చేయడం.. శివం దూబేను ఎనిమిదో నెంబర్‌లో దించడం విమర్శలకు దారితీసింది. తిలక్ వర్మ, జితేష్ ఫర్వాలేదనిపించినా.. హార్దిక్ పాండ్యా ఆశించిన రీతిలో ఆడలేదు. బౌలర్ల విషయానికొస్తే అర్ష్‌దీప్ సింగ్ నిరాశపర్చగా.. పేస్ స్టార్ బుమ్రా కూడా గతి తప్పాడు. దీంతో అర్ష్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాకు చాన్సిచ్చే అవకాశాలున్నాయి. స్పిన్నర్లలో వరుణ్ చక్రవర్తి లేదా కుల్దీప్‌లో ఒకరికే అవకాశం. మరోవైపు సిరీస్‌ను 1-1తో సమం చేసిన సౌతాఫ్రికా ఫుల్‌జోష్‌లో ఉంది. డికాక్‌తోపాటు కెప్టెన్ మార్‌క్రమ్, బ్రెవిస్, ఫెరీరా దూకుడుగా ఆడుతుండడం జట్టుకు ప్లస్ అవుతోంది. బౌలర్లు ఎన్‌గిడి, మార్కో యాన్సెన్, నోకియా, బార్ట్‌మన్ క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తున్నారు. మరోసారి వీరు చెలరేగితే సిరీస్‌లో పైచేయి సాధించే అవకాశం ఉంది. అయితే, టీమిండియా కసిగా బదులు తీర్చుకోవాలనుకొంటోంది.

జట్లు (అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్, అర్ష్‌దీప్/రాణా, వరుణ్, బుమ్రా.

సౌతాఫ్రికా: క్వింటన్ డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్/ హెండ్రిక్స్, డెవాల్డ్ బ్రెవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, జార్జ్ లిండే/కేశవ్, ఎన్‌గిడి/బాష్, బార్ట్‌మన్, నోకియా/సిపామ్లా.

పిచ్/వాతావరణం

ధర్మశాలలో గత ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో ఛేజింగ్ టీమ్ గెలిచింది. ఈ నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. చలి ఎక్కువగా ఉండడంతో వికెట్ పేసర్లకు అనుకూలించవచ్చు. మొత్తంమీద వాతావరణ పరిస్థితులు విజేతను నిర్ణయించే అవకాశముంది.

భారత్ విచ్చేసిన విరుష్క జోడీ

మెస్సీని కలిసేందుకేనా ?



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం కొద్ది రోజుల కిందటే విరాట్ స్వదేశానికి విచ్చేశాడు. సరిగ్గా..గత శనివారం విశాఖపట్నంలో ఆఖరి వన్డే ముగిసిన అనంతరం అతడు తిరిగి ఇంగ్లండ్ వెళ్లిపోయాడు. మళ్లీ వారం తిరిగే సరికి..అంటే శనివారంనాడు భార్య అనుష్క శర్మతో కలిసి కోహ్లీ భారత్ వచ్చాడు. ముంబైలోని కలినా విమానాశ్రయం నుంచి భార్యతో కలిసి విరాట్ బయటకు వస్తున్న దృశ్యాల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వారంలోనే కోహ్లీ తిరిగి భారత్ రావడం..అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీని కలిసేందుకేనన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. మెస్సీ మూడు రోజుల భారత పర్యటన శనివారం మొదలైన సంగతి తెలిసిందే. ఆదివారం ముంబైలో మెస్సీ కార్యక్రమాలున్నాయి. ఈనేపథ్యంలో మెస్సీని కలిసేందుకే భార్య సహా విరాట్ వచ్చాడని భావిస్తున్నారు.

ఫైనల్లో ఉన్నతి, ఇషా

- పురుషుల టైటిల్ పోరుకు కిరణ్
- ఒడిశా మాస్టర్స్ బ్యాడ్మింటన్

కటక్: ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు ఉన్నతి హుడా, ఇషారాణి బరూచ మహిళల సింగిల్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల్లో భారత్‌కు చెందిన కిరణ్ జార్జ్ టైటిల్‌పోరులో నిలిచాడు. శనివారం ఇక్కడ జరిగిన మహిళల సెమీఫైనల్లో టాప్‌సీడ్ ఉన్నతి 18-21, 21-16, 21-16తో భారత్‌కే చెందిన తస్నీమ్ మీర్‌పై విజయం సాధించగా.. ఇషారాణి 18-21, 21-7, 21-7తో సహచర షట్లర్ తన్వీ హేమంత్‌ను ఓడించాడు. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో రెండో సీడ్ కిరణ్ జార్జ్ 21-19, 8-21, 21-18తో సహచర ఆటగాడు రోనక్ చౌహాన్‌పై గెలుపొందాడు. శనివారం జరిగే తుది పోరులో ఇండోనేసియా షట్లర్ మహ్మద్ యూసుఫ్‌తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల డబుల్స్‌లో అశ్వినీ భట్/శిఖా గౌతమ్ ద్వయం, మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో భారత జోడీలు ఎస్ కనపురం/ఉదయసూర్యన్, సాత్విక్ రెడ్డి/రేషిక ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై ఫైనల్స్‌కు ముందే వెనుదిరిగారు.



హైదరాబాద్‌లో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్, మోత్కుపల్లి నర్సింహులు

సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఎన్టీఆర్ ఉంటారు

- దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ముద్ర శాశ్వతం
- 'ఆగస్టు పరిరక్షణ ఉద్యమం'పై ఆడియో పుస్తకాన్ని ఆవిష్కరించిన బీజేపీ ఎంపీ పురందేశ్వరి

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఎన్టీఆర్ ముద్ర దేశ, రాష్ట్ర రాజకీయాల్లో శాశ్వతంగా ఉంటుందని ఆయన కుమార్తె, బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకూ ఆయన పేరు నిలిచి ఉంటుందని తెలిపారు. ఆడియో రూపంలో తెచ్చిన '1984 ఆగస్టు పరిరక్షణ ఉద్యమ సజీవ చరిత్ర' పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లో పురందేశ్వరి ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఎన్టీఆర్ జీవితంలో ప్రధాన సంఘటన అని, దేశ రాజకీయాలను ఆ ఘటన పూర్తిగా మార్చివేసిందని ఆమె అన్నారు. అప్పట్లో పార్టీ ఫిరాయింపులు, ప్రభుత్వాలను పడగొట్టే అనైతిక చర్యలు దేశవ్యాప్తంగా యథేచ్ఛగా జరిగేవని గుర్తు చేశారు. ఆగస్టు పరిరక్షణోద్యమం ఫలితంగానే.. 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల వ్యతిరేక చట్టం అమల్లోకి వచ్చిందని పురందేశ్వరి వివరించారు. ఈ ఉద్యమంపై ఆడియో పుస్తకాన్ని రూపొందించిన జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని, ఆ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్‌ను పురందేశ్వరి అభినందించారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ మాట్లాడుతూ.. 1984 ఆగస్టు నాటి రాజకీయ పరిస్థితులు తమ కుటుంబాన్ని ఏ విధంగా ఆవేదనకు గురి చేశాయో గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత విక్రమ్ పూల, టీడీ జనార్దన్, నిర్మాత కేఎస్ రామారావు, బొల్లినేని కృష్ణయ్య, ఆడియోలో గాత్రధారణ చేసిన గాయత్రి, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర అప్పులపై బొత్స అసత్యాలు: పల్లా

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసింది. దానికి లక్ష కోట్లు వరకు వడ్డీ, అసలు వాయిదాలు చెల్లించాల్సి వచ్చింది. అలాగే రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టిపోగా అందులో కూటమి ప్రభుత్వం రూ.40 వేల కోట్లకుపైగా తీర్చింది' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన చేశారు. 'ఈ వాస్తవాలను దాచి పెట్టి బొత్స సత్యనారాయణ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తోందని అసత్యాలు వల్లెవేస్తున్నారు. జగన్ తన అవినీతి కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. మద్యం షాపులు కుదవపెట్టి రూ.25 వేల కోట్లు అప్పు చేసి అందులో రూ. 3,500 కోట్లు దోచేశారు. సెంటు పట్టా మాటున రూ.7 వేల కోట్ల అవినీతి చేశారు. జగన్ చేసిన అప్పులు, వడ్డీలు కట్టడానికి, జగన్ పెట్టిన బకాయిలు తీర్చడానికే కూటమి ప్రభుత్వం అప్పులు చేయాల్సి వస్తోంది' అని పల్లా పేర్కొన్నారు.

కోటి సంతకాల సేకరణ ఓ బూటకం: మంత్రి వాసంశెట్టి

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసిన వైసీపీ.. ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలో అసత్య ప్రచారం చేస్తూ కోటి సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా మారిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జగన్ సంతోషం కోసం కొడాలి నాని నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారని, ఇప్పుడు రెడ్ బుక్ భయంతో గజగజలాడిపోతున్నారని వ్యాఖ్యానించారు. అవాకులు చవాకులు పేలటం ఎందుకు? ఇప్పుడు డైపర్లు వేసుకు తిరగడం ఎందుకని ప్రశ్నించారు. పులులు, సింహాలు అంటూ హడావిడి చేసి ఇప్పుడు గ్రామ సింహాలుగా మారిపోయారని ఎద్దేవా చేశారు.

బాబు విజనరీ... జగన్ ప్రిజనరీ: పంచుమర్తి అనురాధ

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఒకే రోజు 9 ఐటీ కంపెనీలకు శంకుస్థాపన చేయడం రాష్ట్ర చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని, దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు రాష్ట్రాభివృద్ధిపైనా విషప్రచారం చేస్తున్నారని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలకు భూములు ఇస్తే తప్పేంటని హైకోర్టు అక్షింతలు వేసినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదన్నారు. చంద్రబాబు విజనరీ అయితే జగన్ ప్రిజనరీ అని విమర్శించారు.

పెద్దల పాత్రపై విచారణ జరగాలి: వర్ల రామయ్య

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో ముద్దాయి రవికుమార్‌కు అనుకూలంగా వ్యవహరించి, జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించేలా పోలీసులపై ఒత్తిడి చేసిన పెద్దలు ఎవరో తేల్చాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రవికుమార్‌ను రక్షించేందుకు ఆనాడు వ్యవస్థలన్నీ సహకరించాయని, ఏ పెద్దల ఒత్తిడితో అలా జరిగిందనే విషయాన్ని నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందన్నారు.



కంటిన్యువస్ క్యాస్టింగ్ మిషన్ విభాగం

ప్రైవేటుకు విశాఖ స్టీల్ ప్లాంట్ కాస్టింగ్ మిషన్ విభాగం

- రూ. 131 కోట్లతో టెండర్ పిలిచిన యాజమాన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఒక్కో విభాగాన్ని ప్రైవేటుకు అప్పగిస్తోంది. ఇటీవలే ప్లాంటులో 32 విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు టెండర్లు ఆహ్వానించిన యాజమాన్యం.. కంటిన్యువస్ కాస్టింగ్ మిషన్ విభాగాన్ని రూ. 131.33 కోట్లకు రెండేళ్లకు కాంట్రాక్టుకు ఇవ్వడానికి శుక్రవారం టెండర్లు పిలిచింది. ప్లాంటులో ఈ విభాగంలోనే స్టీల్ మెల్టింగ్ షాపు నుంచి వచ్చే లిక్విడ్ స్టీల్‌ను దిమ్మలుగా పోస్తారు. ఒకప్పుడు ప్రపంచంలోనే ఇది అతి పెద్దది. 24 గంటలూ ఇది పనిచేస్తుంది. ఇక్కడ తయారైన స్టీల్ దిమ్మల(బ్లూమ్స్)ను ఆ తరువాత వైర్ రాడ్లుగా మారుస్తారు. ఇది అత్యంత కీలకమైన విభాగం. లిక్విడ్ స్టీల్‌ను లాడిల్స్‌తో తీసుకువచ్చి అచ్చులు పోస్తారు. ఇక్కడ సుమారు 250 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. షిఫ్ట్‌నకు 70 నుంచి 80 మంది ఉంటారు. కాంట్రాక్ట్‌కు ఇస్తే.. కేవలం పర్యవేక్షణకు నామమాత్రంగా అధికారులను పెట్టి మిగిలిన వారికి వీఆర్ఎస్ ఇస్తారని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. ఈ స్టీల్ ప్లాంటులో గతంలో కేవలం క్లీనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులను మాత్రమే ప్రైవేటు నిర్వహణకు, కాంట్రాక్టుకు ఇచ్చేవారని, ఇప్పుడు నేరుగా విభాగాల ఆపరేషన్లను కూడా ప్రైవేటు సంస్థలు/వ్యక్తులకు అప్పగిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కాంట్రాక్టుల వల్ల యాజమాన్యానికి ఖర్చులు తగ్గడం లేదని, నిజానికి గతం కంటే ఎక్కువ వ్యయం కూడా అవుతోందని ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడొద్దు

కూటమి డైరెక్షన్‌లో ఎమ్మెల్యేలు పనిచేయాలి.. కార్యకర్తల వెంట ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి

- వన్ టూ వన్ కార్యక్రమంలో భాగంగా పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో పవన్ భేటీ..
- పంచాయతీరాజ్ నిధుల వినియోగంపై ఆరా



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో ఎమ్మెల్యే బాలరాజు

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడంలో రాజీ పడొద్దని జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రజలు తమ సంక్షేమంతోపాటు ప్రాంత అభివృద్ధిని కూడా కోరుకుంటున్నారనేది మరిచిపోవద్దని హితబోధ చేశారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. వారానికి కనీసం ఒకరిద్దరిని కలవాలని ఆయన భావిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన.. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో భేటీ అయ్యారు. గత ఏడాదిన్నర కాలంలో పోలవరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీరాజ్ నిధుల వినియోగం, ఎన్ఆర్‌జీఎస్ పనుల పురోగతితో పాటు ప్రభుత్వ పథకాల అమలు తీరు, వ్యవసాయ సంబంధిత అంశాలు, యువత ఉపాధి అవకాశాలపై ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజల సంతృప్త స్థాయిని పెంచాలని నిర్దేశించారు. కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళుతోందని, జనసేన ఎమ్మెల్యేలు కూడా ఆ దిశగానే పని చేయాలని స్పష్టం చేశారు. "పోలవరం నియోజకవర్గంలోని ఐ.ఎస్ జగన్నాథపురం పర్యటనకు వెళ్లినప్పుడు కొయ్యలగూడెం మండలం నుంచి ఒక ఆడపడుచు పసిబిడ్డను ఎత్తుకొని వచ్చింది. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించమని కోరింది. ఆమె విజ్ఞప్తిని తక్షణమే పరిశీలించి తిమ్మనకుంట - గవరవరం మధ్యలో రెండు రోడ్ల నిర్మాణానికి రూ.7.60 కోట్లు మంజూరు చేయించాను. అలాంటి సమస్యలను ఎమ్మెల్యేగా గుర్తించి, వాటిని పరిష్కరించాలి. ప్రజలు తమ సంక్షేమం గురించే కాకుండా, తమ ప్రాంత అభివృద్ధి గురించీ ఆలోచిస్తున్నారు. అందుకు అనుగుణంగా మనం ముందుకు వెళ్లాలి. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. అదే సమయంలో జనసేన శ్రేణులకు అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలి." అని సూచించారు. పోలవరం నియోజకవర్గంలో జనసేన నాయకులకు లభించిన నామినేటెడ్ పోస్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, తన నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని పవన్ కల్యాణ్‌కు బాలరాజు అందించారు. ఈ సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

నెల్లూరు మేయర్ స్రవంతి రాజీనామా

- నేడు కలెక్టర్‌కు లేఖ అందచేస్తానని ప్రకటన



మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతి అవిశ్వాస తీర్మాన వ్యవహారం గత కొన్నిరోజులుగా రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ వివాదానికి తెర దించుతూ ఆమె శనివారం రాత్రి కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబరులో మీడియాతో మాట్లాడారు. పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు లేఖను ఆదివారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేస్తానని ఆమె ప్రకటించారు. 'నన్ను పదవి నుంచి దించాలని కొందరు వ్యక్తులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కార్పొరేటర్లపైన దాడులు చేస్తున్నారు. మహిళా కార్పొరేటర్లను బెదిరిస్తున్నారు. నాకు మేయర్ పదవి ఇచ్చింది జగన్మోహన్‌రెడ్డి. ఆయనకు రుణపడి ఉంటా. నా పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నా. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా. నాపై కుట్ర పన్నిన వారందరికీ నా ఉసురు తగులుతుంది' అంటూ స్రవంతి శాపనార్థాలు పెట్టారు. అనంతరం ఆమె భర్త జయవర్ధన్ మాట్లాడుతూ... 'నా భార్య స్రవంతి దెబ్బకి టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు భయపడుతున్నారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డిల రాజకీయ అంతం పలికే వరకు మా పోరాటం ఆగదు. వీళ్లంతా రాక్షసులు. ఇందుకు మూల్యం చెల్లించుకోక తప్పదు. రేకుల షెడ్డులో ట్యూషన్ చెప్పిన నారాయణ రూ.వందల కోట్లు ఎలా సంపాదించాడో బయట పెడతా' అని హెచ్చరించారు.

క్రికెటర్లకు 24 గంటల్లోనే పవన్ సాయం

- దీపిక, కరుణకుమారి ఇళ్లకు సరుకులు పంపిన డిప్యూటీ సీఎం
- కుటుంబాలకు గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు అందజేత



అల్లూరి జిల్లా వంట్లమామిడిలో డిప్యూటీ సీఎం పవన్ పంపిన గృహోపకరణాలు, సరుకులతో కరుణకుమారి తల్లిదండ్రులు రాంబాబు, సంధ్య తదితరులు



శ్రీసత్యసాయి జిల్లా తంబాలహట్టిలో దీపిక కుటుంబానికి గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న జనసేన నాయకుడు వరుణ్ తదితరులు

పుట్టపర్తి/పాడేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంధుల టీ-20 ప్రపంచ కప్ సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక, క్రికెటర్ పాంగి కరుణకుమారిలకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలిచారు. ఆ జట్టు సభ్యులు శుక్రవారం పవన్‌కల్యాణ్‌ను కలవగా ఒక్కొక్క క్రికెటర్‌కు రూ.5 లక్షలు అందించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫీజుతో తమ కుటుంబ సభ్యుల ఆకలి తీర్చానని ఆ సందర్భంగా దీపిక చెప్పిన మాటలకు పవన్‌కల్యాణ్ ఆవేదన చెందారు. 24 గంటల్లోనే ఆమె కుటుంబానికి అవసరమైన వస్తువులు, నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలను ఆమె ఇంటికి పంపించారు. జనసేన ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు, ఆహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఇతర నాయకులు శనివారం శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంబాలహట్టిలోని దీపిక ఇంటికి ఆ సరుకులను చేర్చారు. అలాగే, 'మా ఊరికి రోడ్డు కావాలి సర్..' అని దీపిక అడిగిన వెంటనే డిప్యూటీ సీఎం స్పందించి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీపిక కుటుంబానికి ఇంటిని నిర్మించి ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారని జనసేన నాయకులు తెలిపారు. గృహనిర్మాణం పూర్తి అయిన వెంటనే అవసరమైన వస్తువులను సమకూరుస్తామని చెప్పారు. దీపిక తల్లిదండ్రులు చిక్క తిమ్మప్ప, చిత్తమ్మ డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, జట్టు సభ్యురాలైన కరుణకుమారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ తగిన సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు 24 గంటలు గడవక ముందే ఎల్ఈడీ టీవీ, గ్రైండర్, ఐరన్ బాక్స్, టేబుల్ ఫ్యాన్, కుర్చీలు, కుక్కర్లు, ఇతర వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి గ్రామంలోని కరుణకుమారి ఇంటికి పంపించారు. కరుణకుమారి తల్లిదండ్రులు రాంబాబు, సంధ్యలకు రాష్ట్ర జానపద కళల అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య ఆ సరుకులను అందించారు. పవన్‌కల్యాణ్ చూపిన ఆదరణకు రుణపడి ఉంటామని రాంబాబు, సంధ్య పేర్కొన్నారు.

దేశ గౌరవాన్ని నిలిపిన నేత వాజపేయి

- విలువలతో రాజకీయం చేసిన మహనీయుడు: మాధవ్
- నంద్యాలలో మాజీ ప్రధాని అటల్ విగ్రహావిష్కరణ



వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్



కడప సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

నంద్యాల నూనెపల్లి, కడప మారుతీనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశ గౌరవాన్ని ప్రపంచ వేదికపై నిలిపిన నాయకుడు మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొనియాడారు. వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా మాధవ్ చేపట్టిన సుపరిపాలన యాత్ర శనివారం నంద్యాలకు చేరుకుంది. మంత్రులు సత్యకుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారు వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... సిద్ధాంతాలు, విలువలతో రాజకీయం చేసిన అరుదైన మహనీయుడు వాజపేయి అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఐటీ, పారిశ్రామిక, విద్య తదితర రంగాల అభివృద్ధికి ఆయన పునాది వేస్తే దానికి కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని హోదాలో దేశాభివృద్ధికి ఎంతో చేశారన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ అందరినీ కలుపుకొని వెళ్లే వ్యక్తిత్వం కలిగిన నాయకుడు వాజపేయి అన్నారు.

సేవ చేయకపోయినా ఊరూరా విగ్రహాలు

'దేశ అభివృద్ధికి పునాది వేసిన దార్శనికుడు వాజపేయి. కానీ కొంతమంది ప్రజలకు సేవలందించకపోయినా వారి విగ్రహాలు ఊరూరా ఏర్పాటు చేస్తున్నారు' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం కడప నగరం రాజీవ్‌మార్గ్ రోడ్డులో ఏడున్నర అడుగుల వాజపేయి కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలసి ఆవిష్కరించారు. అనంతరం సత్యకుమార్ మాట్లాడుతూ కొంతమంది నాయకుల ముసుగులో వారి విగ్రహాలు ఊరూరా, సందుసందులో ఏర్పాటు చేయిస్తూ స్వంత చిన్నాన్ననే లేపేశారన్నారు. మన కడపోడు, మనవాడు అని సంకనెత్తుకుంటే రాష్ట్రం కోలుకోలేని రీతిగా దెబ్బతింటుందన్నారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వాజపేయి బలమైన దేశ నిర్మాణం కోసం తపిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రి సవిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, నాగోతు రమేశ్‌నాయుడు, జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,00,746 కేసుల పరిష్కారం

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే 2,00,746 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ 52.56 కోట్ల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ ఎన్.రవినాథ్ తిల్హరి మార్గదర్శకంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దిగువ న్యాయస్థానాల్లో 431 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ కుంచెం మహేశ్వరరావు, జస్టిస్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న 150 కేసులు పరిష్కరించి రూ 2.81 కోట్ల పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌లు విజయవంతమవడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి మృతి

- నేడు అమలాపురానికి భౌతికకాయం రాక



మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి

అమలాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ఏఐసీసీ సీనియర్ నేత కుసుమ కృష్ణమూర్తి(85) శనివారం ఢిల్లీలోని నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం అమలాపురం తీసుకురానున్నారు. 1977-80, 1980-84, 1989-1991లలో అమలాపురం ఎంపీగా ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్, ఏఐసీసీ సంయుక్త కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తిగా కృష్ణమూర్తికి మంచి పేరుంది. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కమిషన్లు ఖాళీ!

రాజ్యాంగబద్ధ పదవుల భర్తీ ఎప్పుడు?.. చైర్మన్లు, కమిషనర్లు లేక సంస్థల వెలవెల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా కీలకమైన కమిషన్లకు చైర్మన్లు, సభ్యుల నియామకంలోనూ ఎడతెగని జాప్యం చేస్తోంది. దీంతో అటు న్యాయపరంగా కూడా చిక్కులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి నామినేటెడ్ పదవుల భర్తీవిషయంలో ఎడతెగని జాప్యం చేసిన ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత తొలి జాబితా విడుదల చేసింది. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భర్తీ దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. అయితే, కీలకమైన రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీ విషయంలో మాత్రం ఇంకా చర్యలు తీసుకోలేదు. కీలక పోస్టుల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోందని ఈ ఏడాది సెప్టెంబరులో హైకోర్టు కూడా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీని ఎప్పటిలోగా చేపడతారో తెలియజేయాలని ఆదేశించింది. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నామినేటెడ్ పదవుల మాదిరి రాజ్యాంగ బద్ధ పదవులకు కుల సమీకరణాలు చూసుకోవాల్సిన అవసరం లేదు. అర్హత, విధేయతను ప్రామాణికంగా తీసుకుంటే సరిపోతుంది. అయినా.. వీటి భర్తీలో జాప్యం జరుగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలోనూ ఇదే తీరు..

టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ నామినేటెడ్ పదవులు.. రాజ్యాంగబద్ధ పదవుల భర్తీపై పెద్దగా దృష్టి సారించడం లేదన్న వాదన ఉంది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా నామినేటెడ్ రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీలో జాప్యం చేస్తూ వచ్చారు. ఓ వైపు రాష్ట్ర విభజన మరో వైపు రెవెన్యూ లోటు వంటి సమస్యలతో రాష్ట్రంపై ఆర్థికంగా భారంపడే అవకాశం ఉందని భావించి అప్పట్లో వీటి భర్తీ విషయంలో జాప్యం చేశారన్న ప్రచారం జరిగింది.


లేనివి కూడా సృష్టించి!

2019లో వచ్చిన జగన్ సర్కార్ ఎడాపెడా నామినేటెడ్, రాజ్యాంగ బద్ధ పదవులు భర్తీ చేసింది. అంతే కాదు కొత్తగా పదుల సంఖ్యలో కార్పొరేషన్లను సృష్టించి మరీ పదవుల పందేరం చేసింది. కార్పొరేషన్ల చైర్మన్లకు కార్యాలయాలు, కుర్చీలు లేకపోయినా వారి జీతాల విషయంలో మాత్రం ఉదారత కనబరిచింది.

తక్షణం భర్తీ చేయాల్సినవి ఇవీ..

- రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ పదవి 2024, ఫిబ్రవరి నుంచే ఖాళీగా ఉంది. ఈ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు నలుగురు సభ్యులు ఉంటారు. ప్రస్తుతం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో కమిషన్ పాత్ర కీలకంగా ఉంటుంది. అలాంటి పదవిని సుమారు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంచారు.
- ఏపీ సమాచార హక్కు కమిషన్(ఆర్‌టీఐ)లో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తోపాటు 10 మంది వరకు కమిషనర్లను నియమించుకునే వెసులుబాటు ఉంది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పదవీకాలం ఈ ఏడాది అక్టోబరుతో పూర్తయింది. ప్రస్తుతం కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే ఉన్నారు. దీంతో అప్పీళ్ల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.
- ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్‌సీ)లో చైర్మన్ పదవి ఈ ఏడాది అక్టోబరులో ఖాళీ అయింది. మొత్తం 9 మంది సభ్యులకుగాను 3 పోస్టులు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల ప్రక్రియపై కమిషన్‌లోని ఖాళీలు ప్రభావం చూపే అవకాశం ఉంది.
- ఏపీ హెచ్‌ఆర్సీ(మానవహక్కుల కమిషన్) చైర్మన్ పదవి 2024, మార్చి నుంచి ఖాళీగా ఉంది.
- ఏపీ ఈఆర్సీ(విద్యుత్తు నియంత్రణ) చైర్మన్ పదవి 2024, అక్టోబరు నుంచి ఖాళీగా ఉంది.
- ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ పదవి ఇటీవలే ఖాళీ అయింది.
- ఏపీ వక్ఫ్, ఎండోమెంట్ ట్రైబ్యునళ్లు ఏడాదికిపైగా ఖాళీగా ఉన్నాయి.
- ఏపీ లోకాయుక్త.. 2024, సెప్టెంబరు నుంచి ఖాళీగా ఉంది.
- బాలల హక్కుల కమిషన్, బీసీ కమిషన్ వంటి పలు రాజ్యాంగబద్ధ సంస్థలకు చైర్మన్ల నియామకం జరగాల్సి ఉంది.

తమిళనాడులో మదురై జిల్లాలోని 'తిరుప్పరం కుండ్రం'.. ఓ రాతి స్తంభం కేంద్రంగా జరుగుతున్న వివాదంలో వినిపిస్తున్న పేరు! అక్కడి పర్వతాలయం వద్ద కార్తీక దీపం వెలిగించడంపై వివాదం కొనసాగుతోంది. శిఖరాగ్రంపై ఉన్న రాతి స్తంభంపై వెలిగించాలని పలు హిందూ సంస్థలు పట్టుబడుతుండగా.. ఉచ్చి పిళ్లయార్ ఆలయం ఎదురుగానే దశాబ్దాలుగా ఈ కార్యక్రమం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలు కూడా వివాదాస్పదమయ్యాయి. దీంతో ఆ న్యాయమూర్తి అభిశంసన కోసం ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అసలు వివాదానికి కారణమేంటి? ఇన్నాళ్లుగా లేనిది ఇప్పుడు ఎందుకు మొదలైంది? అనేది చూద్దాం..



దీప స్తంభమా? సర్వే రాయా?

'తిరుప్పరంకుండ్రం' ఆలయ రాతి స్తంభం కేంద్రంగా తమిళనాడులో రేగిన వివాదం

- అక్కడ కార్తీక దీపం వెలిగించేందుకు పలు హిందూ సంస్థల ప్రయత్నాలు
- అది సర్వే రాయి అంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- శతాబ్దాలుగా మతసామరస్యం వర్ధిల్లుతున్న ప్రాంతంలో చర్చకు దారితీసిన రగడ
- దర్గా వద్ద 'జంతుబలి'తో వివాదం ప్రారంభం

(చెన్నై - ఆంధ్రజ్యోతి)

తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ (సుబ్రహ్మణ్యస్వామి) కొలువై ఉన్న ఆరు దివ్యక్షేత్రాల్లో మొదటిది తిరుప్పరంకుండ్రం. ఈ పర్వతాలయం మదురై నుండి 8 కిలో మీటర్ల దూరంలో ఉంది. దీన్ని 'పరంకుండ్రు' అని పిలిచేవారని తమిళ 'సంగ సాహిత్యం' పేర్కొంటోంది. ఈ శైవాలయాన్ని పాండ్యరాజులు క్రీ.శ. 10వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. విజయనగర రాజులు ఈ ఆలయాన్ని మరింత విస్తరించారు. ఈ పర్వతం ఎత్తు 300 మీటర్లు. ఇక్కడ 2 వేల ఏళ్ల క్రితం జైనులు ఆశ్రమాలు ఏర్పరచుకొన్నట్లు శాసనాలు, శిల్పాలు చెబుతున్నాయి. సర్వతంపై, సమీపాల్లో పలు ఆలయాలతో పాటు పర్వతం మధ్యలో ఓ దర్గా ఉంది. ఈ పర్వతం అనాది నుంచి మత సామరస్యాన్ని చాటుతోంది.

వివాదం ఎక్కడ ప్రారంభమైంది?

అక్కడున్న ఓ రాతి స్తంభంపై వివాదం గత ఏడాది డిసెంబరులో ప్రారంభమైంది. విరుదునగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దర్గాలో మొక్కుబడి బలి ఇచ్చేందుకు కొండపైకి ఎక్కుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ వ్యవహారంలో సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జోక్యం చేసుకొని, దర్గా భక్తుల హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ జనవరి 5న రాస్తారోకో చేపట్టింది. అదే సమయంలో 'కందర్ మలై'ని 'సికందర్‌మలై'గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రచారం జరిగింది. అదే సమయంలో పోలీసుల వైఖరికి నిరసనగా జనవరి 8న దర్గాలో మాంసాహార విందు ఇచ్చి తీరుతామంటూ ఎస్‌డీపీఐ ప్రకటించింది. దర్గా వద్ద జంతుబలిని నిషేధించాలని హిందూ సంస్థల నేతలు, దర్గా ఉన్న 50 సెంట్ల భూమి వక్ఫ్ బోర్డుకు చెందినందున అక్కడ వంట చేసుకోవడంలో తప్పు లేదని ముస్లిం నేతలు ప్రకటనలు చేశారు. ఆ తర్వాత కొందరు ముస్లింలు బిర్యానీ తింటున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో మరింత వివాదం రేపింది.

న్యాయస్థానాల్లో భారీగా పిటిషన్లు

వివాదంపై హిందూ మక్కల్ కట్చి, హిందూ మున్నని వంటి సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దర్గాకు దారి తీసే ప్రాంతమైన నెల్లితోపు వద్ద ముస్లింల ప్రార్థనలను నిషేధించాలని, కొండపై జంతుబలిని నిషేధించాలని కొంత మంది కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎస్.శ్రీమతి, జస్టిస్ నిషా భాను ధర్మాసనం భిన్న తీర్పులు ఇచ్చింది. అక్కడ కొన్ని ప్రాంతాల్లో జంతుబలి చేపట్టాలన్నా, నమాజ్ చేసుకోవాలన్నా సివిల్ కోర్టు అనుమతి తప్పనిసరి అని జస్టిస్ శ్రీమతి పేర్కొన్నారు. జస్టిస్ నిషాభాను మాత్రం పిటిషన్లను కొట్టివేశారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ ఆర్.వి జయకుమార్ తీర్పు కీలకంగా మారింది. కొండపైకి అనుమతి లేకుండా జంతువులను తీసుకెళ్లడం, బలి ఇవ్వడాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో దర్గా నిర్వాహకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జూన్ 22న మదురైలో మఠాధిపతులు, జీయర్లు, శివాచార్యులు, బీజేపీ నేతలు 'మురుగన్ సదస్సు' నిర్వహించారు. 'హిందూ తమిళర్ పేరవై' నేత రామరవికుమార్ రాతి స్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతించాలని కోరుతూ గత నెల హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన జస్టిస్ జీఆర్ స్వామినాథన్ స్తంభంపై దీపం వెలిగించాలని ఆదేశాలిచ్చారు. మరోవైపు తిరుప్పరంకుండ్రం మరో అయోధ్యగా మారనుందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రన్ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కాగా, దీప స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతించాలంటూ శనివారం 50 మంది ఇక్కడ నిరాహారదీక్ష చేపట్టారు.


కొండపై ఉచ్చిపిళ్లయార్ ఆలయం వద్ద వెలుగుతున్న కార్తీక మాస మహాజ్యోతి

దర్గాకు సమీపంలో రాతి స్తంభం

తిరుప్పరంకుండ్రం గర్భాలయానికి పైభాగాన ఉన్న ఉచ్చి పిళ్లయార్ ఆలయం వద్ద దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏటా కార్తీక దీపాన్ని వెలిగిస్తున్నారు. 75 ఏళ్ల నుంచి ఇక్కడే దీపం వెలిగిస్తున్నట్లు రికార్డులున్నాయి. ఆ ఆలయం నుండి 200 అడుగుల ఎత్తులో 14వ శతాబ్దం నాటి దర్గా ఉంది. అక్కడి నుండి 200 అడుగుల దూరంలో ఒక రాతి స్తంభం ఉంది. దాన్నే ఆలయ 'దీపస్తంభం'గా భావిస్తున్న హిందూ సంస్థలు.. దానిపై కార్తీక మహా దీపాన్ని వెలిగించాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే 1802లో ఆంగ్లేయులు 'గ్రేట్ ట్రిగోనామెట్రిక్ సర్వే' జరిపినప్పుడు ఈ స్తంభం ఏర్పాటు చేసినట్లు పురావస్తుశాఖ రికార్డులు చెబుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ఆంగ్లేయులు మదురై నగర మ్యాప్‌ను రూపొందించడానికి ఈ సర్వే రాయి ప్రాంతాన్ని ఆధారంగా చేసుకొని ఉండొచ్చని పురావస్తు శాఖ పరిశోధకులు అంచనా వేస్తున్నారు.


కొండపైనున్న హజరత్ సుల్తాన్ సికిందర్ పాదుషా అవులియా దర్గా

అంగన్వాడీ కేంద్రాల్లో 'ముస్తాబు'

- పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన
- రాష్ట్రవ్యాప్తంగా త్వరలో అమలు: సంధ్యారాణి



పార్వతీపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆలోచనతో.. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చేపట్టిన ముస్తాబు కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. విద్యార్థుల్లో శుభ్రత పట్ల అవగాహన పెంచడం... బడికి చక్కగా తయారై రావడమే ఈ పథకం ఉద్దేశం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం క్యాబినెట్‌లో ప్రశంసలు కురిపించారు. ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేస్తామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. శనివారం పార్వతీపురంలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కో-ఆర్డినేటర్లకు మంత్రి చేతులమీదుగా సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆలోచనతో.. ప్రభుత్వ బడుల్లో చేపట్టిన ముస్తాబు కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో మంచి ఆరోగ్యంతో పాటు వారికి వ్యక్తిగత పరిశుభ్రత అలవాటవుతుందని తెలిపారు. కాగా, అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందని, జీతాల సమస్యను పరిష్కరించాలని త్వరలోనే సీఎంను కోరుతామని చెప్పారు.

ఇది కార్మికులకు దక్కిన గౌరవం!

- పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపుపై కేంద్రమంత్రి రామ్మోహన్



పొందూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు లభించడం.. నేత, వడుకు కార్మికులందరికీ లభించిన గొప్ప గుర్తింపు అని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఢిల్లీ నుంచి శనివారం ఆయన ఓ సందేశాన్ని విడుదల చేశారు. రాష్ట్రంలో తిరుపతి లడ్డూ, కొండపల్లి బొమ్మలు, బొబ్బిలి వీణ తరువాత పొందూరు ఖాదీకే భౌగోళిక గుర్తింపు వచ్చిందన్నారు. మహాత్మాగాంధీ మన్ననలను పొందిన పొందూరు ఖాదీకి ఎట్టకేలకు విశిష్ట గౌరవం లభించిందని తెలిపారు. ఖాదీ కార్మికులకు ఆధునిక పరికరాలు అందించడమే కాకుండా వారికి మెరుగైన జీవనప్రమాణాలు అందిస్తామని, తద్వారా ఖాదీకి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. భౌగోళిక గుర్తింపు వచ్చేందుకు సహకరించిన ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం-నల్లమలసాగర్‌పై

సుప్రీంలో కేవియట్!

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

- ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ కేసు వేసే యోచన నేపథ్యంలో అప్రమత్తం



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకంపై సుప్రీం కోర్టులో కేవియెట్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలని యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను తయారు చేసేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి ఇప్పటికే జలవనరుల శాఖ బిడ్లను ఆహ్వానించింది. ఇందుకు తుది గడువు ఈ నెల 11వ తేదీతో ముగియగా, రెండు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. జలవనరుల శాఖ వీటిని పరిశీలిస్తోంది. ఎల్-1గా వచ్చిన సంస్థకు డీపీఆర్ తయారీ బాధ్యతను అప్పగించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య జల వివాదం పరిష్కారమయ్యేంత దాకా కొత్త ప్రాజెక్టులు కట్టకుండా ఏపీని నిలువరించాలని కోరుతూ కేంద్ర జల శక్తి కార్యదర్శి వీఎల్‌కాంతారావుకు శనివారం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి లేఖ రాశారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం డీపీఆర్‌ను తయారు చేయకుండా నిలువరించాలని కోరారు. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీం కోర్టులో కేసు వేయాలని నిర్ణయించినట్టు తెలంగాణ నీటి పారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో న్యాయపరమైన సంప్రదింపులు చేపట్టింది. దీంతో రాష్ట్ర జలవనరుల శాఖ అప్రమత్తమైంది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేలా జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం, కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీరుకు బాధ్యతలు అప్పగించింది. సుప్రీం కోర్టులో కేవియెట్ వేసే బాధ్యతలనూ అప్పగించింది. డీపీఆర్ తయారీని అడ్డుకునే హక్కు ఇతర రాష్ట్రాలకు ఉండదని జలవనరుల శాఖ చెబుతోంది. సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలను దిగువ రాష్ట్రంగా సద్వినియోగం చేసుకుంటామని అంటోంది. ఈ హక్కును కాదనే అధికారం ఎవరికీ లేదని చెబుతోంది. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు న్యాయ పోరాటం చేస్తామని 'ఆంధ్రజ్యోతి'కి జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ తయారు చేయకుండా నిలువరించాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ కేసు వేసినా న్యాయపరంగా నిలువబోదని అన్నారు.


ప్రాజెక్టులో రాతి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పోలవరంలో రెండో రోజు సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

పోలవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో మట్టి, రాయి నాణ్యత పరీక్షలను శనివారం రెండో రోజూ సెంట్రల్ శాయిల్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. శాస్త్రవేత్తలు హరేంద్ర ప్రకాశ్, ఉదయ్ భాను చక్రవర్తి, సిద్ధార్థ్ పి.హెడవు ప్రాజెక్టు గ్యాప్ 1, 2 ప్రాంతాల్లో మట్టి నాణ్యత, రాయి పటిష్ఠతను పరీక్షించారు. ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించే మట్టి, రాయి నాణ్యత ప్రమాణాలనూ పరిశీలించారు. కొన్ని శాంపిల్స్ సేకరించారు. ఇంజనీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తికి సేకరించిన శాంపిల్స్ స్వభావం గురించి వివరించి మరికొన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ బృందం ఆదివారం ఢిల్లీ బయల్దేరి వెళ్తుంది. కేంద్రం జల వనరుల శాఖకు ప్రాజెక్టు వద్ద నిర్వహించిన పరీక్షలపై నివేదిక ఇస్తుంది. బృందంతో పాటు ఈఈలు డి.శ్రీనివాస్, బాలకృష్ణ, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి, మేనేజర్లు వెంకటేశ్, గణపతిరావు తదితరులు ఉన్నారు.

మత్తుకు చిత్తైన కూతురి జీవితం!

- మనస్తాపంతో తల్లి ఆత్మహత్యాయత్నం.. పరామర్శించిన ఈగల్ ఐజీ, ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలోనే చదువు ఆపేసిన గుంటూరుకు చెందిన 17 ఏళ్ల బాలికను ఇన్‌స్టాగ్రాంలో ఇద్దరు యువకులు మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగారు. ఆ చిన్నారిని మత్తుకు బానిస చేసి.. తమ కామవాంఛలు తీర్చుకున్నారు. మత్తుకు బానిసైన కూతురి విపరీత ధోరణి చూసి.. బాలిక తల్లి కలత చెంది.. 30 మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. చావుబతుకుల మధ్యలో జీజీహెచ్‌లో కొట్టుమిట్టాడుతున్న ఆ తల్లిని శనివారం ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ శనివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరామర్శించారు. బాలిక సాధారణ స్థితికి చేరుకునేలా డీ అడిక్షన్ కేంద్రానికి తరలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులకు సత్వర శిక్ష పడే విధంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'చలి కుంపటి'కి వృద్ధురాలు బలి

తెర్లాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చలి నుంచి తట్టుకునేందుకు ఓ వృద్ధురాలు మంచం కింద వెచ్చని సెగతో కుంపటి పెట్టుకుని నిద్రపోయింది. ఆమె గాఢనిద్రలో ఉండగా మంటలు చెలరేగి అగ్నికీలల్లో చిక్కుకుని చనిపోయింది. విజయనగరం జిల్లా తెర్లాం మండలం సీతారాంపురంలో కోస్టు పాపమ్మ(70) చలిని తట్టుకునేందుకు శుక్రవారం రాత్రి మంచం కింద.. వెచ్చగా తగిలేలా నిప్పుల కుంపటి పెట్టుకుని పడుకుంది. 11గంటల సమయంలో మంచానికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. పక్కన ఉన్న పూరిళ్లకు కూడా మంటలు వ్యాపించాయి. ఇంట్లోనే ఉన్న పాపమ్మ కోడలు లక్ష్మి కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. మంటలంటుకున్న ఇళ్లల్లో నుంచి కూడా అందరూ బయటికి వచ్చారు. పూరింట్లో చిక్కుకుపోయిన పాపమ్మ అగ్నికీలల్లో కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో 12 ఇళ్లు పూర్తిగా దగ్ధం కాగా సుమారు రూ.6 లక్షలు ఆస్తినష్టం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మరికొన్ని రోజులు గజగజ!

విశాఖపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగనుంది. అనేకచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 3.3, డుంబ్రిగుడలో 4.1, ముంచంగిపుట్టులో 4.4, జి.మాడుగులలో 4.8, చింతపల్లిలో 5.5, పాడేరులో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు పూర్తిగా బలహీనపడ్డాయి. ఈ ఏడాది హిందూ మహాసముద్రంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడమే దీనికి కారణమని అంటున్నారు. ఈనెల 16తర్వాత రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో చలి గాలుల తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది.

నూతన సీఐసీగా రాజ్‌కుమార్ గోయల్

- కేంద్ర సమాచార కమిషనర్లుగా మరో 8 మంది
- వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి
- ప్రధాని నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సిఫారసు
- తాజా నియామకాలతో కమిషన్‌లో ఖాళీలన్నీ భర్తీ
- తొమ్మిదేళ్ల తర్వాత పూర్తిస్థాయి బలంతో సీఐసీ
- రేపు రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణస్వీకారం


రాజ్‌కుమార్ గోయల్

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) కొత్త చీఫ్‌గా న్యాయ శాఖ మాజీ కార్యదర్శి, 1990 బ్యాచ్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో ఎనిమిది మందిని కమిషనర్లుగా ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరిలో సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, రైల్వే బోర్డు మాజీ చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా, సామాజిక న్యాయం, సాధికారత మాజీ కార్యదర్శి సురేంద్ర సింగ్ మీనా, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి స్వాగత్ దాస్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కుశ్వంత్ సింగ్ సేథి, పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) సభ్యురాలైన (లీగల్) ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి, రిటైర్డ్ ఐఏఎస్ సంజీవ్ కుమార్ జిందాల్ ఉన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సిఫారసులు చేసిందని అధికారులు శనివారం వెల్లడించారు. సీఐసీగా రాజ్‌కుమార్ గోయల్ చేత రాష్ట్రపతి ముర్ము సోమవారం ప్రమాణస్వీకారం చేయించనున్నారని తెలిపారు. రాజ్‌కుమార్ గోయల్ అరుణాచల్‌ప్రదేశ్-గోవా-మిజోరం-యూనియన్ టెరిటరీస్ (ఏజీఎంయూటీ) క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ఈ ఏడాది ఆగస్టు 31న న్యాయ మంత్రిత్వ శాఖ పరిధిలోని న్యాయ విభాగం కార్యదర్శిగా పదవీ విరమణ పొందారు. గోయల్ కేంద్ర హోంశాఖలో కార్యదర్శి (బోర్డర్ మేనేజ్‌మెంట్)తో పాటు కేంద్రం, జమ్మూకశ్మీర్‌లో పలు కీలక పోస్టుల్లో పనిచేశారు.

ముగ్గురు మహిళలు

తాజా నియామకాలతో కేంద్ర సమాచార కమిషన్‌లో చీఫ్‌తో సహా తొమ్మిది ఖాళీలు భర్తీ అయినట్లు లెక్క. ప్రస్తుతం కమిషన్‌లో ఆనంది రామలింగం, వినోద్ కుమార్ తివారీలు మాత్రమే కమిషనర్లుగా విధులు నిర్వర్తిసున్నారు. తాజా నియామకాలతో కమిషన్‌లో ఆనంది రామలింగంతో పాటు ముగ్గురు మహిళా కమిషనర్లు (మిగతా ఇద్దరు జయవర్మ సిన్హా, సుధారాణి) ఉండనున్నారు. ప్యానెల్‌లో ఈ సంఖ్యలో మహిళలు ఉండడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి అని అధికార వర్గాలు తెలిపాయి. అదేవిధంగా దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత కమిషన్‌లో సభ్యుల సంఖ్య పూర్తిస్థాయి బలానికి చేరనుంది. హీరాలాల్ సమరియాకు 65 ఏళ్లు నిండిన కారణంగా ఆయన ఈ ఏడాది సెప్టెంబరు 13న బాధ్యతల నుంచి వైదొలగడంతో సీఐసీ పదవి ఖాళీ అయింది. అలాగే మిగతా ఎనిమిది పోస్టులు కూడా 2023 నవంబరు నుంచి ఖాళీగానే ఉన్నాయి. కాగా, కేంద్ర సమాచార కమిషన్ నియామకాలపై ఇటీవల రాజకీయ దుమారం రేగిన విషయం తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారికి కమిషన్‌లో తగిన ప్రాతినిధ్యం లేదంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బుధవారం జరిగిన ఉన్నతస్థాయి త్రిసభ్య కమిటీ సమావేశంలో అసమ్మతి నోట్ సమర్పించారు. అయితే ఆ తర్వాత రాహుల్ వాదనను కేంద్ర ప్రభుత్వం తిప్పికొట్టింది. త్రిసభ్య కమిటీలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉంటారు.

సుధారాణి రేలంగి నేపథ్యం..



కేంద్ర సమాచార కమిషనర్‌గా ఎంపికైన ఎనిమిది మందిలో సుధారాణి రేలంగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ. సుధారాణి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీఎస్సీతో పాటు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఫైనాన్స్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్ లాలో ఎల్ఎల్ఎమ్ చేశారు. సివిల్ సర్వీస్‌లో ఇండియన్ లీగల్ సర్వీస్ క్యాడర్‌కు చెందిన సుధారాణికి న్యాయరంగంలో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం ఆమె పీఎన్‌జీఆర్‌బీ సభ్యురాలిగా ఉన్నారు. గతంలో ఆమె సీబీఐ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా, కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ, లెజిస్లేటివ్ కౌన్సెల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.